సంపుటి: 28

సంచిక: 6

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 45 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 275 రూపాయలు.

జులై, 1979

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్‌రావ్
విద్వాన్ షీలాదేవి

తొలిమాట

నమస్కారము. మీ అభిమాన రచయిత సికిందర్‌గారి కలం నుండి వెలువడ్డ సరికొత్త సీరియల్ 'సీక్రేట్ గ్యాంగ్' యీ సంచికలో ప్రారంభమైంది. ఇది ప్రత్యేకించి డిటెక్టివ్ సీరియల్. డిటెక్టివ్ లాల్ అండ్ జాన్‌ల పరిశోధన డిటెక్టివ్ సాహిత్యానికే వన్నె తెస్తున్నది.

'సప్లిమెంట్'లో మేము 3 నవలలు ఇవ్వటం చాలామందికి నచ్చినట్లున్నది. అధిక సంఖ్యాకులు 4 నవలలు కావాలనే వ్రాశారు. 3 నవలలకు అతి కొద్దిమంది తమ సుముఖాన్ని వ్యక్తం చేశారు. అయితే 'పరువు ఖరీదు' గొలుసు నవల మాత్రం ఇంచుమించు అందరినీ ఆకట్టుకున్నది. అటువంటి గొలుసు నవలలు ఎక్కువగా కావాలంటూ, ఎక్కువమంది పాఠకులు వ్రాశారు.

డిటెక్టివ్ సాహిత్యంలో ఎవరైనా కొత్త పత్రిక పెడుతున్నారంటే చాలా సాహసం చేస్తున్నారనే చెప్పాలి. ఎందుకంటె— దీనిలో ఎదురుదెబ్బలు, కష్టనిష్ఠూరాలే ఎక్కువ. అవన్నీ తట్టుకొని ఎవరైనా కొత్త పత్రిక పెట్టినా, చివరకు మార్కెట్లో నిలదొక్కుకోవటం కష్టమవుతుంది. ఇది డిటెక్టివ్ సాహిత్య ప్రతిష్ఠకు అంత శోభ నివ్వదు.

డిటెక్టివ్ సాహిత్యంలో ప్రస్తుతం మనకు 3 పత్రికలే ఉన్నాయి. సుమారు 6 కోట్ల తెలుగు జనానికి 3 పత్రికలు ఎంతమాత్రం చాలవు. ఇంకా చాలా పత్రికలు రావాలి. చిన్నా పెద్ద పత్రికలు ఎన్ని ఎక్కువ వస్తేనే అంత సాహిత్యానికి గౌరవప్రదమవుతుంది. కొత్త పత్రికలను ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతి డిటెక్టివ్ సాహిత్య ప్రియుడిపైనా వుంది. యీ సాహిత్యంలో మళ్ళీ 'స్వర్ణయుగం' వస్తుందని ఆశిద్దాం!

సెలవామరి— మీ

—శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. చంపడమే వృత్తి—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
14. రామాంజనేయ యుద్ధం—వసుంధర.
31. నమ్మదగని సాక్ష్యం—కృష్ణచైతన్య.
46. ముందు చూపు—వి. లక్ష్మీదేవి.
57. పరమశివునిపై దావా—డాక్టర్ ప్రభాకర్.
66. ఇద్దరూ ఇద్దరే—ప్రతాప రవిశంకర్.
79. ఖైదులోంచి పరారీ—ఎమ్. వి. వి. సత్యనారాయణ.
100. ఇంటి దొంగ—అంధవరపు మల్లిబాబు.
111. కొత్తవాళ్ళని పలకరించకు—మల్లాదివెంకటకృష్ణమూర్తి.
126. పైటకొంగున రక్తపుబొట్లు—ఎల్. రామ్‌గోపాల్.
141. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'.

నవలలు (సప్లిమెంట్)

3. కలలోని హంతకుడు—వసుంధర
53. మాయమైన వంటగత్తె (పరువు ఖరీదు-రెండవ భాగం)—'సికిందర్'.
109. బంగారు గూడు-వజ్రాల గుడ్లు—అజీజ్.
171. అడుగుముందుకు వేస్తే చస్తావ్(సీరియల్)—వసుంధర.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖి, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

చంపడమే వృత్తి

మల్లాది వెంకట కృష్ణమూర్తి



నా మెడ వెనక చల్లగా తగిలిందేదో. వెంటనే మాటలు వినబడ్డాయి.

"నా చేతిలో పిస్తోలువుంది."

ఆ కంఠం కర్కశంగా లేదు. మామూలుగా వుంది.

మొగ కంఠం.

క్లబ్‌నించి బయటకి వచ్చాక డ్రయివర్ సీట్‌లో కూర్చుని కారు స్టార్ట్ చేసాను. కారు పార్క్ చేసిన చోటు చీకటిగావుంది. కారులో వెనకాల ఎవరయినా ఎక్కి దాక్కుని వుంటారన్న ఆలోచనే కలగలేదు నాకు. లేక పోతే చూసివుండేవాడిని ముందరే.

"ఏమాత్రం గొడవచేసినా ఇక్కడే కాలుస్తాను."

"ఎవరు నువ్వు?" అడిగాను.

"చట్టం దృష్టిలో నేరస్థుణ్ని. నా కస్టమర్స్ దృష్టిలో వ్యాపారస్థుణ్ని."

"నీ భార్య దృష్టిలో మొగుడివి" నవ్వాను గలగలా.

అతనికి కోపం వచ్చిన గుర్తుగా పిస్తోలు బేరల్‌ని మరింత గట్టిగా అదిమాడు నా మెడమీద.

"కారు నేరుగాపోనీ."

"ఎక్కడికి?" అడిగాను గేరు మారుస్తూ.

"ఊరు బయటకి."

"దేనికి?"

నా జేబులో డబ్బుంది. చేతికి వాచి, ఉంగరాలున్నాయి. వాటికోసమే అయితే వూరు చివరదాకా వెళ్ళాల్సిన పనిలేదు.

నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు అతను.

నన్ను వూరిబయట కారులోంచి బయటకి నెట్టేసి, ఈ కారు దొంగతనంచేసి పారిపోతాడా? కారుదొంగా? కారు దొంగే అయితే సీటు వెనకాల దాక్కుని నన్ను బెదిరించ కుండా క్లబ్బు దగ్గిరే ఎత్తుకుపోవచ్చుగా? ఇక్కడ దిగమని ఆ పని చేయవచ్చుగా?

"ఏం వ్యాపారం నీది?" అడిగాను నా దృష్టి రోడ్డు మీద కేంద్రీకరించి.

"లాభసాటి వ్యాపారం. తెలుస్తుందిగా ఇంకో అయిదు నిముషాల్లో."

నేను ఆలోచించ సాగాను. సడన్ బ్రేక్ వేస్తే? కాలుస్తాడా? అది నిజం పిస్తోలేనా అసలు? లేక బొమ్మ తుపాకీనా?

"మిష్టర్ ప్రమోదరావు. నువ్వు బ్రతికేది ఇంక కొన్ని నిముషాలే."

"నీకు జ్యోతిషం వచ్చా? అయినా నా చెయ్యి చూడ లేదుగా!" నవ్వాను.

"జోక్ కాదు. నిజంగా చెప్తున్నాను."

"నీకేలా తెలుసు?"

"నేనే చంపబోతున్నాను కనుక."

"నన్ను చంపుతావా?"

"అవును."

"అంటే హత్య.... హంతకుడివా నువ్వు?"

"కరెక్టు."

కొన్ని క్షణాలు మాట్లాడలేదు నేను. తర్వాత అడిగాను.

"మోటివ్?"

"నిన్ను హత్యచేస్తే నాకు వెయ్యి రూపాయలు లభిస్తాయి."

"అంటే చంపటం నీ వృత్తా?"

"కాదు. వ్యాపారం."

"నన్ను చంపితే నీకు వెయ్యిరూపాయలు లభిస్తాయా?"

"అవును."

"ఎలా?"

"హైదరాబాద్‌లో ఓ సంస్థవుంది. ఆ సంస్థకోసం పనిచేస్తున్నాను. వాళ్ళిస్తారు."



"ఏమిటా సంస్థ?"

"రహస్యం."

"నా షేర్లున్న కంపెనీనా?"

"అది కంపెనీకాదు. నేను ఆ సంస్థ తరఫున పనిచేస్తున్నాను? ఎవరినయినా చంపాలనుకున్నప్పుడు ఆ సంస్థ సహాయంకోరితే, వాళ్ళు వప్పుకుంటే మూడువేల రూపాయలు తీసుకుంటారు. నాలాంటివాళ్ళు అయిదారుగురు దాకా పనిచేస్తున్నారు. వెయ్యి తీసుకుంటాం చంపడానికి."

"ఇందాక నాపేరేమన్నావ్?"

"ఇందాక, ఇప్పుడు కూడా ప్రమోదరావే....ఏం?"

చిన్నగా నవ్వి చెప్పాను.

"పొరబడ్డావ్. నాపేరు రమేష్. ప్రమోదరావుకాదు. ఈ కారు నా స్నేహితుడు ప్రమోదరావుది. క్లబ్‌లో బ్రిడ్జ్ ఆడుతున్నాడు ఆయన. నేను ఓ పార్టీకి వెళ్ళాలని కారు అరువు అడిగి తీసుకున్నాను."

గలా గలా నవ్వాడు అతను.

"కారాపు ఆ చెట్టుకింద" చెప్పాడు.

కారు హైద్రాబాద్ నగర పొలిమేరల్లో, విజయవాడ వైపు వెళ్ళే ట్రంక్ రోడ్‌లో ఓ చెట్టుకింద ఆపాను. అప్పటికే బాగా చీకటి పడింది.

"ఇంతదాకా నీ మొహం చూడలేదు నేను. కాబట్టి నిన్ను గుర్తుపట్టే అవకాశమేలేదు. కారు వెనక్కి తిప్పి ఇందాక నువు ఈ కారు ఎక్కినచోట ఆపుతాను.దిగిపోదువు కాని.... కాని ప్రమోదరావుకి జరిగింది చెప్పకతప్పదు. నీ వేలిముద్రలు మొదలయినవి లేకుండా చూసుకో."

చీకట్లో మళ్ళీ గల గలా నవ్వాడతను.

"నన్ను మోసంచేసి నీ ప్రాణాలు కాపాడుకోవాలనే ఆలోచన నీకు రావటం సహజమే. కాని నువు ప్రమోద రావని నాకు బాగా తెలుసు."

"నా పేరు రమేష్. నేమ ప్రమో...."

"అబద్ధాలాడి ప్రయోజనంలేదు. నీ కారు నంబర్, ఇంటి చిరునామా, ఆఫీస్ అడ్రస్, టెలిఫోన్ నంబరు, ముఖ్యంగా ఫొటోగ్రాఫ్ నాకు ముందే ఇచ్చారు. రెండు రోజులనించీ నిన్ను వెంటాడుతూ నీ కార్యక్రమం గమ నిస్తూనే వున్నాను."

"పొరబాటు పడటం మానవ సహజం. తర్వాత చింతి స్తావు. వెయ్యి లేకుండా రమేష్‌ని చంపిన వాడివవుతావు."

"నీకు ఇవాళ కనీసం నాలుగు సార్లయినా ఫోన్ చేసాను నీ గొంతు గుర్తుపట్టడానికి. నీ క్లాస్‌మేట్ రాజు అని మాట్లాడాను. నన్ను గుర్తుపట్ట లేవని, ఓసారి ఆఫీస్‌కివచ్చి కలవమనీ చెప్పి ఫోన్ పెట్టేసావు."

"నాకు ఫోన్ చేసావా? లేదే....ఓ. ప్రమోదరావుకి ఫోన్ చేశావన్నమాట."

"నీ ఇష్టదైవాన్ని తలచుకో."

డాక్టర్—కార్డియాలజిస్ట్-నిన్న రాత్రి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"సారీసర్. రెండుసార్లు గుండెపోటు వచ్చి బ్రతికారు. మూడోసారి వస్తే బ్రతకరు. ఇలా చెప్పడానికి చింతిస్తున్నాను. కాని చెప్పక తప్పదు. విల్లు వ్రాయడంలాంటివి పూర్తిచేసేయండి వాయిదా వేయకుండా. అయిదారు వారాలకంటే ఎక్కువ కాలం బ్రతకరు."

నేను నిశ్శబ్దంగా ఆ విషయాన్ని విన్నాను. జవాబు చెప్పలేదు.

"మీ రక్తంలో క్లోరోస్టల్ శాతం ప్రమాదకరమయినంత అధికంగా వుంది. గత రెండేళ్ళుగా చెప్తున్నాను రోజూ ఓ అరగంటసేపు ఈతకొట్టడమో, గంటసేపు నడవటమో మొదలయిన శారీరక పరిశ్రమ చేయమని. మీరు నామాట నిర్లక్షించేస్తూ వచ్చారు. లేకపోతే మరో అయిదారేళ్లు...."

"ఇట్సాల్‌రైట్ డాక్టర్. నేను జీవితంలో అనుకున్నవన్నీ సాధించాను. పొందతగ్గవన్నీ పొందాను. సంపాదించ దలచినంతా సంపాదించాను. ఇంకో అయిదారేళ్ళు అధికంగా బ్రతికి కొత్తగా చేయదగ్గవేమీలేదు. ఐ హేవ్ నథింగ్ టు రిగ్రెట్."

మృత్యువుకి చేరువయ్యాననే సంగతి నా నరాల్లో ఇంకింది. అందుకే భయం లేదు నాకు. అయినా చివరి దాకా ప్రాణాలమీద తీపి వుండటం మానవ సహజం అనుకుంటాను.

"అయితే నన్ను చంపటం తప్పదా?" అడిగాను వెనక సీట్‌లో కూర్చునున్నతన్ని.

"తప్పదు" దృఢంగా చెప్పాడు.

"నీకు వెయ్యి రూపాయలు లభిస్తాయనికదా అన్నావు!"

"అవును."

"నేను అయిదువేలి స్తే?"

"ఏభై వేలిచ్చినా మా సంస్థకిచ్చిన మాట తప్పను. నిన్ను వదిలే స్తే వాళ్ళని మోసం చేసానని నన్ను చంపుతారు ముందర. టార్గెట్‌ని వప్పుకున్నాక ఆఖరికి నా భార్య అయినా సరే చంపక తప్పదు."

"నీ ఆదర్శం మంచిదే....ఎలాగూ చచ్చిపోతున్నాను కాబట్టి ఓ అయిదారు ప్రశ్నలు అడగచ్చా?"

"అడుగు."

"నీ పేరు?"

తటపటాయించి చెప్పాడు.

"అచ్చారావు."

"నువ్వు మారేడ్‌పల్లిలో కదా వుండేది'"

"కాదు, సీతారాంబాగ్‌లో."

"మారేడ్‌పల్లిలో నీకు కూరల దుకాణం వుందికదూ?"

"ఊహూ. సీతారాంబాగ్‌లో గుడి దగ్గర నా ఇల్లు."

"గుడ్. నన్ను చంపమని పురమాయించింది ఎవరో తెలుసా?"

"చెప్పకూడదు నేను."

"ఎలాగూ మరణించబోతున్నా కదా? తెలి స్తే వచ్చే నష్టం లేదుగా!"

"నిజమే. కాని నాకు తెలియదు."

"వారం రోజుల క్రితం నా అన్నయ్య కొడుకు నా ఫోటో ఒకటి ఆల్బంలోంచి తీసుకున్నాడు. వాడే అయి వుండవచ్చా?"



"కావచ్చు."

"నిస్సందేహంగా వాడే. నా తర్వాత ఆస్తి వాడికే వస్తుంది. నేనింకో పదేళ్ళు బ్రతికి వుండేవాడిని. నా ఆస్తిని వాడి ఇష్టం వచ్చిన రీతిలో అనుభవించలేడు. అందుకనేమో ఈ ప్రయత్నం."

"కావచ్చు. యెంత నీ ఆస్తి మొత్తం?"

"పదిహేడు లక్షలు."

"పాతికవేల రూపాయల ఆస్తికోసం కూడా హత్య చేయించినవాళ్ళు తెలుసు నాకు."

"ఇది దుర్మార్గం కదా?"

"సిద్ధమా నువ్వు?"

"నువ్వు!"

ఎదురుగా రెండు కార్లు వస్తున్న గుర్తుగా హెడ్ లైట్స్ దగ్గరవసాగాయి. రెండు నిముషాల్లో అవి మా ప్రక్కవించి హైద్రాబాద్ వైపు దూసుకుపోయి మాయమయాయి.

మళ్ళీ రోడ్డంతా చీకటి.

నిశ్శబ్దం.

ఆ చీకట్లో కారులో చిన్న మెరుపులాంటి వెలుగు. తర్వాత ఢాంమన్న శబ్దం.

నా తల వెనక భాగంలో క్షణంలో పదోవంతుకాలంలో బాధ. బలంగా ఏదో దూసుకుపోతున్న....

*　　　　*　　　　*

నిన్నరాత్రి హైద్రాబాద్ (5 మార్చి 1979) నించి విజయవాడ వెళ్ళే రోడ్డులో ఇరవై రెండు కిలోమీటర్ల దూరంలో ఓ ముసలాయన శవం రోడ్డు వక్కన పడి వుండటం కనుగొన్నారు. ఆయన శవాన్ని చూసి హైద్రాబాద్ కారులో చేరుకున్న అనేకమంది ప్రయాణీకులు పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్‌చేసి చెప్పారు.

ఆయన తల వెనక క్లోజ్‌రేంజ్‌లో పిస్తోలు పేల్చి కాల్చి చంపారని తెలుస్తోంది. హత్య రోడ్డుమీద జరిగి వుండదని పోలీసులు భావిస్తున్నారు. ఆయన చేతికుండే వుంగరాలు గడియారం, పర్స్ వంటిమీద లేవు. అయితే బనియన్ లోపల వేసుకున్న బంగారు గొలుసు నేరస్థుల దృష్టిని ఆకర్షించలేదు. శవాన్ని మార్చురీకి పంపారు. హత్యకి కారణం తెలియరాలేదు.

ఆయన పేరు ప్రమోదరావు. నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్త. నాచారాంలో న్యూస్‌పేపర్ తయారు చేసే మిల్లు స్థాపించేరు క్రిందటివారమే.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ ఈ కేసు దార్యాప్తు చేస్తున్నారు.

*　　　　*　　　　*

హైద్రాబాద్ (6 మార్చి 1979)

రెండు రోజుల క్రితం విజయవాగ రోడ్డుమీద ప్రముఖ

పారిశ్రామిక వేత్త శ్రీ ప్రమోదరావు హత్య జేయబడ్డా దన్న సంగతి పాఠకులకు తెలుసు. ఆయన హత్య జరిగిన రోజు సాయంత్రం ఆరున్నరకి క్లబ్‌నించి తన కారులో బయలుదేరారు. ఆయన్ని ఆఖరిసారిగా చూసింది ఆయన మిత్రుడు రమేష్.

ఆయన కారు మలకపేట పోస్టాఫీస్ దగ్గర పార్క్ చేయబడి వుంది. గత 36 గంటల నుంచి ఆ కారు అక్కడే వుండటంచేత అనుమానం కలిగి ఎవరో పోలీసు లకు ఫోన్ చేశారు. ఆ కారు హతడు ప్రమోదరావుదని తేలింది. ఆ కారులోనే హత్య జరిగింది. రక్తం ముందు సీటులో కారి గడ్డకట్టి వుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర నీల్ దర్యాప్తు చేస్తున్నారు.

*　　　*　　　*

హైద్రాబాద్ (7 మార్చి 1979)

మూడు రోజుల క్రితం హత్య చేయబడిన విజయవాడ రోడ్డులో శవాన్ని పారేసిన హంతకుడు అచ్చారావుని స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ నిన్నరాత్రి సీతారాం బాగ్‌లోని అతనింట్లో అరెస్టుచేసి రిమాండ్‌లోకి తీసుకు న్నారు. చాలా విచిత్రంగా హంతకుడి ఆచూకీని పట్టించే ఆధారం ఇచ్చాడు హతుడు ప్రమోదరావు.

కారులో డేష్‌బోర్డుకి బిగించి వున్న టేప్‌రికార్డర్ ఆన్ జేశాడు ప్రమోదరావు. వారిద్దరి మధ్యా జరిగిన సంభాషణ, హత్య జరిగాక హంతకుడు కారుని వెనక్కి తిప్పి మలక్ పేట పోస్టాఫీస్ దగ్గర వదలడం మొదలయినవన్నీ అందులో రికార్డు అయ్యాయి. హంతకుడు అచ్చారావు డబ్బుకోసం మనుషులని చంపే వృత్తి చేసేవాడని తెలుస్తోంది. అతను తన నేరం వప్పుకున్నాడు. □

రామాంజనేయ యుద్ధం

వసుంధర

"పిచ్చికుక్క మీద రాయివేస్తే ఏం జరుగుతుంది?" అనడిగాడు గోవిందరాజులు గుప్పెడు ఇసుకను చేత్తోతీస్తూ.

"మీదపడి కరుస్తుంది. అందువల్ల అత్యంత బాధాకరమైన చావుకూడా లభిస్తుంది—" అన్నాడు ఆంజనేయులు.

"నువ్వు రామచంద్రుడి జోలికి వెడితేకూడా అదే జరుగుతుంది...." అన్నాడు గోవిందరాజులు ఇసుకను

సముద్రంలోకి విసురుతూ!

నిజానికి రామచంద్రుడు పిచ్చికుక్క కాదు. ఆ ఊరిలో అతనొక పెద్ద గూండా. అందరూ ఆ విషయం చెప్పుకుని అతడికి భయపడుతూంటారు. రామచంద్రుడి గురించి తల్చుకోగానే భయపడడంతప్ప—ఆ ప్రమాదకరమైన మనిషిని పోలీసులకు అప్పగించాలన్న ఆలోచనకూడా ఆ ఊళ్లో ఎవ్వరికీ రాదు. ఊళ్ళో చాలామంది గొప్పవారికి అతని అవసరం వుందనీ, ఆ కారణంగా వారి మద్దతు అతనికి వుందనీ అంతా లోపాయికారీగా చెప్పుకుంటూంటారు.

రామచంద్రుడు ఒక పెద్ద యింట్లో చిన్నగది తీసుకుని అద్దెకుంటున్నాడు. అయితే ఆ ఇంటి యజమానికి తనుచేసిన పొరపాటు చాలాకాలంవరకూ అర్థంకాలేదు. రామచంద్రుడు ఆ గదిలో తాగితందనలాడేవాడు. తాగుబోతులైన తన మిత్రులను తీసుకొచ్చేవాడు. అప్పుడప్పుడు ఆడపిల్లలనుకూడా తీసుకొస్తూండేవాడు. తన చర్యలనన్నింటినీ అతనా చిన్న గదికి మాత్రమే పరిమితం చేశాడు. ఇంటి యజమాని ఏం గోలపెట్టినా—"నా గదిలో నా ఇష్టం వచ్చినట్లుంటాను—" అని చెప్పేవాడు.

ఆ ఇంటి యజమాని గురవయ్య—రామచంద్రుణ్ని గది కాళీచేయమని చెప్పాడు. చేయనన్నాడు రామచంద్రుడు. అతన్ని గది కాళీ చేయించడానికి పోలీసు సహాయంకూడా లభించదని ఆయనకు త్వరగానే తెలిసింది. కోర్టుకెక్కుదామంటే—ఊళ్లోని లాయర్లెవ్వరూకూడా ముందుకు రాలేదు. పైగా రామచంద్రుడి జోలికి వెళ్ళవద్దని హెచ్చరించారు కూడా.

గురవయ్యకు పెళ్ళీడుకొచ్చిన కూతుళ్ళిద్దరున్నారు. రామచంద్రుడు అద్దెకుండడంవల్ల ఆయన ఇబ్బందిపడడానికి

అదొక్క ముఖ్యకారణం. రామచంద్రుడి బాధ భరించలేక ఊళ్ళో ఆయన ఇంకో ఇల్లు అద్దెకు తీసుకుని వుంటున్నాడు. స్వంతిల్లుండికూడా ఆయన ఆ విధంగా రామచంద్రుడి కారణంగా వేరే ఇల్లు మారాల్సొచ్చింది.

గురవయ్య తన ఇంటిని వేరే ఎవరికైనా అద్దెకివ్వాలని ప్రయత్నించాడు. రామచంద్రుడి కారణంగా ఆ ఇంట్లోకి ఎవ్వరూ రావడంలేదు. చివరకు విసిగిపోయి గురవయ్య ఆ ఇల్లు అమ్మేయాలనుకున్నాడు. ఆయనకు ఎంత విసుగు వచ్చిందంటే—యాభై వేలు ఖరీదుచేసే ఆ ఇంటికి పాతికవేలు వచ్చినా అమ్మేయడానికి సిద్ధంగా వున్నాడిప్పుడు.

ఈ పరిస్థితిలో గురవయ్య పెద్దకూతురు సుమతిని ఆంజనేయులు ప్రేమించడం జరిగింది. ఆంజనేయులు తండ్రికి స్వంతిల్లులేదు. కొనాలని చాలాకాలంగా ప్రయత్నిస్తున్నాడు. నచ్చిన ఇల్లు నచ్చిన ధరకు దొరక్క ఆయన డబ్బు రెడీగా వున్నప్పటికీ ఇంకా ఎదురుచూస్తూనే వుండిపోవలసి వచ్చింది. ఆంజనేయులీ విషయం మాటల సందర్భంలో సుమతికి చెప్పాడు. సుమతి ఆతనికి తండ్రి సమస్యను చెప్పింది. ఆంజనేయులు గురవయ్యతో విషయం మాట్లాడేడు.

"కట్నం లేకుండా నా పిల్లను పెళ్ళిచేసుకుంటే ఆ ఇల్లు నీకు రాసిచ్చేస్తాను" — అన్నాడు గురవయ్య తడుముకోకుండా.

ఆంజనేయులు ఈ విషయం తన స్నేహితుడు గోవిందరాజులుతో చెప్పుకున్నాడు. గోవిందరాజులు రామచంద్రుణ్ణి పిచ్చికుక్కతో పోల్చాడు.

"చాలా బాగుందిరా — పిచ్చికుక్క అని తెలిసీ దాన్ని

వీధుల్లో తిరగనిస్తామా? చంపి అవతల పారేయొద్దూ—"
అన్నాడు ఆంజనేయులు.

"ఈ మాత్రం ఆలోచన చాలామందికి వచ్చింది. కానీ ఆలోచనతో పాటే జ్వరంకూడా రావడంవల్ల ఆచరణలో పెట్టలేకపోయారు...." అన్నాడు గోవిందరాజులు.

"అంతేనంటావా?" అన్నాడు ఆంజనేయులు.

"లేకపోతే నీ మామగారు నీకా కొంపను ఊరికే ఇస్తాడనుకుంటున్నావా? ఆయనేం లక్షాధికారి కాదుగదా...." అన్నాడు గోవిందరాజులు.

"నువ్వు చెప్పింది నిజమే! కానీ ఇది నాకొక సవాల్‌గా వుంది. ఆ ఇంట్లోంచి రామచంద్రాణ్ని తరిమేయలేకపోతే నేను సుమతికి లోకువైపోతాను...." అన్నాడు ఆంజనేయులు.

"ఒరేయ్ నాయనా—జీవితంలో ఇంకా చాలా మంచి సవాళ్లున్నాయి. వాటి సంగతి చూసుకుంటే ఇహమూ, పరమూనూ. రామచంద్రుడి లాంటి వాళ్ళ విషయంలో కలగజేసుకుంటే పరం సంగతి ఎలాగున్నా — ఇహం మాత్రం వుండదు...." అన్నాడు గోవిందరాజులు.

"సరే—నా కర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది - నేను మాత్రం వాడి అంతు తేల్చడానికే ప్రయత్నిస్తాను" అన్నాడు ఆంజనేయులు.

2

"నా పేరు ఆంజనేయులు—"

"ఓహ్ అయితే నువ్వు నా బంటువన్నమాట—" అన్నాడు రామచంద్రుడు.

ఆంజనేయులు కోపంగా-"ఏమిటా మాట?" అన్నాడు.

"నాపేరు రామచంద్రుడులే-అందుకని అలాగన్నాను."

ఆంజనేయులు కోపం పెరిగింది—"నీకు రామాంజనేయ యుద్ధం కథ తెలుసా?"

"తెలుసు—"

"అందులో ఆంజనేయుడి ముందు రాముడు ఓడిపోతాడు ...."

రామచంద్రుడు చిరాగ్గా చూసి "మిస్టర్ ఆంజనేయులూ-మనుషుల్ని బంట్లుగా మార్చుకోవడంవరకే నాకు పురాణ గాథల అవసరం. ఆపైన కథంతా నేననుకున్న ప్రకారం జరుగుతుంది...." అన్నాడు.

"పురాణపురుషుల పేర్లు నీలాంటి వాళ్ళ కుండడం దురదృష్టం. నీ పేరు మార్చుకోమని చెప్పడానికి వచ్చాను ..." అన్నాడు ఆంజనేయులు.

"ఎవడ్రానువ్వు?" అన్నాడు రామచంద్రుడు కోపంగా.

"ఈ ఇంటి ఓనర్ని. ఇల్లు కాళీ చేయమని చెప్పడానికి వచ్చాను...."

"నేను చేయను...."

"చెయ్యకపోతే ఎలా చేయించాలో నాకు తెలుసు...."

"తెలిస్తే అలాగే చేసుకో—నా దగ్గరకెందుకొచ్చావ్?"

"మంచిగా చెబితే వెడతావేమోననుకున్నాను. మనుషులతో వ్యవహరించే విధానం అయిందికదా—ఇంక జంతు విధానం మొదలుపెడతాను...."

"వెంటనే ఇక్కణ్నించి బయటకు వెళ్ళు. లేకపోతే నిన్నేం చేస్తానో నాకే తెలియదు. ఫో—" అన్నాడు రామచంద్రుడు.

ఆంజనేయులు నిరసనగా రామచంద్రుణ్ని చూసి—"ఏం చేస్తావ్ నన్ను—నాది కండలు తిరిగిన శరీరం.



హయ్యో! నా మతిమరుపు మండా! పొద్దున దుప్పట్లు ఉతికి... అలాగే వెళ్ళిపోయినట్లున్నాను!!

కోపం వస్తే సప్తసముద్రాల అవతలకు విసిరేయగలను." అన్నాడు.

"ఏదీ విసురు చూద్దాం....—" అన్నాడు రామచంద్రుడు.

"నువ్వు నన్నేదో చేస్తానన్నావుగా—చేయి........" అన్నాడు ఆంజనేయులు.

రామచంద్రుడు చేయి యెత్తగానే ఆంజనేయులు బయటకు వచ్చాడు. రామచంద్రుడు అదే ఊపులో గదిలోంచి బయటకు వచ్చాడు.

సరిగ్గా అప్పుడే ఆ యింటిముందు ఓ మోటారుసైకిల్ ఆగింది. దానినుంచి ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ దిగి వచ్చేసరికి రామచంద్రుడు ఆంజనేయులి వీపుమీద రెండు గుద్దులు గుద్దాడు.

"ఏమిటి గొడవ?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"హల్లో—రాజుగారా నమస్కారం—" అన్నాడు ఆంజనేయులు.

రామచంద్రుడు యిన్‌స్పెక్టర్ని చూసి గతుక్కుమన్నాడు.

"ఈ యిల్లు మాది సార్. మాకు అవసరపడిందని కాళీ చేయమన్నాను. నన్ను చంపించడానికి సిద్ధపడ్డాడు. సమయానికి మీరు వచ్చారు—" అన్నాడు ఆంజనేయులు.

"పద—పోలీస్ స్టేషన్‌కి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజు. రామచంద్రుడు ఆట్టే అభ్యంతరం చెప్పకుండా ఇన్‌స్పెక్టర్ మాటలు శిరసావహించాడు.

3

"చాలా సింపుల్ బ్రదర్. ఇన్‌సెక్టర్ రాజుతో పరిచయం సంపాదించి ఫామిలీ ఫ్రెండ్‌గా మారాను. తర్వాత నా సమస్య చెప్పాను. ఆయనకూడా యీ ఊరికి కొత్త. రామచంద్రుడి గురించి చెప్పగానే భయానికి బదులు కోపం వచ్చిందాయనకు. తను సాయపడతానన్నాడు. ముందుగా ఆయనకు చెప్పి—నేను వాడి గదికి వెళ్ళాను. అంతా అనుకున్న ప్రకారమే జరిగింది. రెడ్‌హేండెడ్‌గా వాణ్ని పట్టుకున్నారు...." అన్నాడు ఆంజనేయులు.

"నీ ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేనుకానీ—యిల్లలకగానే పండుగయిందనుకోకు. ఈ మాత్రం ఇతరులెవ్వరూ చేయలేకకాదు. వాణ్ని నువ్వు రెచ్చగొట్టావు. వాడు నిన్ను వేటాడటానికి ప్రయత్నిస్తాడు. తప్పించుకోవడం చాలా కష్టం. ఇక్కణ్నించి ప్రతిక్షణమూ నీ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవించాలి—" అన్నాడు గోవిందరాజులు.

"దాన్నే పిరికితనమంటారు. ఎవడో యేదో చేస్తాడని

భయపడుతూ అనుక్షణం చచ్చేకంటె—ఆ చచ్చేదేదో ఒక్కసారే చస్తే బాగుంటుంది...." అని ఆంజనేయులు ఏదో చెప్పబోతూండగా — "సరే — అలాగే చేద్దువు కానిలే—...." అని యెవరో అనడం వినిపించి వెనక్కి తిరిగాడు. కనబడ్డ వ్యక్తిని చూసి ఆశ్చర్యంగా "నువ్వా?" అన్నాడు.

ఎదురుగా రామచంద్రుడు నిలబడి ఉన్నాడు.

"ఎలా వచ్చానని అనుమానపడుతున్నావా? ఇన్‌స్పెక్టర్ రాజు కొత్తవాడు. నా సంగతి తెలియక చిన్న కారణానికే అరెస్ట్ చేయాలనుకున్నాడు. పెద్దోళ్ళు కలగజేసుకున్నారు. నేను బయటకు వచ్చేశాను. ఇప్పుడు నిన్నిక్కడ తవ్వి పాతేసినా నన్నెవ్వరూ యేమీ చేయరు...." అన్నాడు రామచంద్రుడు.

గోవిందరాజులు కంగారుగా అటూ యిటూ చూశాడు. నిజంగానే అక్కడ తామిద్దరే వున్నారు. అతనికి చాలా భయం వేసింది.

"మిస్టర్—నీ పేరేమిటో నాకు తెలియదు. ఈ ఆంజనేయులుకీ రోజుతో మూడింది. మధ్యలో కలగజేసుకోకుండా కాస్త దూరంగా పోయి నుంచున్నావా సరే సరి. లేదా నీ క్కూడా బాగా దేహశుద్ధి జరుగుతుంది—" అన్నాడు గోవిందరాజుల్నుద్దేశించి రామచంద్రుడు.

"వాడి మాటలు లెక్కచేయకు. మనిద్దరం కలిశామంటే వీడికి క్షణాలమీద బుద్ధి చెప్పవచ్చు—" అన్నాడు ఆంజనేయులు.

"అతనితో గొడవెందుకు? తప్పయిపోయిందని ఒప్పుకో—వదిలిపోతుంది—" అన్నాడు గోవిందరాజులు మిత్రుడికి హితవు బోధిస్తూ.

"నువ్వు పక్కనుంటే వున్న ధైర్యం కూడా చచ్చి పోతుంది. దూరంగానే వెళ్ళు నాయనా!" అన్నాడు ఆంజనేయులు. ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నట్లుగా గోవిందరాజులు దూరంగా వెళ్ళిపోయి జరిగేది చూడసాగాడు.

"మనిషికి పిరికితనం మించిన అవమానంలేదు—" అన్నాడు ఆంజనేయులు.

"ఏమో—నీ ధైర్యం నిన్నిప్పుడు త్వరగా చంపేస్తోంది—" అంటూ రామచంద్రుడు ఆంజనేయులుమీద పడ్డాడు. ఒకటి రెండు నిముషాల్లో ఆంజనేయులు రామచంద్రుణ్ని పూర్తిగా అదుపులోకి తీసుకురాగలిగాడు. ఆ తర్వాత యిష్టం వచ్చినట్లు చితక బాది—"నిన్నిప్పుడిక్కడ చంపేసినా దిక్కులేదు. కానీ వదిలిపెడుతున్నాను. రేపు గది కాళీచేయకపోతే అక్కడకూడా ఇదే జరుగుతుంది—" అని ఆఖరుసారిగా ఫెడీమని ఒక తాపు తన్నాడు. రామచంద్రుడు ఒక్క పరుగున అక్కణ్నించి పారిపోయాడు. గోవిందరాజులు స్నేహితుణ్ని సమీపించి "నీలాంటి స్నేహితుడున్నందుకు చాలా గర్విస్తున్నాన్రా" అంటూ భుజం తట్టి మెచ్చుకున్నాడు.

"ఇప్పటికి నా దగ్గరకొచ్చే ధైర్యం వచ్చింది నీకు. ఈ దృశ్యం చూడ్డానికి నీకు బదులు సుమతి వుండి వుంటే యింకా సంతోషించేవాణ్ని—" అన్నాడు ఆంజనేయులు.

"అది సరేకానీ—అప్పుడే అంతా అయిపోయిందనుకోకు. వాడిప్పుడు పగబట్టిన పాము...." అంటూ బెదిరించాడు గోవిందరాజులు.

"ఆ పాముకు కోరలు పీకేస్తాను...." అన్నాడు ఆంజనేయులు. అక్కణ్నించి అతను తిన్నగా ఇన్‌స్పెక్టర్ రాజు యింటికి వెళ్ళి జరిగిందంతా చెప్పేడు.



"మిస్టర్ ఆంజనేయులూ, నా పరిమితులు నా కున్నాయి. ఆ రామచంద్రుణ్ని నేనేమీ చెయ్యలేను. వాడి జోలికి వెడితే నేను ఏ మన్య ప్రాంతాలకో ట్రాన్స్‌ఫర్ కావాల్సుంటుంది— అంతే!" అన్నాడు రాజు. రామచంద్రుడి జోలికి వెళ్లవద్దని ఆయన అతనికి సలహా ఇచ్చాడు.

4

ఆంజనేయులు వెళ్లేసరికి రామచంద్రుడిగదిలో అతడితో పాటు నలుగురు రౌడీలున్నారు. అందరి చేతుల్లోనూ కత్తులున్నాయి.

"మర్యాదగా బయటకు వెళ్లిపో. గదిలో అడుగుపెట్టకుండా వుంటే నీకేం ప్రమాదం లేదు. లేకపోతే మాత్రం నీ రక్తం కళ్ల జూస్తాం—" అన్నాడు రామచంద్రుడు.

"సిగ్గులేదూ—ఒక్కడిమీదకు అయిదుగురు తయారౌతున్నారు. అందులోనూ చేతుల్లో కత్తులు కూడానూ—"

అన్నాడు ఆంజనేయులు. కానీ అతను గది గుమ్మందగ్గరే ఆగిపోయాడు. లోపలకు వెళ్లాలా, మానాలా అని ఆలోచించాడు.

"మాకు సిగ్గులేదు. ఆ విషయం గురించి మాకు బెంగ కూడా లేదు. ఎటొచ్చీ నీకు ప్రాణాలమీద ఆశ వుందో లేదో ఆలోచించుకో—...." అన్నాడు రామచంద్రుడు.

ఆంజనేయులు నిరుత్సాహంగా వెనక్కి తిరిగాడు. వెనుకనుంచి నవ్వులు, కేరింతాలు వినబడుతూంటే అతని రక్తం మరిగింది. అక్కణ్నించి నెమ్మదిగా గురవయ్య యింటికి వెళ్లాడు.

"కథ ఎంతవరకూ వచ్చింది?" అంటూ అతన్ని పలకరించింది సుమతి.

జరిగింది చెప్పాడతను.

సుమతి నిట్టూర్చి—"వాణ్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు" అంది.

"వాడికోసం నేను పోలీసాఫీసరుతో స్నేహం చేశాను. కానీ అది పనిచేయలేదు. స్వంతబలం వుపయోగించాను! అదీ పనిచేయలేదు. నైతికంగా, శారీరకంగా, అంతస్థు పరంగా వాడికంటె బలవంతుడినై వుండి వాడ్నేమీ చేయలేకపోతున్నాను" అని నిట్టూర్చాడు ఆంజనేయులు.

"శ్రీరాముడు ఎన్ని తలలు నరికినా రావణుడికి మళ్ళీ కొత్త తలలు మొలుచుకొచ్చేవిట. దుర్మార్గులకు బలం లేకపోయినా ఏవో దుష్టశక్తులుంటాయి" అంది సుమతి.

"అయితే వాడి బలమేమిటో తెల్సుకునేందుకు మనకో విభీషణుడు దొరకాలి. ఆ రకంగా ప్రయత్నిస్తాను" అన్నాడు ఆంజనేయులు.

అతడి ప్రయత్నాలు త్వరగానే ఫలించాయి. కొంత

కాలం రామచంద్రుడికి నమ్మిన బంటుగా వుండి ఇప్పుడు వాడికి వ్యతిరేకంగా వుంటున్న గూండా ఒకడున్నాడు. రామచంద్రుణ్ని పడగొట్టటం వాడి ఆశయాల్లో ఒకటి. ఆంజనేయులు వాడ్ని కలుసుకుని తన గురించి చెప్పుకున్నాడు.

"మీరు వాణ్ని చావగొట్టారని నేనూ విన్నాను. చూడ్డానికి కూడా అంతటి శక్తిసామర్థ్యాలున్న వారిలా కనబడుతున్నారు. ఆ రామచంద్రుడ్ని పడగొట్టాలని నాకూ వుంది. కానీ వాడి బలమంతా ఆ కృష్ణంరాజుగారిలో వుంది...." అన్నాడు.

కృష్ణంరాజు ఆ వూరి ప్రముఖుల్లో ఒకడు. ఆయన కారణంగానే రామచంద్రుణ్ని యెవ్వరూ ఏమీ చేయలేకపోతున్నారు. ఇది నాణేనికి బొమ్మయితే - రామచంద్రుని కారణంగా ఆయన వ్యవహారాల్లో కొందరు జోక్యం చేసుకోలేకపోవడం నాణేనికి బొరుసు.

అంటే కృష్ణంరాజుకూ, రామచంద్రుడికీ చెడగొట్టేయాలి. అప్పుడు వాడు కోరలు పీకిన పాము అవుతాడు. అయితే అదెలా సాధ్యపడుతుంది?

దీనిని గురించి రెండు రోజులు బుర్ర బ్రద్దలు కొట్టుకున్నాడు ఆంజనేయులు. తర్వాత సుమతితో కూడ ఆలోచించాడు. అవీ ఇవీ మాట్లాడుకోవడంలో కృష్ణంరాజు దూరపు బంధువుల అమ్మాయితో సుమతికి పరిచయమున్నట్లు అతనికి తెలిసింది. వెంటనే ఓ పథకం అతని బుర్రలో మెదిలింది.

"నువ్వూ, ఆ పిల్లా కలిసి ఒకసారి రామచంద్రుడి సమీప ప్రాంతానికి వెళ్ళి వాణ్ని బాగా రెచ్చగొట్టండి. అప్పుడు వాడు మీతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. మీకే

ప్రమాదం రాకుండా నేను చూసుకుంటాను. విషయం కృష్ణంరాజుదాకా వెడితే రామచంద్రుడి బ్రతుకు జైలు పాలు కాక తప్పదు" అన్నాడు ఆంజనేయులు.

"మాలతి ఇందుకు ఒప్పుకుంటుందో లేదో" అంది సుమతి.

"అసలు విషయం ఆమెకు చెప్పొద్దు...." అన్నాడు ఆంజనేయులు.

కాబోయే భర్త కోసం సుమతి కాస్త ధైర్యం చేసింది. తన స్నేహితురాలు మాలతి నామె ఒకసారి ఇంటికి పిలిచి "ఇది అద్దెయిల్లు. మాకీ ఊళ్ళో స్వంతిల్లు వుం . దాంట్లో ఓ వెధవుంటున్నాడు. కాళీ చేయడం లేదు. మేమంటే వాడికి లెక్కలేదు. కృష్ణంరాజుగారు మీ పెదనాన్నగారని తెలిస్తే నిన్ను గౌరవించి ఏమీ చేయడు. ఓసారి వాణ్ని చూద్దాం—ఆ విధంగానే మా ఇల్లు కూడా చూసినట్లుం టుంది వస్తావా?" అనడిగింది.

మాలతికి ఆ ఇంటికి వెళ్ళి వాణ్ని చూడాలని సరదా పుట్టేవిధంగా సుమతి చాలా విశేషాలు చెప్పింది. అలాంటి రౌడీమనిషి కృష్ణంరాజుగారి కారణంగా తన జోలికిరాకుండా తన్ను గౌరవిస్తాడంటే ఆ విషయం ధృవపర్చుకోవాలనీ ఆమెకు సరదాగానే వుంది.

ఇద్దరూ కలిసి ఆ ఇంటికి బయల్దేరారు. దారిలో అనుకున్న ప్రకారం వాళ్ళకు ఆంజనేయులు ఎదురుపడ్డాడు. అతన్ని తన స్నేహితురాలికి పరిచయం చేసింది సుమతి. "నేను కూడా నీకు తోడుగా వస్తాను" అన్నాడు ఆంజనేయులు. ముగ్గురూ కలిసి ఆ ఇంటికి వెళ్ళారు.

రామచంద్రుడు ఒక్కడూ గదిలో వున్నాడు. వీళ్ళ ముగ్గుర్నీ చూసి "ఏం గురూ మళ్ళీ వచ్చావ్! రెండు



పిట్టల్ని గూడా కొట్టుకొచ్చావే! ఈ పిట్ట తెలిసిందే అనుకో- ఆ రెండో పిట్ట కొత్తగా వుంది. బాగుంది కూడా. ఓ గంట సేపు నా దగ్గర వదిలిపెట్టకూడదూ!" అన్నాడు.

"ఆ అమ్మాయెవరనుకున్నావ్? ఈ ఊళ్ళో ప్రముఖులైన కృష్ణంరాజుగారి తమ్ముడి కూతురు" అన్నాడు ఆంజనేయులు.

"ఓహ్.... ఎందుకొచ్చిందిట?"

"మా ఇల్లు చూడ్డానికి."

"కృష్ణంరాజు తమ్ముడి కూతురయితే నాకేమైనా భయమనుకున్నావా? ఆ కృష్ణంరాజు కూతురే వచ్చినా నాకు భయం లేదు...." అంటూ వాడు లేచి వచ్చి మాలతి చేయి పట్టుకుని లాగాడు. అతడి రెండో చేతిలో కత్తి వుంది.

"కృష్ణంరాజుగారికి తెలిసిందంటే నీ ప్రాణాలు పోతాయ్" ఆంటూ వాణ్ణి మరింత రెచ్చగొట్టాడు తప్పితే ఆంజనేయులు ముందడుగు వేసి తనేమీ కలగజేసుకోలేదు. ఈలోగా రామచంద్రుడు మాలతితో కొంత అసభ్యంగా ప్రవర్తించాడు. పెనగులాడడంలో ఆమె ముంగురులు

చెదిరిపోయాయి. బొట్టు చెరిగిపోయింది. వొళ్ళంతా చెమటలు పట్టింది.

"మీ ఇద్దరూ కాసేపు బయటకుపోతే-మళ్ళీ ఈ పిల్లను భద్రంగా అప్పజెప్పేస్తాను. మీరు బయటకు పోకపోయినా నాకు అభ్యంతరంలేదు. నేను సిగ్గులేనివాణ్నేకదా!" అన్నాడు రామచంద్రుడు.

మాలతి ఈ మాటలకు వణికిపోయింది. తన జీవిత మంతా సర్వనాశనం అయిపోయిందనుకుంది. అయితే సరైన సమయంలో ఆంజనేయులు కలగజేసుకుని ఒడుపుగా వాడి చేతిలోని కత్తి లాక్కుని-వాడికి దేహశుద్ధిచేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళాడు. అక్కడ మాలతి జరిగిందంతా చెప్పి పోలీస్ కప్లైంట్ కూడా ఇచ్చింది.

"ఈ దెబ్బతో రామచంద్రుడి పని అయిపోయింది___" అనుకున్నాడు ఆంజనేయులు.

5

"రామచంద్రుడు నిన్ను చంపేస్తానని ప్రతిజ్ఞ పట్టేడట...." అన్నాడు గోవిందరాజులు భయంగా.

"నేనూ వాణ్ని చంపేస్తానని ప్రతిజ్ఞ పట్టేను...." అన్నాడు ఆంజనేయులు.

"ఒరేయ్-నిన్ను దెయ్యం పట్టిందో ఏమో కానీ ఎందుకొచ్చిన గొడవరా ఇది-వాడు ఊళ్లో పేరుమోసిన గూండా. నువ్వు చాలా సామాన్యుడివి. అన్నిరకాల అస్త్రాలూ వాడిమీద ప్రయోగించి ఓడిపోయావు. ఇప్పుడైనా వాణ్ని బ్రతిమాలుకుంటే నిన్ను వదిలిపెట్టేయొచ్చు...."

మిత్రుడి హితవాక్యాలు వినడంలేదు ఆంజనేయులు. జరిగిన విషయం ఆలోచిస్తున్నాడతను. తను బ్రహ్మాస్త్రం అని భావించినది కూడా రామచంద్రుడిపై పనిచేయలేదు.

కృష్ణంరాజు కాలరుద్రుడై రామచంద్రుణ్ని కాలరాస్తాడను కుంటే అలా జరగలేదు. మాలతి ఇచ్చిన ఫిర్యాదు పోలీసు రికార్డుల్లోకి వెళ్లలేదు. ఒక పెద్దింటిపిల్ల ఆంజనేయులి కారణంగా కోర్టు కెక్కాల్సి వచ్చినందుకు కృష్ణంరాజు మండిపడి అలగాజనంతో ఆమె తిరక్కుండా కట్టడి చేశాడు. ప్రస్తుతం మాలతికీ సుమతికీ స్నేహం నిలిచి పోయింది. రామచంద్రుడి అసభ్య ప్రవర్తన నాయన ఎలా క్షమించగలిగాడో ఆశ్చర్యమే! ఆంజనేయులు, సుమతివంటి తక్కువ రకం మనుషులతో కృష్ణంరాజు తమ్ముడి కూతురు వుండగలదన్న అనుమానం లేశ మాత్రం కూడా రామచంద్రుడి కుండడవే వాడి తప్పుడు ప్రవర్తనకు కారణమయుంటుందని కృష్ణంరాజు సమాధాన పడి వుంటాడు. రామచంద్రుడు కూడా ఆయన కాళ్లమీద పడి తనకు నిజం తెలియదని వేడుకుని వుండవచ్చు. వాడితో వున్న అవసరాన్నిబట్టి కృష్ణంరాజు వాణ్ని క్షమించి వుండవచ్చు.

"నేను మొదట్లోనే చెప్పాను. వాడు పిచ్చికుక్క అని. వాణ్ని నువ్వేమీ చెయ్యలేవు. ఇప్పుడు నిన్నావహించిన ప్రమాదం సామాన్యమైనదికాదు...." అన్నాడు గోవింద రాజులు మళ్లీ.

"అధికారులతో పరిచయముండీ, వంట్లో శక్తివుండీ, మనసుకు ధైర్యముండీ, బుర్రలో తెలివుండీ కూడా ప్రజలకు పీడగా అవతరించిన ఒక గూండాను అడ్డు తొల గించ లేకపోతే నా ఈ బ్రతుకు వ్యర్థం—" అన్నాడు ఆంజనేయులు బాధగా. అంతలోనే అతడి బుర్రలో ఏదో మెదిలింది—"ఇంతకాలం నా ఆలోచనలు తప్పుదారిలో

నడిచాయి మిత్రమా! వజ్రాన్ని వజ్రంతోనే కోస్తాను....”
అన్నాడు హఠాత్తుగా.

“ఏంచేస్తావేమిటి?” అన్నాడు గోవిందరాజులు.

“త్వరలోనే ఎలాగూ తెలుస్తుంది నీకు. విభీషణుడి సాయం తీసుకుని వీణ్ని తుదముట్టిస్తాను....” అన్నాడు ఆంజనేయులు.

ఆ తర్వాత వారం రోజులకు రామచంద్రుడు భయంకరమైన చావు చచ్చాడు. సుమారు పద్దెనిమిది గంటలసేపు వాడు అనుభవించిన నరకయాతన వర్ణనాతీతం. వాణ్ని ఒక రాత్రివేళ పిచ్చికుక్క కరిచింది. పిచ్చికుక్క వాణ్ని వాడింట్లోనే కరిచింది. అదెలా జరిగిందో ఎవరికీ తెలియదు. ఎవ్వరూ పట్టించుకోలేదు.

రామచంద్రుడు ఒక్కడూ పడుకుని వుండగా వాడి గదిలోనికి పిచ్చికుక్కను వదిలి బయట గొళ్లెంపెట్టి వుదయం మాత్రమే తీసిన ఘనత విభీషణుడిది. రామచంద్రుడు ఒక రాత్రివేళ అల్పాచమానానికి బయటకు వచ్చి మళ్లీ లోపలకు వెళ్లేటప్పుడు వాడాపని చేశాడు.

“నా కష్టానికి ప్రతిఫలం కావాలి బాబూ—” అన్నాడు విభీషణుడు ఆంజనేయుల్ని.

“ఏమిటో అడుగు....”

“సరైన ఇల్లు దొరక్క ఇబ్బంది పడుతున్నాను. రామచంద్రుడు పోయాక ఈ వూరికి నేనే మొనగాణ్ని. వాడిగది నాకు అద్దెకిప్పిస్తే....”

“అదొక్కటి తప్ప ఏమడిగినా ఇవ్వగలను!” అన్నాడు ఆంజనేయులు వాణ్ని మధ్యలో ఆపి. అతనలా ఎందుకన్నాడో తెలియక ఆశ్చర్యంగా చూశాడు విభీషణుడు.

నమ్మ దగని సాక్ష్యం

'కృష్ణచైతన్య'

“ఉప్మాలో ఉప్పు ఎక్కువయింది!” అన్నాడు చక్రవర్తి ముఖం చిట్లిస్తూ.

వాసవి సమాధానం చెప్పలేదు. మౌనంగా టిఫిన్ తినడంలో మునిగిపోయింది.

"వింటున్నావా?" చిరాగ్గా అడిగాడు.

"వింటున్నాను. అయితే ఇప్పుడేం చెయ్యమంటారు? తినగలిగితే తినండి. లేకపోతే పారెయ్యండి!" నిర్లక్ష్యంగా అంది.

ఒక్క నిముషం భార్యపైపు పరీక్షగా చూచి ప్లేటు విసురుగా ముందుకు నెట్టాడు.

టెలిఫోన్ మ్రోగింది.

ఛటుక్కున లేచి వెళ్ళి రిసీవర్ అందుకొని, "చక్రవర్తి హియర్!" అన్నాడు ఎంగిలిచేతిని పక్కనే వున్న నీళ్ళ గ్లాసులో ముంచుతూ.

వాసవి తినడం ఆపి మాటలు వింటూ కూర్చుంది.

"నమస్కారం! మీరా? ఏమిటి విశేషం?" అడిగాడు చక్రవర్తి పక్కన వున్న కుర్చీలో కూర్చుంటూ.

....

"చెప్పండి! ఏం జరిగింది!"—

....

"ఏక్సిడెంట్ జరిగిందా? ఎప్పుడు? ఎవరైనా చని పోయారా!"

....

"ఆహా(! అక్కడికక్కడే చనిపోయిందా?"

....

"ఓహో! బెయిల్‌మీద విడుదల చేసారా! ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

....

"అలాగే ఆ విషయం నా కొదిలేయండి! మీరొకసారి ఇక్కడకుగాని, ఆఫీసుకుగాని రండి తీరిగ్గా మాట్లాడు కుందాం!"

....

"ఓ.కే. అలాగే! మీకోసం ఎదురు చూస్తుంటాను."

ఫోన్ పెట్టేసి హుషారుగా లేచి నిలబడ్డాడు చక్రవర్తి.

"ఏమిటి కేసు? అడిగింది వాసవి.

చక్రవర్తి చాలా హుషారుగా వున్నాడు. అంతకు ముందు జరిగిందంతా మర్చిపోయాడు. ఉప్మా ప్లేటు ముందుకు లాక్కొని తింటూ చెప్పసాగాడు.

"మోహనరావని లక్షాధికారుల అబ్బాయి వున్నాడులే! వాళ్ళ నాన్న పెద్ద బిజినెస్ మాగ్నెట్. మోహనరావు రాత్రి రెండో ఆటకు వెళ్ళి వస్తుంటే ఆక్సిడెంట్ జరిగి ఒక స్త్రీ అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు మోహనరావును అరెస్టుచేసి, బెయిలుమీద విడుదలచేసారు. మోహనరావు నిర్లిప్తంగా కారు నడుపుతూ ఆ స్త్రీని చంపాడని పోలీసులు కేసుపెట్టారు. అందుకే నా సహాయం కోరారు.

ఎలాగైనా మోహనరావును ఈ కేసునుంచి రక్షిస్తే వేలకు వేలు చేతిలో పడతాయి" అన్నాడు ఆనందంగా.

"అంటే మీరు న్యాయాన్ని చంపడానికి పూనుకుంటున్నారన్న మాట!" కోపంగా అడిగింది.

పెద్దగా నవ్వాడు చక్రవర్తి! "చూడు వాసవీ కోర్టుల్లో న్యాయం దొరుకుతుందనుకోవడం నీలాంటి వాళ్ళ తెలివి తక్కువతనం. అదో యుద్ధరంగంలాంటిది. అందులో అందరూ హేమాహేమీలే! ఎవరికి వాకచక్యం, వాడుపు, ఉపాయం వుంటాయో వాళ్ళు గెలవడం తథ్యం. అవిలేని వాళ్ళు అన్యాయం, అన్యాయం అంటూ అరుస్తూ వెళ్ళడమూ సహజమే! కాబట్టి ఇందులో న్యాయాన్యాయాల ప్రసక్తి లేదు" అన్నాడు జ్ఞానోపదేశం చేస్తున్నవాడిలా.

2

చక్రవర్తికి ఆ నగరంలో క్రిమినల్ లాయర్‌గా మంచి పేరు ప్రఖ్యాతులు వున్నాయి. ప్రాసిక్యూషన్ ఎలాంటి సాక్ష్యాన్ని సేకరించినా దాన్ని తారుమారుచేసి, తిమ్మిని బమ్మి చెయ్యగల ఉద్దండుడు. అందుకే చాలమంది నేరస్తులకు చక్రవర్తి ఆపద్బాంధవుడు

చక్రవర్తికి తనకొచ్చిన కేసులోని న్యాయన్యాయాలతో పనిలేదు. ప్రతికేసు తన ప్రతిభకు, ప్రతిష్టకు సవాల్‌గా తీసుకుంటాడు. అందుకే అతనికి మంచిపేరు ప్రఖ్యాతులు వచ్చాయి.

పది గంటలకల్లా రావు వచ్చేడు.

చక్రవర్తి విష్ చేసి. కాలింగ్‌బెల్ నొక్కి పనిమనిషి రాగానే రెండు కాఫీ తెమ్మని చెప్పాడు.

పనిమనిషి లోపలికి వెళ్ళాక, వాసవి తన గదిలోంచి బయటకు వచ్చి, వాళ్ళ కూర్చున్న గది పక్కగదిలో కూర్చుంది. రెండు గదులమధ్య వెంటిలేటర్ వుండడం వల్ల ఆ గదిలో మాటలు బాగా విన్పిస్తాయి.

చక్రవర్తి సిగరెట్ వెల్గించి విశ్రాంతిగా కుర్చీలో వాలి, "అసలేం జరిగిందో వివరంగా చెప్పండి!" అన్నాడు.

మోహనరావు 'టై' సర్దుకొని, చిన్నగా దగ్గి, "రాత్రి రెండో ఆట 'ది బైబిల్' కెళ్ళి వస్తున్నాను. అప్పటికి టైం రెండున్నర దాటి వుంటుంది. రామ్‌నగర్ జంక్షన్‌లో ఏదో కారుకు గుద్దుకున్న చప్పుడయింది. అప్పటికే బాగా నిద్రవస్తుంది. ఏదో కుక్క అయి వుంటుందనుకొని వచ్చేసాను. తెల్లవారేసరికి పోలీసులు ఇంటికి వచ్చారు. రాత్రి నా కారుక్రింద పడి ఒక స్త్రీ మరణించిందని. కారు చెక్ చెయ్యాలని అన్నారు.

పోలీసులు కారు చెక్ చేసారు బంపర్‌కు రక్తం అంటి వుంది. నన్ను రకరకాల ప్రశ్నలువేసి, నేను కారు నిర్లక్ష్యంగా తోలడంవల్లనే ఆమె చనిపోయిందని అరెస్ట్ చేసారు. ఆ తర్వాత మళ్ళీ బెయిల్‌మీద విడుదలచేసారు. ఇదీ జరిగింది. ఈ విషయంలో మీరెలాగైనా నన్ను రక్షించాలి" అన్నాడు నెమ్మదిగా.

చక్రవర్తి తల ఊపి, "ఇదంతా పోలీసులకు చెప్పారా?" అడిగాడు.

"చెప్పాను."

"రామ్‌నగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వుందా?"

"ఉంది!"

మీరక్కడికి వచ్చేసరికి సిగ్నల్ 'గ్రీన్'గా వుందా? 'రెడ్'గా వుందా?

"గ్రీన్ సిగ్నలే!"

"ఈ విషయం పోలీసులకు చెప్పారా?"

"చెప్పాను!"

చక్రవర్తి నవ్వి, "ఆల్‌రైట్! మీ కేసు నేను టేకప్ చేస్తాను! ఈ కాగితాల మీద సంతకం పెట్టండి!" అని, "నాకు 'నిజాయితీ'గా వుండడం అంటే ఇష్టం" అన్నాడు.

వాసవి నవ్వుకుంది. చక్రవర్తి మాటల్లోని 'నిజాయితీ' తనకు తెలుసు. పెళ్ళయిన మొదటి రోజే తనతో అన్నాడు "వాసవీ! నిజానికి నువ్వంటే నాకు పెద్ద ఇష్టంలేదు. కాకపోతే, మీ నాన్నకు సొసైటీలో మంచి పలుకుబడి వుంది. డబ్బు వుంది. నా ప్రాక్టీసుకు అవి రెండూ కావాలి. అందుకే చేసుకున్నాను."

రెండు నిముషాల తర్వాత యిద్దరూ గది బయటకు వచ్చిన శబ్దం అయింది. ఆ తర్వాత కొద్దిసేపటికి చక్రవర్తి

లోపలికి వచ్చాడు.

"వాసవీ! నేను కోర్టుకు వెళ్లాలి. నా కారు చెడి పోయింది. నీ కారు వేసుకు వెళుతున్నాను. ఎక్కడికైనా వెళ్లాలంటే టాక్సీలో వెళ్లు" అన్నాడు హడావుడిగా బైటకు నడుస్తూ.

వాసవి తల ఊపి, కారు కదిలి వెళ్లిపోయాక, టెలి ఫోన్ దగ్గరకు వెళ్లి, నెంబర్ డయల్ చేసింది.

అవతలి స్వరం విన్పించింది.

"హల్లో! బిక్షపతీ! నేను వాసవిని మాట్లాడుతున్నాను" అని, మోహనరావు కేసంతా వివరించి, "దీనికి నువ్వు ప్రాసిక్యూషన్ సాక్షి కావాలి!" అంది.

బిక్షపతి నవ్వి, "నీ కా కంగారు అక్కర్లేదు. ఆ కేసులో నేను నిజంగానే ప్రాసిక్యూషన్ సాక్షిని!" అన్నాడు.

"ఓ. కే! ఇంతకీ విచారణ ఎప్పుడు?"

"ఎల్లుండి!"

"అయితే నేనూ కోర్టుకు వస్తాను. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అంది రిసీవర్ క్రెడిల్ చేసి, విశ్రాంతిగా కుర్చీలో కూర్చుంటూ.

3

అప్పటివరకు కేకలతో, అరుపులతో నవ్వులతో నిండి పోయిన కోర్టు హాలు, జడ్జి వచ్చి తన స్థానాన్ని ఆక్ర మించగానే సద్దు మణిగిపోయింది.

ముద్దాయి మోహనరావును బోనులోకి పిలిపించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ తనకోటు సవరించుకొని, లేచి నిలబడి "మిస్టర్! ఈ కేసులో ముద్దాయి, అంటె ఈ మోహనరావనబడే వ్యక్తి, పదహారవతేది రాత్రి మూడు



గంటల ప్రాంతంలో రామ్‌నగర్ జంక్షన్‌దగ్గర ఆక్సిడెంట్ చేసి దారుణంగా ఒక స్త్రీని చంపాడు. అక్కడే వున్న ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ ఉన్నా ఖాతరుచెయ్యక, అప్పుడే రోడ్డు దాటుతున్న హతురాలు, విశాలాక్షి అనే స్త్రీ పైకి కారు యెక్కించి దారుణంగా చంపాడు...." అంటూ తన వాదన సాగించి, ప్రాసిక్యూషన్ సాక్షిగా భిక్షపతిని పిలిపించారు.

ప్రాసిక్యూటర్ తన ప్రశ్నలన్నీ అడగడం పూర్తయ్యాక, డిఫెన్స్ తరపున క్రాస్ ఎగ్జామిన్ చెయ్యడానికి చక్రవర్తి లేచి నిలబడ్డాడు.

చక్రవర్తిని గురించి అక్కడ అందరికీ తెల్సివుండడం వల్ల, ఊపిరి బిగబట్టి చక్రవర్తి చెయ్యబోయే క్రాస్ ఎగ్జామిన్ వినడానికి సిద్ధంగా కూర్చున్నారు.

విజిటర్స్ గ్యాలరీలో వున్న వాసవి భర్తవైపొకసారి చూచి, భిక్షపతివైపు చూపు మరల్చింది.

బిక్షపతి చిన్నగా నవ్వి కళ్ళు ఎగరేసాడు.

చక్రవర్తి ఠీవిగా నడచివచ్చి, సాక్షి బోను ముందు నిలబడి, బిక్షపతివైపు పరీక్షగా చూచాడు.

ముప్పై ఏళ్ళుంటాయి అతనికి. సన్నగా పీలగా వున్నాడు. మాసిపోయిన తెల్లటి కాటన్ బట్టలు, చింపిరి జుట్టు, దళసరి కళ్లద్దాలు, సన్నటి ముక్కూ, పీక్కుపోయిన దవడలు, కొద్దిగా పెరిగిన గడ్డం....సీదా సాదాగా వున్నాడు.

"నీ పేరు?" నెమ్మదిగా అడిగాడు చక్రవర్తి.

"బిక్షపతి!"

"ఏం చేస్తుంటావ్?"

"విమల్‌గంజ్‌లో వున్న 'లేడీస్ రెస్టారెంట్'లో సర్వర్ని!"

చక్రవర్తి తల ఊపి, "ఆక్సిడెంట్ జరిగిన రోజున నువ్వు చూచిందేమిటో వివరంగా చెప్పు!" అన్నాడు.

బిక్షపతి చిన్నగా దగ్గి "ఆ రోజు రాత్రి రెండుగంటల కల్లా రెస్టారెంటునుంచి బయలుదేరి చిన్నగా నడచుకుంటూ వచ్చి, రామ్‌నగర్ జంక్షన్‌లో వున్న బస్‌స్టాప్ దగ్గర బెంచిమీద కూర్చున్నాను. నడవడంవల్ల బాగా పొద్దు పోవడంవల్ల నిద్ర ముంచుకు వస్తుంది. ఇంకా అరమైలు వెళితేగాని నేనుండే గది రాదు. అందుకే అక్కడ ఆగి, సిగరెట్ త్రాగుతూ కూర్చున్నాను. అంతలోనే ఎవరో నా వెనుక వైపునుండి వస్తున్న చప్పుడు అయింది. నే నంతగా గమనించలేదు. నిముషం తర్వాత పెద్ద శబ్దం విని తల తిప్పి చూశాను. ఎవరో స్త్రీ కారు క్రిందపడింది. అయినా ఆ వ్యక్తి కారు ఆపకుండా వెళ్ళిపోయాడు" అన్నాడు నెమ్మదిగా.

చక్రవర్తి తల వూపి, "ఆ కారులో వ్యక్తి ఇతనేనా?" అడిగాడు మోహనరావు వైపు చూపిస్తూ.

"అయివుండవచ్చు. నేనా వ్యక్తిని చూడలేదు. నేను ఆ కారును మాత్రం చూచాను. ఆ కారులో వ్యక్తి ఇతనో కాదో పోలీసులు చెప్పాలి."

"సరే! ఆక్సిడెంట్ జరగడం చూచారుకదా! అప్పుడు ట్రాఫిక్ సిగ్నల్ యెలా వుంది?"

"ఎరుపులో వుంది!"

"మీరు కూర్చున్న చోటుకు, ఆక్సిడెంట్ జరిగిన స్థలానికి దూరం ఎంత వుంటుంది?"

బిక్షపతి ఒక్క నిముషం ఆలోచించి "సరిగ్గా చెప్పలేను!" అన్నాడు.

"ఖచ్చితంగా అవసరం లేదు. పోనీ, మీకు ముద్దాయికి వున్నంత దూరం ఉంటుందా?"

"ఉండవచ్చు."

"సరే! యెవరో వస్తున్నారని అన్నారు కదా? ఆమె మీ వెనుకనుంచి రావడం చూడలేదా?"

"లేదు. నేను చాల అలసిపోయి వున్నాను. అందుకే అంతగా పట్టించుకోలేదు."

"పోనీ ఆ సమయంతో మీకు కారు హెడ్‌లైట్లు కన్పించలేదా?"

"ఏమో! అంతగా గమనించలేదు."

"మీరు వుండేది ఎక్కడ?"

"పాత కోట దగ్గర. అక్కడే నా గది వుంది."

"గది అంటే?....ఇల్లుకాదా?"

"కాదు. చిన్నగది. నా భార్య పోయిన దగ్గరనుంచి ఆ గదిలోనే వుంటున్నాను."

"అలాగా! మీరు ప్రతిరోజు రాత్రి అదే వేళకు వస్తుంటారా?"

"ఇంచుమించు."

"రోజూ నడిచే వస్తారా?"

"ఆ!"

చక్రవర్తి ప్రశ్నలకు ప్రేక్షకులకు విసుగుపుడుతుంది. చక్రవర్తి తీరు చూస్తుంటె మోహనరావుకు కూడ భయం వేస్తుంది.

వాసవి మాత్రం భర్త వైపు అనుమానంగా చూస్తుంది. భర్త సంగతి ఆమెకు బాగా తెల్సు.

చక్రవర్తి కోటు సవరించుకొని ఏదో అడగబోయాడు. అంతలోనే లంచ్ అవర్ కావడంవల్ల కేసు మధ్యాహ్నానికి వాయిదా పడింది.

చాలమంది నిరుత్సాహంగా బయటకు కదిలారు.

"మీ ప్రశ్నలు చాల చప్పగా వున్నాయి!" లంచ్ టైంలో అంది వాసవి అక్కసుగా.

చక్రవర్తి మాట్లాడలేదు. గంభీరంగా నవ్వి ఊరుకున్నాడు. చక్రవర్తి సామాన్యంగా అలా నవ్వడు. ఆ నవ్వు చాలా అపాయకరమైనది తెల్సు వాసవికి.

4

లంచ్ కాగానే చక్రవర్తి చక చక పక్క గదిలోకి వెళ్ళి, టెలిఫోన్ రిసీవర్ ఎత్తి డయల్ చేసాడు.

"పాంచాలీ! నేను చక్రవర్తిని. నేను చెప్పిన పని ఏంచేసావ్?" అడిగాడు.

రెండు నిముషాలపాటు అవతలినుంచి పాంచాలి చెప్పేది విని ఫోన్ పెట్టేసి వెనక్కు తిరిగాడు.

"ఎవర్తె అది?" కోపంగా అడిగింది వాసవి.



"నీ సవతికాదు. నా సెక్రటరీ."

"అదొకటా మళ్లీ!" కోపంగా అంది.

"నోర్ముయ్! వెళ్లి నీపని చూచుకో!" అరిచాడు చక్రవర్తి.

రుస రుసలాడుతూ వెళ్లిపోయింది వాసవి.

మళ్లీ విచారణ మొదలయింది. చక్రవర్తి తాపీగా లేచి వెళ్లి, సాక్షి బోను దగ్గర నిలబడ్డాడు.

బిక్షపతి ఇదే మొదటిసారి కోర్టుకు రావడం. అందులోనూ, చక్రవర్తి అడిగే ప్రశ్నలకు తికమకపడి కంగారు పుడుతుంది.

"ఆక్సిడెంట్ జరిగిన సమయంలో అక్కడ రెడ్ సిగ్నల్ వుంది అవునా?" అడిగాడు చక్రవర్తి.

బిక్షపతి తల ఊపాడు.

"అంటే సరిగ్గా అప్పుడే ముద్దాయి కారు అక్కడికి వచ్చి వుండాలి. అప్పుడే విశాలాక్షి కూడా రోడ్డు దాట బోతూ వుండాలి, అంతేకదూ?"

తల ఊపాడు బిక్షపతి.

"ఆమె రోడ్డు దాటుతుండగా చూచారా?"

"లేదు."

"ఎందుకని?"

"నేనంతగా గమనించలేదు. పైగా చీకటి."

"అక్కడ స్ట్రీట్ లైట్ లేదా?"

"ఉంది. కాని వెలుతురు గుడ్డిగా వుంది."

"యువరానర్! ప్లీస్ నోట్ దిస్ పాయింట్" అని సాక్షి వైపు తిరిగి "చాల విచిత్రంగా వుంది. మీరు కూర్చున్న చోటుకు, ఆక్సిడెంట్ జరిగిన చోటుకు పెద్ద దూరం లేదన్నారు. కారు వచ్చేసమయానికి అక్కడ రెడ్ సిగ్నల్ వుందంటున్నారు. సరిగా ఆ సమయానికి అక్కడకు వచ్చిన విశాలాక్షిని చూడలేదంటున్నారు. ఏమిటది? నిజం చెప్పండి" గర్జించాడు.

బిక్షపతి వణకిపోయాడు. "నిజం. నేను చెప్పిందంతా నిజం."

"మరయితే మీరామెను యెందుకు చూడలేక పోయారు?"

"బహుశా నేను చూడలేనంత త్వరగా ఆమె రోడ్డు మీదకు వచ్చి వుండవచ్చు."

"అంటే?...."

"బహుశా పరుగెత్తి వుండవచ్చు."

"ఎందుకంటారు?"

"ఏమో! యెవర్నయినా చూచి దొంగ అని భయపడి వుండవచ్చు. లేదా ఎవరైనా వెంటాడివుండవచ్చు!

"ఆల్ రైట్. మీరామెను పలకరించారా?"

"లేదు. లేదు."

"పోనీ ఇంకెవరయినా పలకరించారా?"

"లేదు. అక్కడ ఇంకెవరూ లేరు."

"యువరానర్! ఈ పాయింట్ కూడ నోట్ చేసుకోండి" అని సాక్షివైపు తిరిగి. "అక్కడ మీరు తప్పితే ఇంకెవ్వరూ లేరంటున్నారు. హతురాలు భయపడి పరుగెత్తిందంటున్నారు. అంటే దీన్నిబట్టి, అక్కడ ఇంకెవ్వరూ లేరు కాబట్టి, మీరే ఆమెను భయపెట్టి వుండాలి! అవునా?"

"లేదు! లేదు. అసలామె ఎవరోకూడ నాకు తెలియదు" పెద్దగా అరిచాడు బిక్షపడి.

కోర్టులో అంతా ఆసక్తిగా వినసాగారు.

చక్రవర్తి తల ఊపి, నెమ్మదిగా వెళ్ళి, బిక్షపతి కళ్ళద్దాలు అందుకొని, "ఎక్కడ కొన్నారు? చాల బాగున్నాయ్!" అన్నాడు.

బిక్షపతి తడబడుతూ, "నా కళ్లద్దాలు!" అన్నాడు నెమ్మదిగా.

"ఓ! మీకు కళ్లు కన్పించవన్నమాట!"

"అవును! నాకు 'కేటరాక్టు'. ఒక కంటికి ఆపరేషన్ చేసారు."

"ఏ కంటికి?"

"ఎడం కంటికి!"

"అంటె కుడికన్ను కన్పించదు కదూ?"

"అవును!"

"మరి మీరు కూర్చున్న చోటుకు కుడివైపున ట్రాఫిక్ సిగ్నల్ ఎలా కన్పించింది?"

"తల తిప్పి చూచాను."

"మరైతే రోడ్డు దాటుతున్న విశాలాక్షి కన్పించ లేదా?"

"లేదు. పక్కవైపు నాకు కన్పించదు. ఎదురుగానే చూడగలను."

"యువరానర్, ఇతనికి "కలర్ బ్లైండ్‌నెస్" ఉంది. అదీగాక ఎనభై పర్సెంటు దృష్టిలోపం ఉంది. సాక్షి చెప్పిన ప్రకారం తను కూర్చున్న చోటుకు. ఆక్సిడెంటు జరిగిన చోటకు మధ్యదూరం, తనకూ ముద్దాయికీ ఉన్నంత దూరం అన్నాడు. అంటే యించుమించు ముప్పై అడుగులు. కాని నిజానికి సాక్షి కూర్చున్న స్థలాన్నుంచి, ఆక్సిడెంటు జరిగిన స్థలానికి దూరం అరవై రెండు అడుగులు.

అంతేకాదు, మామూలు వెలుతురులో ఇతడికి కళ్లు సరిగా కన్పించవు. పైగా మసకచీకట్లో అసలు కన్పించవు. కాబట్టి ఇతని సాక్ష్యం నమ్మదగింది కాదు.

నా క్లయింటు అంటె ముద్దాయి, గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పుడే కారు డ్రైవ్ చేస్తున్నాడు. కాని హతురాలు అది గమనించకుండా హడావుడిగా వచ్చి, పొరపాటున క్రింద పడిపోయింది అంతే కాని, ఇందులో నా క్లయింటు తప్పు లేదు. కాబట్టి కోర్టువారు అతన్ని విడుదల చేయవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

ఒక్క నిముషం భయంకర నిశ్శబ్దం ఆవరించింది కోర్టు హాలును. అర్ధగంట తర్వాత జడ్జి తీర్పు చెప్పాడు. భిక్షపతి సాక్ష్యం నమ్మదగిందికాదు. కాబట్టి ముద్దాయి మోహనరావును నిర్దోషిగా ఎంచి విడుదలచేసారు.

చక్రవర్తి ఆనందంగా తల ఎగురవేసాడు.

ప్రేక్షకులు లాయర్లు చక్రవర్తికి అభినందనలు తెలి

పారు. మోహనరావు చక్రవర్తిని కౌగలించుకొని, "మీ మేలు మర్చిపోలేను. ఈ రుణం ఉంచుకోను. ఉదయాన్నే తమను కల్సుకుంటాను" అన్నాడు ఆనందంగా.

అందరూ వెళ్ళిపోయారు. చక్రవర్తి, వాసవి మిగిలారు.

చక్రవర్తి నవ్వి, "చాల అలసిపోయాను!" అన్నాడు.

వాసవి తల ఊపింది. ఇద్దరూ బయటకు నడిచారు. కోర్టు బయట ఆవరణ ఖాళీగా వుంది.

చక్రవర్తి తల పైకెత్తి చూచి, "ముసురు పట్టింది. వర్షం రావచ్చు!" అన్నాడు.

వాసవి మాట్లాడలేదు.

"నువ్వెళ్ళి కారు తీసుకురా!" అన్నాడు మెట్లమీద నిలబడి.

వాసవి కారు తెచ్చింది. చక్రవర్తి మెట్టుదిగాడు. ఒక్కసారిగా కారు స్పీడు పెరిగింది. అంతే! మరుక్షణం పెద్ద ఆర్తనాదంతోపాటు, చక్రవర్తి శరీరం ముద్దలా మారిపోయింది కారుక్రింద.

పోలీసులు వచ్చారు. "ఏం జరిగింది?" అడిగారు.

"ఏమో! నన్ను కారు తెమ్మన్నారు. కారుతెచ్చి ఆపే లోపలే ముందు కురికారు. బ్రేక్ వేసినా లాభం లేక పోయింది" ఏడుస్తూ చెప్పింది వాసవి.

ఇన్‌స్పెక్టర్ చుట్టూ చూచి, "ఈ ఆక్సిడెంట్ నువ్వు చూచావా?" అడిగాడు.

బిక్షపతి నవ్వి, "నేనొక్కణ్నే చూచాను. ఆమె చెప్పిందే కరెక్టు అని మీరు నమ్మాలి. ఎందుకంటే నాది నమ్మదగిన సాక్ష్యం కాదు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ అర్థంకాక తల గీరుకున్నాడు. బిక్షపతి, వాసవి కళ్లు నవ్వుకున్నాయి. □

ముందుచూపు

వి. లక్ష్మీదేవి

"ఎలా వుంది?"

"షి ఈజ్ ఆల్ రైట్! రేపు డిస్చార్జి చేస్తాను. ఉదయం పదిగంటలకి" చెప్పాడు డాక్టరు.

తలూపింది కృష్ణవేణి.

"ఈ మందులు రెగ్యులర్‌గా వాడాలి. లేకపోతే ప్రమాదం.

రోగం తిరగబెట్టే అవకాశాలు చాలా ఎక్కువ. ఆరు గంటలకి ఓ క్యాప్సుల్ వేయండి."

కృష్ణవేణి డాక్టరు వ్రాసిన మందులవంక ఓసారి చూసి బెడ్‌పైన వున్న తన మూడేళ్ల కూతురు నీలిమవైపు చూసింది.

*　　　*　　　*

సాయంత్రం ఆరయింది.

ప్రకాశరావు తన గదిలో వున్న గోడగడియారంవైపు చూసి ఒళ్లు విరుచుకున్నాడు.

కారులో కూర్చున్న తర్వాతగాని తన కూతురు నీలిమ విషయం అతనికి జ్ఞాపకం రాలేదు. హాస్పిటల్‌కి ఫోన్ చేయాలనుకుంటూ పని తొందర్లో ఆ విషయం మర్చిపోయాడు.

"వెనక్కి వెళ్లి ఫోన్ చేద్దామా" అని క్షణంపాటు ఆలోచించి చివరికి ఆ ఆలోచన మానుకున్నాడు. ఎలాగూ తన భార్య కృష్ణవేణి వుంది. నీలిమ విషయం చూసుకుంటుంది. ఏదైనా అవసరం వుంటే ఫోన్ చేసేది యీపాటికి.

కారు పదినిమిషాలపాటు ప్రయాణంచేసి త్రీస్టార్ క్లబ్ ముందు ఆగింది.

అప్పటికే రాజు, గుర్నాధంలు ప్రకాశరావు కోసం ఎదురుచూస్తున్నారు.

"ఏమిటోయ్. ఈ రోజు చాలా ఆలస్యం చేసావ్?" అడిగాడు రాజు.

నవ్వాడు ప్రకాశరావు. "అవును నిజమే. ఆలస్యం

అయింది."

"వేద్దామా?"

"మీదే ఆలస్యం"

పేక ముక్కలు టేబుల్ పైన ప్రాకాయి. ఆట మంచి రస పట్టులోవుంది.

ప్రతి ఆటకీ ఫుల్ కౌంట్ ఇస్తున్నాడు ప్రకాశరావు.

"సారీ బ్రదర్! ఈ రోజు నీ డబ్బు చాలా పోయి నట్లుంది."

ప్రకాశరావు వంక క్షణంపాటు చూసి కార్డ్సు కలిపాడు గుర్నాధం.

"పోతేపోయింది వెధవడబ్బు. బ్రతికినంత కాలం హాయిగా ఎంజాయ్ చేయటం నేర్చుకోవాలి" నవ్వాడు ప్రకాశరావు విస్కీ త్రాగుతూ.

చివరి రౌండువేస్తుండగా ప్రకాశరావుకు ఫోన్ వచ్చింది. అతను ఫోన్లో మాట్లాడి హడావిడిగా వచ్చాడు.

"సారీ బ్రదర్స్! నేను అర్జంటుగా ఇంటికి వెళ్లాలి. ఏమీ అనుకోవద్దు. మేటర్ వెరీ అర్జంట్, అండ్ సీరియస్."

ప్రకాశరావు హడావిడిగా చెప్పి మళ్లీ ఫోన్ దగ్గరికి నడిచి ఓ నంబర్ డయల్ చేసాడు.

"అవును నేనే మాట్లాడుతున్నాను. సారీ! ఈ రాత్రికి రాలేను."

"..............."

"నన్నర్ధం చేసుకో నీరజా"

రిసీవర్ పెట్టి, కారు దగ్గరికి పరిగెత్తాడు ప్రకాశరావు.

2

ప్రకాశరావుని చూడగానే కృష్ణవేణి బావురుమంది.

"ఎలా జరిగింది?" అసహనంగా అడిగాడు.

"డాక్టరు రేపు డిస్చార్జ్ చేస్తామని చెప్పారు. సాయంత్రం మీరు హాస్పిటల్‌కి వస్తారు కదా అని, కృష్ణ వేణి భోజనం చేయటానికి ఇంటికి వచ్చింది."

చెప్పింది పక్కింటావిడ.

"అయితే?"

"ఇంటికి వచ్చిన అరగంటకి ఆస్పత్రినుండి ఫోను వచ్చింది—నీలిమ కన్పించటం లేదని."

"ఎవరు ఫోను చేసారు?"

"డాక్టరు"

"అతనికి ఎలా తెల్సింది?"

"నర్సు చెప్పిందట. మందువేయాలని చూస్తే బెడ్ మీద లేదుట. మళ్లీ గంట తర్వాత చూస్తే, అప్పటికీ రాలేదు. వెంటనే ఫోన్ చేసారు."

"నన్‌సెన్స్ ఇది ఎలా సంభవం?"

ప్రకాశరావు ఆస్పత్రికి ఫోన్‌చేసి డాక్టరుతో ఐదు నిమిషాలపాటు మాట్లాడి చిరాగ్గా ఫోన్ పెట్టాడు.

"తెల్సిందా?" ఆశగా అడిగింది కృష్ణవేణి.

లేదని తల త్రిప్పాడతను.

కృష్ణవేణి ఏడుస్తూంది.

ప్రకాశరావు చిరాగ్గా చూసాడామెవైపు. "ఎందుకు అనవసరంగా ఏడుస్తావు? నీలిమకి ఏమీ కాదులే."

ఏడుపు మానలేదామె.

"మీ అమ్మ ఏవైనా తీసుకువెళ్లిందేమో?"

ఏడుస్తూనే గుర్తుచేసింది, వాళ్లు తిరుపతి యాత్రకి వెళ్లిన విషయం.

ప్రకాశరావు ఏదో అనబోతుండగా గదిలో ఫోన్ మ్రోగింది. ఒక్క అంగలో వెళ్లి అందుకున్నాడు రిసీవరు.

అవతలి విషయం వింటున్నకొద్దీ అతని మొహం ఎర్ర బడింది. పిడికిలి బిగించాడు.

"తెల్సిందా? ఎవరు ఫోను చేసింది" అడిగింది. ప్రకాశరావు మాట్లాడలేదు.

కోపంతో అతని మొహం జేవురించింది. అతని వాలకం చూసి ప్రక్కింటావిడ వెళ్లిపోయింది.

మళ్లీ అడిగింది కృష్ణవేణి.

చెప్పాడు అతను.

"కిడ్నాపా? అంటే?"

"నీలిమను ఎవరో ఎత్తుకుపోయారు ఆస్పత్రినుండి."

"ఎందుకు?"

"తెలీదు. తర్వాత ఫోన్ చేస్తానన్నాడు" అంటూ రిసీవర్ ఎత్తి ఆస్పత్రికి ఫోన్ చేసాడు.

"అవును ప్రకాశరావు మాట్లాడుతున్నాను" అని క్షణం పాటు అవతల డాక్టరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు.

"యస్! మై డాటర్ ఈజ్ కిడ్నాప్డ్! పోలీసులకి ఇంటిమేట్....థాంక్ యూ! అవుటాఫ్ అవర్ ఫ్రండ్షిప్ కైండ్లీ కీప్ ది మాటర్ ఇస్ డార్క్ ఫర్ టూ డేస్.... అవును... నో ప్రాబ్లమ్స్" రిసీవర్ పెట్టేశాడు.

'పోలీసులు' అనే మాట వినేసరికి గొల్లుమంది కృష్ణవేణి.

ప్రకాశరావు ఓదార్చటానికి ప్రయత్నిస్తున్నాడు.

*   *   *

మళ్లీ ఓసారి వుత్తరాన్ని చదివాడు.

"మిస్టర్ ప్రకాశరావ్!

నీ ముద్దుల కూతురు నీలిమ మా దగ్గర క్షేమంగా వుంది. నీలిమ అంటే నీకు పంచప్రాణాలని నాకు తెల్సు. నీ కూతురు నీకు కావాలంటే నీవు నాకు ఫీజు చెల్లించుకోవాలి. ఎంత అనేది, ఎలా ఇవ్వాలి అనేది తర్వాత చెప్తాను."

భార్యకి చెప్పాడు వుత్తరం సంగతి.

పేలవంగా నవ్విందామె, ఏడవడానికి కన్నీళ్ల కరువైనట్లు.

"ఇచ్చేద్దాం! నీలిమకంటె ఎక్కువేమీ కాదు డబ్బు!"

"ఎవరో వెధవలు దొంగ బుద్ధి చూపించారని, వాళ్ల అడిగినట్లుగా డబ్బు ఇస్తే ఈసారికి వాళ్ళు వదిలిపెట్టరు. జలగలా పీల్చేస్తారు."

"అయితే ఏం చేస్తారు?"

"రహస్యంగా పోలీసుల సహాయం కోరుతాను."

"వద్దు....వద్దు" దీనంగా అందామె. "పోలీసులకి ఫోన్ చేస్తే నీలిమని చంపుతామని బెదిరించారన్నారుగా మీరు?"

"మరేం చేయాలి?"

"డబ్బు ఇచ్చేయండి."

"వాడు అడిగిన డబ్బు యివ్వగానే నీలమని అప్పగిస్తాడని నమ్మకం ఏమిటి? ఇంకా కావాలంటాడు. ధనదాహానికి అంతేముంది?"

"అయితే?"

"నీవు లక్ష చెప్పినా నేను వాడికి డబ్బు యివ్వను."

"మీకు డబ్బుపిచ్చి పట్టింది."

నవ్వాడు ప్రకాశరావు.

"మీరు పేకాటలో, రంకుముండకి డబ్బు పిచ్చిగా వెదజల్లుతారు."

ఆశ్చర్యంగా చూసాడు ఆమె వైపు. తర్వాత పకపక నవ్వాడు.

"అవును. నాకు బాధ వుండదు. అనుభవిస్తున్నానుగా."

"నా మాట వినండి" ప్రాధేయపూర్వకంగా అడిగింది.

ఆమె మొహంలోకి చూసాడతను.

"మీరు నా మాట వినకపోతే నేను వురి వేసుకు చస్తాను." ఆఖరి అస్త్రం ప్రయోగించింది.

మెత్తబడ్డాడు ప్రకాశరావు.

"సరే కృష్ణవేణి....అంతా నీవు కోరినట్లే జరుగుతుంది" అని చకచకా బయటికి వెళ్ళిపోయాడు.

3

నీటుగా సర్దాడు బ్రీఫ్‌కేసులో పదిరూపాయల కట్టల్ని.

"ఎంత?" అడిగింది.

"రెండు."

"వేలా?"

"కాదు. రెండు లక్షలు."



"ఎక్కడ ఇవ్వాలి?"

చెప్పాడు.

"ఇవ్వాల్టికి రెండోరోజు నీలిమ...." దుఃఖంతో కృష్ణ వేణి గొంతు పెగల్లేదు.

ప్రకాశరావు కారుస్టార్టుచేసి త్రీస్టార్స్‌క్లబ్‌వైపుసాగాడు. పది నిమిషాల్లో కారు క్లబ్ చేరుకుంది.

టేబుల్ ముందు కూర్చుని విస్కీ ఆర్డరిచ్చాడు.

దాదాపు పది నిమిషాలు గడిచాయి. విస్కీ త్రాగుతూ చేతిలోని వుత్తరాన్ని చదువుకున్నాడు.

"ప్రకాశరావ్!

డబ్బుతీసుకుని త్రీస్టార్స్ క్లబ్‌కి రా! రెండులక్షలకి పైసా తగ్గినా నీలిమ ప్రాణాలు బలి తీసుకున్నవాడివి అవుతావు."

సంతకం లేదు.

హఠాత్తుగా క్లబ్‌లో గొడవ మొదలయింది. లైట్లు పోయాయి. ప్రకాశరావు విసుగ్గా జేబులో చేయిపెట్టి అగ్గి పెట్టి తీసాడు. అగ్గిపుల్ల వెలిగించబోతుండగా అతని భుజం

మీద చేయి పడింది.

"తెచ్చావా!" బొంగురు గొంతు విన్పించింది.

గొంతు పోల్చుకోడానికి ప్రయత్నించాడు.

"తెచ్చాను."

"బ్రీఫ్‌కేసు ఇవ్వు."

"బ్రీఫ్‌కేస్‌లో డబ్బు వుందని నీకెలా తెల్సు?"

నవ్వు విన్పించింది.

"నీవు కేస్ పట్టుకుని రావటం చూసాను అనవసరంగా కాలయాపన చెయ్యక!"

ప్రకాశరావు క్షణంపాటు తటపటాయించాడు—ఆ మనిషి అంతు తేలుద్దామా అని? నీలిమ గుర్తుకు రాగానే ఆలోచన మాని బ్రీఫ్‌కేస్ అందించాడు.

"నీలిమ ఎక్కడ?"

ఎక్కడుందో చెప్పాడతను.

ప్రకాశరావు ఆశ్చర్యంతో నొసలు చిట్లించాడు.

4

ప్రకాశరావుతో లోనికి వస్తున్న నీలిమను చూడగానే కృష్ణవేణి ఒక్క అంగలో నీలిమను చేరుకుంది.

"ఇదిగో నీ ముద్దుల కూతురు."

"ఎక్కడుంది ఈ రెండు రోజులు?"

"నీ పుట్టింట్లో" చెప్పాడు ప్రకాశరావు.

ఆశ్చర్యంతో అంది. "అక్కడ ఎవ్వరూ లేరుకదూ?"

"అందుకే దర్జాగా ఆ యింటిని వాడుకున్నారు."

నీలిమని ముద్దుపెట్టుకుంటూ అంది కృష్ణవేణి.

"రేపు పిన్నాకి వెళదాం."

"ఏం? నీ ముద్దుల కూతురు దొరికిందనా?" నవ్వాడు.

*　　*　　*

డిటెక్టివ్ రాబర్టు సమాధానం చెప్పలేదు. అసిస్టెంట్ గ్లోరియా వైపు చూశాడు.

"మిస్టర్ ప్రకాశరావ్! ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. కిడ్నాప్‌కి రెండు లక్షలు ఇచ్చారు. ఇంకా మీ దగ్గర యెంత వుంది?"

ఊహించనిఈప్రశ్నకి ఇబ్బందిగాకదిలాడు ప్రకాశరావు.

"నిజం చెప్పమంటారా! నా దగ్గిర అంతా కలిపినా ఇంకా లక్షకంటే యెక్కువ వుండదు."

"సేవింగ్స్?" అడిగింది గ్లోరియా.

"అంతా!"

"ఇంకా ఎన్నేళ్లు మీ సర్వీస్?"

"ఈ సంవత్సరంతో అయిపోతుంది."

"తర్వాత ఏం చేస్తారు?"

"ముష్టి యెత్తుకుంటాను. ఏమిటీ అనవసర ప్రశ్నలు?" చిరాగ్గా అన్నాడు.

రాబర్టు తీక్షణంగా ప్రకాశరావు కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. "నిజమే మీరు ఏమయినా బాధపడేది లేదు. ఆ అవసరం కూడా లేదు. రెండు లక్షలు పోయాయన్న విషయం మర్చిపోకండి. ఇకపైన పేకాట, మొదలయిన వ్యసనాలకు దూరంగా వుండండి."

"ఇంతకీ ఆ కిడ్నాపర్ యెవరు?"

డిటెక్టివ్ రాబర్ట్ అందుకున్నాడు "మిస్టర్ ప్రకాశరావ్! నీలిమ దొరికిందని, ఆరోగ్యంగా వుందని ఫోన్ చేసారు."

"రియల్లీ షీ ఈజ్ క్వయిట్ హెల్తీ" చెప్పాడు.

"ష్యూర్?"

"ఎందుకు అడుగుతున్నారు అలా?"

రాబర్టు నవ్వి, గ్లోరియా వైపు చూసాడు.

"ఇంతకీ కిడ్నాపర్ యెవరు?"

"యెవరో తెలిస్తే భరించగలరా? మీ రిచ్చిన రెండు లక్షలూ, మీ భార్య నీలిమపేర ఫిక్స్డ్ సేవింగ్స్‌లో వేసిం దంటే, మీరు నమ్మగలరా?" అడిగింది గ్లోరియా.

"అసంభవం? నేన్నమ్మను"

పకపక నవ్వింది గ్లోరియా "నిజమే! మీరు నమ్మరు. నమ్మలేరు కూడా! మీకు తెల్సిందంతా, పేకాట ఆడి వందలు, వేలు పోగొట్టుకోవటం, వ్యభిచారం సాగించటం. మీకు లేకపోయినా, మీ భార్యకి ముందు చూపుంది."

నోరు తెరిచి ఆశ్చర్యంగా వింటున్నాడు.

"నీలిమ ఆరోగ్యంగా వుందని మీరు ఫోను చేయగానే వెంటనే మీ భార్యకి ఫోను చేసాను."

"ఏమంది?"

"ఒప్పుకోలేదు ముందు."

"మీకు ఆమెపై యెందుకు అనుమానం వచ్చింది?"

"నీలిమ ఆస్పత్రి నుండి మాయమైంది. డాక్టరు మందులు వ్రాసి ఇస్తూ రెగ్యులర్‌గా వాడకపోతే, రోగం తిరగబెట్టే అవకాశాలు యెక్కువ అని చెప్పటం, డాక్టరు చెప్పినప్పుడు మీ భార్య ఒక్కతే వుండటం గమనించ వలసిన విషయం."

"డాక్టరుని కలుసుకున్నారా?"

తలూపాడు రాబర్ట్.

"సో, నీలిమ ఆరోగ్యంగా వుందంటే యెవరో మందులు ఇస్తున్నారన్న మాట"

"అయితే కృష్ణవేణి....?"

"అవును. ముందు చూపుతో ఆమే ఈ నాటకం ఆడిం చింది" నవ్వింది గ్లోరియా. □

పరమశివునిపై ద్రోహా!

డాక్టర్ ప్రభాకర్

లాయర్ సత్యప్రకాశ్ గోళ్లు గిల్లుకుంటూ ఆఫీస్ రూమ్‌లో కూర్చున్నాడు.

పాపం! అతని అదృష్టం అలాగుంది. బ్రహ్మాండమైన బోర్డు కట్టి మూడేళ్లు పూర్తి కావస్తున్నా పేరుగాని, రాబడి

తెచ్చే కేసులుగాని ఒక్కటీ తగలలేదు. ఒక్కొక్కసారి ఇంటి బాడుగ చెల్లించడానికి చాలా పాట్లు పడవలసివచ్చేది. అయినా భవిష్యత్తుమీద ఆశతో సహనంతో బండి లాగిస్తున్నాడు.

"మే ఐ కమన్ సార్!"

సత్యప్రకాష్ నిద్రమత్తు వదిలింది. ఎదురుగా వున్న వ్యక్తిని కళ్ళప్పగించి, వింతగా చూడసాగాడు.

ఆ వచ్చిన వ్యక్తి వయస్సు ఎంతో చెప్పడం కష్టం! నడినెత్తిమీద జుత్తు గుండ్రంగా అందంగా ముడివేసి వుంది. ముడి చుట్టూ పూలు. మెడలో అందమైన పూల దండ. చెవులకు అందమైన కర్ణాభరణాలు-సూర్యకిరణాలు పడి బ్రహ్మాండంగా మెరుస్తున్నాయి. వాటి ఖరీదు అంచనా వెయ్యడం కష్టం. ఖరీదైన పసుపు పట్టు పంచ ధరించాడు. చేతిలో వీణ.

ఒక్క మాటలో చెప్పాలంటే నారదమహర్షికి ప్రతి రూపంలాగ వున్నాడు.

"మీరు?...." లాయర్‌గారు నీళ్లు నమిలారు.

"హూ. ఇంతకాలానికి నన్ను నేను పరిచయం చేసుకోవలసిన దుర్గతి పట్టింది. అవసరం నాది. తప్పుతుందామరి? తగువుల మారిగా పేరుపడ్డ నారదుడిని నేనే! బ్రహ్మమానస పుత్రుడ్ని. త్రిలోక సంచారిని."

"మహర్షీ! క్షమించాలి. తమరు తమరే అయ్యుంటారని అనుమానం వచ్చినా, తమవంటి శక్తిసంపన్నులకు నాలాంటి బడుగు ప్లీడర్‌తో అవసరం వుంటుందని అనుకోలేదు."

"క్షమించేసాను. ఇక అసలు సంగతికి వద్దాం. మా వినాయకుడు తెలిసే వుంటాడు. నాయకులను, వినాయకుడిని

తెలియని వాళ్లుంటారని అనుకోను. పార్వతీ పరమేశ్వరుల తనయుడు. ముచ్చటపడి ఆ జగన్మాత ప్రాణప్రతిష్ఠ చేస్తే, తొందరపాటు శంకరుడు తలనరికి, వంకర ఏనుగుతల తగిలించాడు. మనిషి రూపము, ఏనుగుతల. వీటితో పాపం మా గణపతికి వికృతరూపం ఏర్పడింది. నానా రకాల యిబ్బందులు, అగచాట్లు, అవహేళనలు. భూలోకపు పత్రికలుకూడా నానా చెత్త కార్టూన్లు వేస్తున్నారు.

ఈ అవమానాన్ని మ్రింగలేక, బయటకు చెప్పలేక గణపతి ఒకటే బాధ పడుతున్నాడు. కఠిన హృదయం మగవారిది. ఆ శివుడికి చీమకుట్టినట్లు కూడాలేదు. ఆ మాతృ హృదయం పడే బాధ చూడలేకపోతున్నాను....” కాస్త ఆగారు నారద మహర్షులు.

“ఇంతకీ నన్నేం చేయమంటారు?” లాయర్ అడిగారు.

“తొందరపడక. ఆ పరమేశ్వరుని మీద మా లోకపు అంటే దేవలోకపు న్యాయస్థానంలో పార్వతీదేవి క్రిమినల్ కేసు వేసింది. పార్టీలుగా చీలిపోయింది అప్పుడే దేవలోకం. శివుని తరపున చదువుల తల్లి సరస్వతి వకాల్తా దాఖలు చేసింది. ముందు నేను జగన్మాత పార్వతి తరపున వాదించాలనుకున్నాను గాని సరస్వతీదేవి నా తల్లి. పైగా అన్నీ తెలిసిన శక్తిమంతురాలు. అందుకే భూలోకంనుంచి మా తరపున వాదించడానికి గట్టి ప్లీడర్‌ను నియమించాలని మీ దగ్గరకు వచ్చాను” చల్లగా వచ్చినపని చెప్పారు మహర్షులవారు.

“అదేమిటి? అంత దేవలోకంలో మీ తరపున వాదించడానికి ఎవరూ దొరకలేదా.”

“త్రిమూర్తులలో ఒకరైన శివునితో వాదించడానికి, ఎదిరించడానికి ఎవరు ముందుకు వస్తారు? ప్రస్తుతం

భూలోకవాసులు, నాగరిక మానవులంటేనే భయం, భక్తీ అన్నీను. రాకెట్‌లో, ఉపగ్రహాలో, ఇంకా ఎన్నో నాకు నోరు తిరగదు గాని, విశ్వాంతరాళాలు ఛేదించుకుని వెళు తున్నారు మానవులు. అందుకే మిమ్మల్ని ఎన్నుకున్నాను. మీరు గట్టివారైనా, అట్టే ప్రాక్టీసు లేదు. మా పని నెరవేరు తుంది. మీకు సహాయం చేసినట్లు వుంటుంది."

"ఇంతకీ నా ఫీజు?"

"ప్రస్తుతానికి మీ ఖర్చులు అన్నీ భరిస్తాము. దేవ లోకంలో భోజనవసతి సదుపాయాలు ఏర్పాటుచేస్తాము. కేసు గెలిచాక మీరు ఏది కోరితే అది ఇస్తాము."

"ఫీజు ఇండియన్ కరెన్సీలో ఇవ్వాలి!" లాయర్ షరతు పెట్టాడు.

"అదెక్కడనుంచి తెచ్చేది? నా ఖర్చులకే సరిపడా దొరకటం లేదు. బంగారం రూపంలో ఇస్తాము" మహర్షులవారు కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పారు.

"అగ్రీడ్!" అన్నాడు సత్యప్రకాష్.

2

దేవసభ ఆ రోజు నిండుగా, సందడిగా వుంది. ఇసుక వేస్తే రాలనంత జనం.

దేవగురువు బృహస్పతి, ఇంద్రుడు, వాది ప్రతివాదుల తరఫు అభిమానులు, ఇతర ప్రముఖులు తమతమ ఆసనాల్లో ఆసీనులయ్యారు.

ఆ రోజు అంత జనం రావడానికి ముఖ్య కారణాలు....

లోకారాధ్యుడు, సాంబశివునిమీద పార్వతీదేవి చేసిన అభియోగం ఏమిటి?

శివుని తరఫున వాదించబోయే సరస్వతీదేవి ఏవిధంగా వాదిస్తుంది?



అన్నిటికన్నా భూలోకంనుంచి వచ్చిన అర్భకుడు వాగ్దేవి వాదనా పటిమ ధాటికి తట్టుకోగలడా?

ఇవన్నీ తెలుసుకోవడానికే అంతజనం.

గంట మోగింది ప్రారంభ సూచకంగా.

ప్రాసిక్యూషన్ తరఫున లాయర్ సత్యప్రకాష్ మాట్లాడడానికి లేచాడు. అందరూ చెవులప్పగించి వింటున్నారు.

''మిలార్డ్! జంటిల్‌మాన్ ఆఫ్ ది జ్యూరీ! మై లెర్నెడ్ ఫ్రెండ్స్!

ఈరోజు మీరు వినబోయే ఈ కేసు గురించి మీ అందరికీ ఇంతో, కొంతో తెలుసు. అయినా న్యాయాధిపతి, ప్రేక్షకుల సౌలభ్యం గురించి క్లుప్తంగా వివరిస్తాను.

ఒకప్పుడు పరమశివుడు త్రిపురాసుణ్ని హత్యచేసి కైలాసానికి తిరిగి వచ్చాడు. జగన్మాత పార్వతీదేవి అభ్యంగన స్నానం చేస్తూ, గణపతిని కాపలా గుమ్మం దగ్గర రక్షణకు నియమించింది. ఎవరైనా సరే తన అనుమతి

లేనిదే లోనికి వదలవద్దని కుమారునికి ఆదేశం యిచ్చింది ఆ తల్లి.

మాతృవాక్య పరిపాలకుడైన గణపతికి, శివునికి వాదన జరిగింది. కోపావేశంలో, ఉచితానుచితాలు మరచి, బాలుడని కూడా ఆలోచించకుండా, గణపతి తలను ఖండించాడు. పైగా మూడవ కన్ను తెరచి ఆ ఖండించిన తలను భస్మం చేసాడు.

తరువాత జగన్మాత తన ముద్దుల బిడ్డకు సంభవించిన విపత్తుకు కంటికి మింటికీ ఏకధారగా ఏడ్చింది. తరువాత ఏనుగు తల అతికించినా గణపతి శాశ్వతంగా వికృతరూపుడయ్యాడు.

అందువలన హత్యాప్రయత్నం, హత్య, వికృతరూపం శాశ్వతంగా కలిగించడం మొదలగు నేరాలకు భారతీయ శిక్షాస్మృతి I.P.C. సెక్షన్లు 299, 300, 324 చట్టాల క్రింద పరమేశ్వరుడు శిక్షార్హుడు.

సర్వశక్తి సంపన్నుడు, త్రికాలజ్ఞుడు, యుక్తాయుక్త విచక్షణ చేయవలసిన పరమేశ్వరుడే ఇటువంటి నేరాలు చేస్తే, ఇక మామూలు మనుషులను నిందించి ఏం లాభం? వారి దగ్గరనుంచి ఏమి ఆశించాలి?

పెద్దలు, జ్ఞానులు, అందరూ ఆలోచించి శివునికి కఠిన శిక్ష విధిస్తారని ఆశిస్తున్నాను'' తన వాదన ముగించాడు సత్యప్రకాష్.

సభలో చెదరుముదురుగా మాత్రం చప్పట్లు మ్రోగాయి.

లాయర్ వేపు నారదులవారు మెచ్చుకోలుగా చూసారు.

సత్యప్రకాష్‌లాగ సరస్వతీదేవి నల్లగౌను వేయక పోయినా గంభీరంగా, ఎవరికైనా గౌరవం పుట్టేటట్లు వుంది.

''పెద్దలారా! ఇంతకుముందు ప్రాసిక్యూషన్ లాయర్ పరమశివుడు భారత శిక్షాస్మృతి ప్రకారం దండనార్హుడు అని గట్టిగా వాదించారు. కాని ఆ చట్టాలు ఆ దేశవాసులకు, ఆ దేశంలో జరిగే నేరాలకు మాత్రమే వర్తిస్తాయి. కైలాస వాసి సాంబశివునికి ఆ చట్టాలు అణుమాత్రం వర్తించవు.

ఒకవేళ ప్రాసిక్యూషన్ లాయర్ తనకి భూలోకపు చట్టాలు మాత్రమే తెలుసునని వాదించినా, పరమశివుడు I.P.C. సెక్షన్ 85 ప్రకారం శిక్షార్హుడు కాడు. శివుడు నేరం జరిగిన సమయంలో గంజాయి సేవించి వున్నాడు. పైన ఉదహరించిన సెక్షన్ ప్రకారం ఏ వ్యక్తి అయినా నిషా పదార్థాలు, మాదకద్రవ్యాల ప్రభావంలో నేరం చేసి వుంటే, అతను శిక్షార్హుడు కాడు. అందువలన ఇంతకు ముందు ప్రాసిక్యూషన్ వారు I.P.C. 299, 300, 324 సెక్షన్ల క్రింద చేసిన అభియోగాలు చెల్లవు.

వీటన్నిటిని మించి స్వగృహం కైలాసంలో అడ్డు పడడంవల్ల స్వరక్షణార్థం శివుడు గణపతిని చంపవలసి వచ్చింది. అందువలన I.P.C. సెక్షన్ 97 ప్రకారం శివుడు నిర్దోషి. పైగా చేసిన తప్పు దిద్దుకొని, పార్వతి బాధ చూడలేక పునర్జన్మ ప్రసాదించాడు. గత్యంతరంలేని పరిస్థితులలో హస్తిమస్తకం తగిలించవలసి వచ్చింది.

అందువలన పరమశివుని ఇంతకు ముందు ప్రాసిక్యూషన్ వారు చేసిన నేరారోపణల నుండి విముక్తుణ్ని చేసి, న్యాయపీఠం గౌరవం నిలబెట్టాలని కోరుతున్నాను.''

సభ దద్దరిల్లేలాగ చప్పట్లు మ్రోగాయి.

లాయర్ సత్యప్రకాష్ లేచాడు. తెల్ల కాలరును ఒక్కసారి సర్దుకున్నాడు.

''డిఫెన్స్‌వారు అద్భుతంగా, యుక్తిగా వాదించినా,

అందులో సారాంశం శూన్యం. వారు చెప్పిన పాయింట్లను ఒక్కొక్కటే ఇప్పుడే ఖండిస్తాను.

పరమశివుడు భారత దేశ వాసి కాదని, అందువలన భారత శిక్షాస్మృతి, చట్టాలు ఆయనకు వర్తించవని వాదించడం పూర్తిగా అసమంజసం. భువనేశ్వర్, కాశీ, రామేశ్వరం, బద్రీనాధ్, కేదార్‌నాధ్ కాక వివిధప్రాంతాలలో ఆయనకు ఆలయాలు, వాటికి చెందిన స్థిరచరాస్తులు వున్నాయి. అందువలన ఆయన నూటికి నూరుపాళ్లు భారతీయుడే!

అందువలన భారతదేశపు చట్టాలు అన్నీ అయనకు వర్తిస్తాయి. వర్తించాలికూడా!

మాదక ద్రవ్యాలు సేవించి, తెలియక వాటి ప్రభావంలో నేరం చేస్తే I.P.C. సెక్షన్ 85 వర్తిస్తుంది. కాని పరమశివుడు తను చేస్తున్న పని పూర్వాపరాలు, జరగబోయేది తెలిసే చేసాడు. ఎవరిప్రేరణవల్లకాక, తనంతటతానే మాదకద్రవ్యాలు సేవించాడు.

ఆత్మరక్షణార్ధం హత్యచేసినట్లు డిఫెన్స్‌వారు వాదించారు. శివుడు మామూలు ప్రయత్నాలు చెయ్యలేదు. పరిమితి దాటి ప్రవర్తించాడు. నాగపాశంతో వినాయకుని బంధించవచ్చుగదా? తొందరపడి హత్య చేయవలసిన అవసరం ఏమిటి?

అందువలన మళ్ళీ నేను చెప్పేదేమిటంటే....

I.P.C. సెక్షన్ 299, 300, 324ల ప్రకారం పరమశివుడు నిశ్చయంగా శిక్షార్హుడు. ఇన్ని నేరాలుచేసి వినాయకునికి, పార్వతీదేవికి, చాలామందికి మనస్తాపం కలిగించిన పరమశివునికి కఠిన శిక్ష వేయవలసిందిగా, న్యాయం అందరికీ ఒకటే అని నిరూపించవలసిందని, న్యాయాన్ని నిల

బెట్టాలని కోరుతున్నాను.''

సత్యప్రకాష్ వాదన ముగించాడు.

సభ అంతా నిశ్శబ్దం. అందరూ తీవ్రంగా ఆలోచిస్తున్నారు. తీర్పు ఏమిటి??

జ్యూరీ సభ్యులు చెవులు కొరుక్కుంటున్నారు.

ఈ సందడిలో ఎప్పుడు బయటకు వచ్చిందో, గరళ కంఠుడి కంఠాభరణం పాము లాయర్ మీద విరుచుకుపడింది.

''అమ్మో! చచ్చాను!'' అని ఎగిరి క్రిందపడ్డాడు లాయర్ సత్యప్రకాష్.

* * *

కుర్చీలో కునుకుతీస్తున్న లాయర్ సత్యప్రకాష్ పెద్ద శబ్దంతో క్రిందపడ్డాడు. నడుము విరిగినంత పని అయింది.

ప్చ్! కలా!

కల కరిగింది.

ఎదురు గుండా—

ఇంటద్దెకోసం వచ్చిన ఇంటి యజమాని పాములా బుసలు కొడుతున్నాడు!! ☐

దొంగ?

మేజిస్ట్రేట్:— (దొంగలో) నీవేమైనా చెప్పుకునేది ఉందా?

దొంగ:— ఉంది. నాతో కలిసి సరిగా పదిమందిని పట్టుకున్నారు. కానీ అందులో ఏడుగురిని ఇన్‌స్పెక్టర్ విడిచిపెట్టాడు. ఇద్దరిని హెడ్‌కానిస్టేబుల్ విడిచిపెట్టాడు. నన్నొక్కడిని మీరు విడిచిపెట్టలేరా....?

—వాగాపురం నాగేశ్వరరావు, మల్దకల్.

ఇద్దరూ ఇద్దరే!

ప్రతాప రవిశంకర్

ఫోన్ మ్రోగింది.

ఫోమ్ బెడ్ మీద పడుకుని 'హాట్ వేవ్' మాగజైన్ చదువుతున్న లావణ్య విసుగ్గా లేచి నిలబడింది. వయ్యారంగా నడుస్తూ వచ్చి రిసీవర్ ఎత్తింది.

"హల్లో ఎవరు మాట్లాడేది?" కంఠాన్ని మృదువుగా మార్చి అడిగింది.

"లావణ్యవేనా?"

"ఎవరు మీరు?"

"శివరామ్‌ని."

ఉలిక్కిపడింది లావణ్య. అతనేనా అనుకుంది. తన అనుమానాన్ని దృఢపరచుకోటానికి "ఏ శివరామ్?" అని అడిగింది.

"గుంటూరు శివరామ్‌ని."

లావణ్య గుండెల్లో ఎలక్ట్రిక్ రైళ్ళు పరిగెత్తాయి. చెయ్యి వణికింది. చేతిలోవున్న రిసీవర్ పడిపోతున్నట్లు అనిపించి గట్టిగా పట్టుకుంది.

"మాట్లాడవేం లవ్?" అవతల్నించి శివరామ్ అంటున్నాడు.

పైన ఫ్యాను ఫుల్ స్పీడులో తిరుగుతున్నా లావణ్య వొళ్ళంతా చెమటపట్టినట్లనిపించింది.

"షాక్ అనుకుంటాను. ఎనిమిదేళ్ళ తర్వాత నా గొంతు వినటం. ఇంకో ఇరవై నిమిషాల్లో నీ దగ్గరకు వస్తున్నాను. బై" ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ దగ్గరే శిలలా నిలబడిపోయింది లావణ్య....ఏదో భయం దెయ్యంలా లావణ్యను ఆక్రమించుకుంటోంది.

మెల్లగా బెడ్‌దగ్గరకువచ్చింది,'హాట్ వేవ్'మాగజైనును తెరిచింది. పేజీలు తిప్పింది. సెక్స్‌బొమ్మలు కదులుతున్నాయి. కాని అవి యింతకుముందులా లావణ్యకు ఉల్లాసాన్ని కలిగించలేదు.

తను యిక్కడ వుంటున్నట్టు శివరామ్‌కి యెలా తెలిసింది? యిప్పుడు యిక్కడకు వచ్చి తననేం చేస్తాడు?తనని

కోరుతాడేమో! ఏమో! శివరామ్ యెలాంటివాడో తనకు బాగా తెలుసు. గొప్ప మోసగాడు!

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. అనాలోచితంగానే గంటలను లెక్కబెట్టింది.

కిటికీలోనించి ఎండ లోపలకు పడుతోంది.

ఆలోచిస్తూ వుండగానే బయట కారు ఆగిన చప్పుడు వినిపించింది.

బెడ్ మీదనించి దిగి కిటికీదగ్గరకు వెళ్ళి బయటకు చూసింది.

టాక్సీ డ్రైవర్‌కు డబ్బులిస్తున్న శివరామ్ కనిపించాడు.

బాగా జుట్టు పెంచాడు. లావుగా తయారయ్యాడు పీపాలా. టక్ చేసుకున్నాడు. కళ్లకు నల్లని అద్దాలు.

గేటు నెట్టుకుని లోపలకు వచ్చాడు.

తన గదిలోనించి బయటకు నడిచింది.

కాల్ బెల్ మ్రోగింది.

తలుపు తెరిచింది.

"హల్లో లవ్!" నవ్వుతూ విష్ చేశాడు.

బలవంతాన నవ్వింది లావణ్య.

ఇద్దరూ ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

సిగరెట్ వెలిగించాడు శివరామ్.

"నా రాక నీకు యిబ్బందిగా వుందనుకుంటాను" నవ్వుతూ అన్నాడు.

లావణ్య మాట్లాడలేదు.

"ఏమయినా రాక తప్పలేదు. ఈమధ్య ఈ సినిమా వ్యవహారంలో బాగా నష్టపోయాను. డబ్బు అవసరమయింది. నాకు వెంటనే మీ నలుగురూ గుర్తుకు వచ్చారు...."

"నలుగురా?" అడిగింది.

"అవును. నువ్వు, రాజేశ్వరి, శైలజ, సునంద గుర్తు కొచ్చారు. మీ రందరూ నాకు రాసిన లవ్‌లెటర్స్ ఇప్పటికీ నా దగ్గరే భద్రంగా వున్నాయి...." పొగ వదులుతూ అన్నాడు.

అదిరిపడింది. బ్లాక్ మెయిల్ చెయ్యటానికి వచ్చాడన్న మాట.

"భయపడకు.పరిస్థితిని అర్థం చేసుకున్నావనుకుంటాను. ఎంతో అడగనులే. పాతికవేలు చాలు."

శివరామ్ కళ్ళలోకి భయంగా చూసింది. అతను నవ్వు తున్నాడు కళ్ళు చిట్లించి.

"నేను మద్రాసునించి వచ్చేసరికి నువ్వు లేవుగదా.... తర్వాత నీకోసం వెతికాను. నీ ఆచూకీ తెలీలేదు. తర్వాత మరచిపోయాను. ఇప్పటికి నీ వునికి తెలిసింది."

నోట్లో తడారిపోయినట్లు ఫీలయింది.

తర్వాత ఎలాగో గొంతు పెగుల్చుకుని "అంత డబ్బు నా దగ్గర ఎలా వుంటుంది?" అని అడిగింది.

"నువ్వెలా సంపాదిస్తావో నాకు తెలీదు. పాతికవేలు యిచ్చావంటే నీ ఉత్తరాలు నీకిస్తాను. మళ్లీ నీ జోలికి రాను...."

లావణ్య మాట్లాడలేదు.

వాచీకేసి చూసుకున్నాడు.

"నాకు టైమయింది. అర్జంటుగా ఓ వ్యక్తిని కలుసుకోవాలి... వెళతాను. సరిగ్గా యీరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్ చేస్తాను. నేను యెక్కడ వుంటున్నదీ, నువ్వు డబ్బు యెప్పుడు తీసుకురావలసిందీ చెబుతాను. బై ...." అని బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్లిపోయాడు శివరామ్.

కుర్చీలో అలాగే కూలబడిపోయింది లావణ్య.

2

"హల్లో!"

"ఎవరూ?"

"నేను లావణ్యను మాట్లాడుతున్నాను. వెంటనే బయల్దేరి వస్తావా?"

"అంత అర్జంటా?...." అవతల్నించి అడిగాడు రాజశేఖర్.

"అవును. ముఖ్యమయిన విషయం ఒకటి చెప్పాలి."

"అలాగే యిప్పుడే వస్తున్నాను."

ఫోన్ పెట్టేసింది.

తలనొప్పి వచ్చింది లావణ్యకు. ఇది తనకు అనుకోని ఆపద. ఈ ఆపదనించి బయటపడటం యెలా? ఇందుకు రాజశేఖర్‌తో కలిసి మాట్లాడాలి.

కాలింగ్‌బజర్ మోగింది.

"కమిన్" అన్నది.

లోపలకు వచ్చాడు రాజశేఖర్. అతను తెలుగు సినిమా హీరోలా వుంటాడు. అందుకే అప్పుడప్పుడు భర్తతో కలిసి యింటికి వచ్చే అతని ఆకర్షణకు లోబడిపోయింది.

"వాట్ డియర్, ఏమిటీ అలా వున్నావ్?" పక్కనే కూర్చుంటూ అడిగాడు.

వెంటనే మాట్లాడలేదు లావణ్య.

"ఫర్వాలేదు చెప్పు.... మన రహస్యం సుందరానికి తెలిసిపోయిందా?"

"కాదు.... అనుకోని ఆపద యెదురయింది."

"ఏమిటి!"

చిన్నగా చెప్పింది.

"మైగాడ్.... బ్లాక్‌మెయిలర్ చేతిలో యిరుక్కుంటే బయటపట్టం కష్టం లావూ...."

"మరేం చేద్దాం?"

"శాశ్వత పరిష్కారం చూడాలి."

"అంటే?"

"శివరామ్‌ని ఈ లోకంనించి తప్పించాలి."

"వాట్.... హత్యా," భయంగా అడిగింది లావణ్య.

"అవును. ఇంతకంటే మార్గంలేదు...."

"పట్టుబడితే___?"

"పట్టుబడకుండా ప్లాను ప్రకారం చేయాలి."

"నా కేందుకో భయంగా వుంది."

"నీకే భయమూ వద్దు. వాడు ఫోన్ చేస్తే పాతికవేలూ ఇస్తాననీ, వుత్తరాలన్నీ యిచ్చెయ్యమనీ చెప్పు. తర్వాత వాడు తనని ఎక్కడ కలుసుకోమన్నదీ నాకు ఫోన్‌చేసి

చెప్పు....ఒక ప్లాను వేద్దాం."

"ఈ ఆపదనించి నన్ను నువ్వే రక్షించాలి. ఆయనకు తెలిసిందంటే చంపేస్తాడు."

"యూ డోంట్ వర్రీ....ఆయనకు తెలిసే వరకూ రానివ్వను. ధైర్యంగా వుండు" అని లావణ్య పెదవుల మీద, చెక్కిళ్లమీద ముద్దుపెట్టుకొని వెళ్లిపోయాడు రాజశేఖర్.

లావణ్యలో చైతన్యం వచ్చింది రాజశేఖర్ తనని యీ ఆపదనించి కాపాడగలడనే నమ్మకం ఏర్పడింది.

ఆలోచిస్తూ బెడ్ మీద పడుకుంది. రాజశేఖర్‌తో భర్త చాటున తను అనుభవిస్తున్న సుఖాన్ని నెమరువేసుకుంది. రాజశేఖర్ గొప్ప రసికుడు. స్త్రీ కోరుకునేది అలాంటి మనిషినే. తనకు రాజశేఖరం శాశ్వతంగా కావాలి.

3

గడియారం నాలుగుగంటలు కొట్టింది.

కళ్లు తెరిచింది లావణ్య. ఫోన్ పిలుపుకోసం ఎదురు చూసింది.

మ్రోగింది.

రిసీవర్ ఎత్తింది.

"గుడ్....రెడీగా వున్నావన్నమాట....విను. రేపురాత్రి పదిగంటలకు హోటల్ జంపాలా రూంనెంబర్ ట్వెంటీత్రీకి డబ్బు తీసుకునిరా....నీకోసం ఎదురుచూస్తుంటాను" శివరామ్ మాట్లాడుతున్నాడు.

"నా ఉత్తరాలన్నీ వున్నాయా?" అడిగింది లావణ్య.

"అన్నీ వున్నాయ్. మొత్తం పన్నెండు. డబ్బు ఇవ్వగానే అన్నీ యిచ్చేస్తాను."

"రాత్రి పదిగంటలకు."



"అవును. ఎగ్జాక్ట్‌గా టెన్. బై!...." ఫోన్ పెట్టేశాడు.

వెంటనే రాజశేఖర్‌కు ఫోన్ చేసింది. శివరామ్ చెప్పినదంతా అతనితో చెప్పింది.

"సరే....ఇవాళ రాత్రికి ప్లాను ఆలోచిస్తాను. రేపు మధ్యాహ్నం నేను వచ్చి చెబుతాను" అన్నాడు.

సరేనన్నది లావణ్య.

"డోంట్ ఫియర్, మనకు అనుకూలంగానే జరుగుతుంది లావా" అన్నాడు రాజశేఖరం ఫోన్ పెట్టెయ్యబోతూ.

లావణ్య భారంగా నిట్టూర్చింది.

4

రూంనెంబర్ ట్వెంటిత్రీ ముందు నిలబడింది లావణ్య. కారిడార్లో దీపాలు వెలుగుతున్నాయి.

ఒక్కసారి పైము చూసుకుంది.

సరిగ్గా పదిగంటలయింది. తలుపుమీద చిన్నగా చప్పుడు చేసింది. నిమిషం తర్వాత తలుపు తెరుచుకుంది.

ఎదురుగా శివరామ్ ...

"కమిన్" అన్నాడు నవ్వుతూ.

లోపలకు నడిచింది. "కూర్చో" అన్నాడు. ఓ కుర్చీలో కూర్చుంది.

"గుడ్....డబ్బు తీసుకొచ్చావన్నమాట."

తలూపింది.

"ఏదీ ఇలా ఇవ్వు."

"ముందు నువ్వు ఉత్తరాలు చూపించు."

"నామీద నీకు నమ్మకం లేదన్నమాట. వుండు చూపిస్తాను." అని శివరామ్ సూటుకేసు తెరిచి అందులోనించి లావణ్య ప్రేమలేఖలు వున్న ఓ కట్టతీసి చూపించాడు.

"ఇప్పటికయినా నమ్ముతావా" నవ్వుతూ అడిగాడు.

"నమ్ముతాను....యిక్కడ బాగా అనీజీగా వుంది.... కారిడార్లో నిలబడి మాట్లాడుకుందాం" అన్నది లావణ్య....

"ముందు డబ్బు ఇవ్వు?"

ఇచ్చింది!

"ఉత్తరాలు ఇవ్వు."

"ఎక్కడికి పోతాయ్! వెళుతూ తీసుకెళుదువుగానిలే.... పద, బయట నిలబడి రోడ్డుమీదకు చూస్తూ మాట్లాడుకుందాం....చాలారోజులయింది నీతో సరదాగా మాట్లాడి."

మాట్లాడకుండా అతనితో బయటకు నడిచింది లావణ్య. సరిగ్గా రాజశేఖర్ అన్నట్టుగానే శివరామ్ ప్రవర్తించినందుకు ఆశ్చర్యపోయింది. బ్లాక్ మెయిలర్ ఎవడూ మొదటిసారి డబ్బుకే సాక్ష్యాలను యివ్వడని అన్నాడతను.

ఇద్దరూ గదిముందు నిలబడి కిందికి చూస్తూ నిలబడ్డారు. తను సినీప్రపంచంలో ఎలాంటి వ్యక్తులతో పరిచయం చేసుకున్నదీ చెబుతున్నాడు శివరామ్. వింటున్నట్టు నటిస్తున్నదిగానీ లావణ్య మనసంతా రాజశేఖర్ రాకమీదే వుంది.

ఎవరిదో అడుగుల చప్పుడు వినిపించింది.

చూసింది.

రాజశేఖర్....తల వంచుకొని నిదానంగా నడుస్తూ వస్తున్నాడు.

లావణ్య గుండెలు దడదడా కొట్టుకున్నాయి.

శివరామ్—రాజశేఖర్‌ను గమనించలేదు. మామూలుగా తన గొప్పతనం గురించి చెబుతున్నాడు.

శివరామ్‌ను దాటిపోయిన రాజశేఖర్ గబుక్కున దగ్గరకు వచ్చి నోరునొక్కి శివరామ్‌ను గోడమీదినుంచి కిందకు నెట్టేశాడు....

దబ్‌న కిందకు పడిపోయాడు శివరామ్.

"క్విక్ లావ్వా....నీ ఉత్తరాలూ, ఆ డబ్బూ తీసుకొని పారిపో....టాక్సీలో వెళ్లు....నేను వెళుతున్నాను" అని గబగబా వెళ్లిపోయాడు రాజశేఖర్.

వేగంగా శివరామ్ గదిలో దూరి సూటుకేసులో వున్న తన ఉత్తరాలను, డబ్బును తీసుకుని గాలికంటే వేగంగా బయటకు వచ్చి హోటలు వెనుకవయిపున వున్న మెట్ల వైపు పరిగెత్తింది.

అప్పటికే కేకలు....అరుపులు....గోల....

జనం పరిగెత్తుతున్నారు.

గబగబా హోటల్ జంపాలా బయటకు వచ్చింది లావణ్య.

టాక్సీకోసం చూసింది. ఒక్కటికూడా కనిపించలేదు,

దూరంనించి యేదో వాహనం వస్తున్నట్లుగా లైటు వెలుతురు కనిపించింది. టాక్సీ యేమో వెయిట్ చేద్దామనుకుంది ఓ నిమిషం.

కాని అక్కడ నిలవదల్చుకోలేదు. శివరామ్ పడిపోయిన చోట జనం పోగయ్యారు....

తనని ఎవరయినా అనుమానిస్తే? తను ట్వంటీత్రీ రూమ్ గురించి యెంక్వయిరీ చేసినప్పుడు రిసెప్షనిస్టు తనని బాగానే గుర్తుపెట్టుకుని వుంటాడు.

వేగంగా రోడ్డుమీద నడుస్తోంది. వెనుకనించి వస్తున్న లైట్ల వెలుతురు దగ్గరయింది. తల తిప్పి చూసింది. టాక్సీ. చెయ్యెత్తి ఆపబోయింది లావణ్య. కాని టాక్సీ ఆగలేదు. రివ్వున దూసుకుపోయింది.

మళ్లీ నడకసాగించింది.

ఐదునిమిషాలు నడిచింది. ఇంతలో వెనుకనించి బాణంలా ఓ మోటారు సైకిలు దూసుకొచ్చింది. రోడ్డు చివరికలా తప్పుకుంది లావణ్య. ఐనా లాభంలేకపోయింది· వెనుకనించి వచ్చిన మోటార్‌సైకిల్ లావణ్యమీదినించి దూసుకుపోయింది.

గావుకేకపెట్టి నెత్తుటి మడుగులో పడిపోయింది.

హాండ్‌బాగ్ దూరంగా పొదలో పడిపోయింది.

మోటార్‌సైకిల్ ఆగకుండానే వెళ్లిపోయింది.

3

లావణ్య శవాన్ని పోస్టుమార్టమ్ తర్వాత భర్త సుందరానికి అప్పగించారు. దహనంచేసి అప్పుడే ఒక రోజయింది.

ఇంకా భార్య మరణానికి తట్టుకోలేని వాడిలా విలపిస్తున్నాడు సుందరం. అతని దగ్గరి బంధువులూ,

స్నేహితులూ అతన్ని ఓదారుస్తున్నారు.

కాని సుందరానికి కన్నీళ్లు ఆగటంలేదు.

"జరిగిందేదో జరిగింది. బాధపడకు సుందరం" అనునయంగా అన్నాడు రాజశేఖర్....

కళ్లు తుడుచుకున్నాడు సుందరం.

"దయచేసి మీరందరూ వెళ్లిపొండి....నాకు ఏకాంతం కావాలి....నన్నిలా ఏడ్వనివ్వండి. ఏడిస్తే గుండె భారం కొంతయినా తగ్గుతుందేమో" అన్నాడు సుందరం.

అందరూ మవునంగా వెళ్లిపోయారు.

ఒక్క రాజశేఖర్ మిగిలిపోయాడు.

"ఇది యాక్సిడెంటే నంటావా సుందరం" అన్నాడు రాజశేఖర్.

"ఏమో....ఎలా చెప్పగలం? లావణ్యను హత్య చెయ్యవలసిన అవసరం ఎవరికి వుంటుంది? లావణ్య వంటి ఉత్తమురాల్ని ఎవరు మాత్రం హత్య చెయ్యగలరు?"

గతుక్కుమన్నాడు రాజశేఖర్....

ఐదునిమిషాలుపాటు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం తాండవించింది.

రాజశేఖర్ ఏదో మాట్లాడబోయాడు.

ఇంతలో విసురుగా దగ్గరకు మూసివున్న తలుపులను నెట్టుకొని లోపలకు వచ్చారు పోలీసులు.

ఇద్దరూ షాక్ కొట్టినట్లు ఐపోయారు.

"అలాగే నిలబడి వుండండి మిస్టర్స్....మిమ్మల్నిద్దరినీ హత్యానేరంకింద అరెస్టు చేస్తున్నాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్.

"హత్యానేరమా?!" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"మరీ అమాయకుల్లా నటించకండి....ఇదిగో ఈ ఫోటో

చూడండి రాజశేఖర్" అని ఇన్‌స్పెక్టర్ ప్యాంటు జేబులో నించి ఓ ఫోటో తీసి చూపాడు.

అదిరిపడ్డాడు రాజశేఖర్....

తను శివరామ్‌ని నోరుమూసి పైనించి కిందకు నెట్టేస్తున్నప్పుడు తీసిన ఫోటో....

ఎవరుతీశారు? తను శివరామ్‌ను అలా హత్యచేస్తాడని ఎవరికితెలుసు??

"ఇప్పటికయినా ఒప్పుకుంటారా? శివరామ్‌ను మీరే హత్య చేశారని....ఈ ఫోటో ఎవరు తీశారనేగదా మీ అనుమానం? ఎవరోకాదు....సుందరం....ఈ ఫోటో ఈ రోజు వుదయం మాకు పోస్టులో వచ్చింది. జాగ్రత్తగాతీసి ఫోటోమీది వేలిముద్రలు తీసుకున్నాము. అప్పుడే సుందరాన్ని పనివుందని స్టేషన్‌కు పిలిపించి ఏదో వంకతో వేలిముద్రలు తీసుకున్నాము. రెండూ ఒకటే" ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

రాజశేఖర్ - సుందరంకేసి ఆశ్చర్యంతో భయంగా చూశాడు.

"నేను ఫోటోతీసిన మాట నిజమే....నా భార్య లావణ్య, రాజశేఖర్-శివరామ్‌ను చంపటానికి వేసిన ప్లాను గురించి మాట్లాడుకుంటూ వుండగా విన్నాను. కాని నేను ఎవర్నీ హత్య చెయ్యలేదు" అన్నాడు సుందరం గట్టిగా.

"హత్యచెయ్యలేదా సుందరం....వెనుకనించి మోటార్ సైకిల్‌మీద వచ్చి ఆమె మీదగా పోనిచ్చి హత్య చేసింది మీరు కదూ? మా డాగ్స్ ఆ మోటారుసైకిలు షెడ్డును పట్టుకున్నాయి. మీరు వుపయోగించిన ఆ మోటార్‌సైకిల్ టైర్లకు ఇంకా నెత్తురు అలాగేవుంది. ఆ రోజు సాయంత్రం మీరు ఆ సైకిలును అద్దెకు తీసుకున్నట్లు

సుహాసినీ ఆటోమొబైల్స్ ప్రొప్రయిటర్ చెప్పాడు. అప్పుడప్పుడు మీరు అక్కడ మోటార్‌సైకిల్ అద్దెకు తీసుకుంటారనీ చెప్పాడు. అంతేకాదు. ఆ మోటార్‌సైకిలుమీద వేలిముద్రలు కూడా దొరికాయి."

సుందరం మొహం పాలిపోయింది.

"మీరు ఎంత తెలివిగా నేరాలుచేసినా చట్టం దృష్టినించి తప్పుకోలేరు మిస్టర్స్....చట్టానికి లక్ష కళ్లు. చట్టం పరిధి చాలా విస్తృతమయినది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్.

అప్పటికే ఇద్దరి చేతులకూ బేడీలు పడ్డాయి.

"నడవండి" అన్నాడు ప్రదీప్.

మెల్లగా పాలిపోయిన మొహాలతో ముందుకు కదిలాడు.

"ఆడదాన్ని నమ్మి బలైపోయాను" అన్నాడు రాజశేఖర్ విచారంగా.

"ఈ నిజం నువ్వు ఓ వారం రోజులక్రితం తెలుసుకుని వుంటే మనిద్దరి జీవితాలూ ఇలా అయ్యేవికావు" అన్నాడు సుందరం....

"ఇద్దరూ ఇద్దరే....మీకు జైలుతిండి ప్రాప్తంవుంది.... ఎవరుమాత్రం ఏంచెయ్యగలరు? ఊఁ .... నడవండి" కసురుకున్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్. □

అప్పు??

బ్యాంకు అధికారి:— యాభై వేలు అప్పు కావాలా? అంత డబ్బుతో ఏం చేస్తావోయ్....??

ఆగంతకుడు:— అమెరికా నుండి బ్యాంక్ సేఫ్‌లను తెరిచే మిషన్ తెప్పించుకుంటానండి....!!

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

ఎమ్.వి.వి సత్యనారాయణ

ఖైదునుంచి పరారీ!

విలియమ్స్‌ను కలుసుకోవడానికి వెడుతున్నానని సునీతకి చెప్పి రోడ్డెక్కాను.

విలియమ్స్ నాకున్న బెస్ట్ ఫ్రెండ్స్‌లో ఒకడు. అతడు స్కాట్లాండ్‌లో ఏడాది క్రితం నాకు అపరాధ పరిశోధక

శిక్షణలో చాల సహకరించాడు. అతడి పనుల మీద ఇండియా వచ్చాడు. నేను ఎంత బతిమాలినా విశాఖపట్నం వచ్చి లాడ్జిలో దిగాడు.

కాలేజీ డవున్ దాటి ఆలోచిస్తూ నడుస్తున్నాను. సాయంత్రం నాలుగయింది. సూపర్ బజార్ వైపు నడుస్తున్నాను.

రోడ్డుమీద పెద్దగా జనం లేరు. రోడ్డుమీద నా వెనకే వచ్చే ప్రతి ఒక్కరూ నన్నే వెంబడిస్తున్నట్టు వూహించుకోవడం నా డిటెక్టివ్ బుద్ధి! ఏం చేయను?

కాలేజి డవున్ నుండి నా వెనకనే ఒకతను వస్తోన్నట్టు నా అనుమానం. రెండు మూడుసార్లు ప్రక్కనున్న షాప్స్ లోనికి చూస్తోన్నట్టు నటించి క్రీగంట వెనక్కి చూశాను. సందేహం లేదు. అతడు నా వంక దొంగ చూపులు చూస్తూ వెంబడిస్తున్నాడు.

బుర్రకు పదును పెట్టే కేసులేవీ నాకు ప్రస్తుతానికి లేక పోబట్టి ఈ ఆగంతకుడు నా దృష్టిలో విపరీతంగా మెదులుతున్నాడు.

అకస్మాత్తుగా పని వున్నవాడిలాగా షాపులు దాటుకుంటూ 'సిల్కుస్టోర్'లో అడుగు పెట్టి కౌంటర్‌వద్ద నిలబడి రోడ్డుమీదకు చూడసాగాను- కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి నన్ను వింతగా చూస్తోన్నట్టు నాకు తెలుసు.

క్షణాలు నిముషాల్లోకి మారుతున్నాయి కాని అతడు స్టోర్‌ను దాటిపోలేదు. నేను మెడచాపి అతడు రావలసిన వైపు చూశాను. అతడు లేడు.

నన్ను వెంబడించే వ్యక్తి షాపులో అయినా దూరి వుండాలి, లేదా ప్రభాత్ ప్రక్కగా వున్న బ్యారెక్స్‌పోయే

రోడ్డు పట్టివుండాలి. నేను వెనక్కి వెళ్ళి చూడాలన్న కోరికను అదుపులో పెట్టుకోలేకపోయాను.

స్టోర్ మెట్లు దిగి రోడ్డుమీద వెనక్కి నడుచుకుంటూ అటూ యిటూ వున్న షాపులను పరకాయించి చూచుకుంటూ వెళ్లాను.

ఆ వ్యక్తి బాటాషాప్‌లో ఫోన్ చేస్తూ కనిపించాడు. కౌంటర్ ముందు నిలబడి హుందాగా నిర్భయింగా ఫోన్ చేస్తున్నాడు. నేను మెల్లగా అతడు చాటున వుండేలాగా చూచుకుంటూ షో కేసు వెనక నిలబడ్డాను.

మాటలు నెమ్మదిగా వినిపిస్తున్నాయి.

చెవులు రిక్కించుకుని వినసాగాను.

"రెండు వందలుంటాయి" అంటున్నాడతను ఇంగ్లీషులో. ఉచ్చారణ ఇంగ్లోఇండియన్‌లాగా వుంది.

"..................."

"ఈ రాత్రికి అయిపోతాయనుకుంటాను."

"..................."

"ఇండియా...."

"..................."

"కింగ్స్.... ఎక్స్.... ట్వెల్వ్ పి. ఎం.... థాంక్యూ సర్... "

నాకు అస్పష్టంగా వినిపించిందో, అతడు కోడ్ లాంగ్వేజిలో మాట్లాడాడో అర్థం కాలేదు. కాని సంభాషణలో నాకు ఇండియా కింగ్స్ అసంబద్ధంగా కనిపించింది. పైగా ఇండియా కింగ్స్....ఎక్స్ ఏమిటి?

ట్వెల్వ్ పి. ఎం. అంటె అర్ధరాత్రి 12 గంటలకి కలుసుకుంటారేమో! ఆలోచనలు కట్టిపెట్టి నేను ప్రక్కకి తప్పుకున్నాను. ఆ వ్యక్తి చరచర బయటికి వచ్చి వెనక్కి

తిరిగిచూడకుండా సూపర్‌బజార్‌వైపు వెళ్ళిపోయాడు.

నేను రోడ్డుమీద మెల్లగా అటే నడుస్తూ ఆలోచనలకు మేత వేశాను. ఇండియా కింగ్స్—సిగరెట్సుకే అన్వయించుకుంటే....

విశాఖపట్నంలో ఇండియా కింగ్స్ దొరికే షాపులు యెన్నో లేవు. మూడు షాపులు, కేరళ నుండి వచ్చి స్థిర పడిపోయిన నాయర్లు నడిపేవి. ఒకటి మాత్రం జేమ్స్ అనే ఇంగ్లీషువాడు నడిపేది. జేమ్సుకీ ఫోన్ చేసిన వ్యక్తికీ సంబంధం వున్నదేమో!

జేమ్స్ షాప్ పోర్టు ఏరియాలో వుంది.

ఆలోచనల్లో సూపర్ బజార్ దగ్గరకు వచ్చాను. నెంబర్ ఒన్ సిటీబస్సు వస్తోంది. ఆగనిచ్చి బస్ యెక్కి పోర్టుకి టికట్ తీసుకున్నాను. చుట్టూ చూశాను. ఆ వ్యక్తి యెక్కడా లేడు. పది నిముషాల్లో జేమ్స్ కిళ్ళీషాపు ముందు నిలబడ్డాను.

జేమ్స్ సిగరెట్ కాల్చుకుంటూ యెవరితోనో మాట్లాడు తున్నాడు. మాట్లాడే వ్యక్తిని వెళ్ళిపోనిచ్చి జేమ్స్ దగ్గరకు వెళ్ళి నర్మగర్భితంగా చూచి, "ఇండియా కింగ్స్....ఎక్స్" అన్నాను. జేమ్స్ ముఖంమీదే దృష్టి నిలబెట్టాను. అతడి ముఖంలో ఎలాంటి భావ ప్రకటనా లేదు.

చెయ్యిచాపి పాకెట్ తీసి యిచ్చి తను సిగరెట్ కాల్చుకోవడంలో మునిగిపోయాడు.

ఇప్పుడు నేను ఏం చేయాలి?

ఆ పేకెట్‌ను జేబులో పెట్టాను. వెళ్ళి పోవాలా! ఏమైనా జేమ్సుకి యిచ్చి వెళ్ళాలా? ఇలా పేకెట్ తీసుకునే వాడు సందేశం యివ్వడంగానీ తీసుకోవడంగానీ చేస్తాడా?

నేను గంభీరంగా మొహంపెట్టి చక చక నడిచాను.

అప్పుడే సిటీబస్ వస్తోంది. జేమ్స్‌కేసి చూశాను. అతడు నాకేసి చూస్తున్నాడు. నుదురు చిట్లించాడు. చప్పట్లు కొట్టాడు. షాపు వెనకనుండి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాళ్లు నాకోసమే అయుండాలి.

సిటీబస్ ఆగలేదు. రష్‌గావుంది. చటుక్కున పరుగెత్తాను. సిటీబస్ డోర్ అందుకున్నాను. ఏమీ ఆలోచించకుండా ఫుట్‌బోర్డుమీద కాలుపెట్టాను. కాలు తొక్కినట్టు ఇద్దరు ముగ్గురు అరుస్తోన్నారు. నేను లెక్క వెయ్యలేదు. బస్సులోపలికి చూశాను. బస్సు కాళీగానేవుంది. ఫుట్‌బోర్డుమీద మాత్రం జనం వ్రేలాడుతున్నారు.

"పూర్ ఇండియా" తిట్టుకుంటూ, త్రోసుకుంటూ బస్సు లోపలికి వెళ్లగలిగాను. బస్సు వెనకవున్న అద్దంలోంచి చూడసాగాను. జేమ్స్ షాప్ బయటికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు బులెట్స్‌మీద బస్సును వెంబడిస్తున్నారు. బస్సులో వుండగా నాకేం ప్రమాదంలేదు.

ఇండియా కింగ్స్ సిగరెట్ పాకెట్ తెరచి చూడాలనిపించింది. జేబు తడిమాను. ఏక్షణంలో అయినా వాళ్లు బస్సును సమీపించవచ్చును.

పాకెట్‌ను జేబులోనేవుంచి మూతతెరచి తడిమాను. సిగరెట్స్ లేవు. కరెన్సీనోట్లు బొత్తిగా తగిలాయి. బయటికితీసి చూడటం ప్రమాదం? బస్సులో ఎవరైనా సి.బి.ఐ. ఏజెంటు వుండవచ్చు. లేదా ఈ రాకెట్‌కి సంబంధించిన వ్యక్తయినా వుండవచ్చు.

సిటీబస్ 'లక్ష్మీటాకీస్' వద్ద ఆగింది. బులెట్స్ ఆపి ఆ ఇద్దరు వ్యక్తులూ దిగేవాళ్లని పరిశీలగా చూడసాగారు. సీటు కాళీ అయితే నేను కూర్చుండి వాళ్లని క్రీగంట చూడసాగాను.



బస్సు కదిలింది. వాళ్లు తిరిగి బులెట్స్‌మీద బయలు దేరారు. బులెట్స్‌కీ సిటీ బస్సుకీ మూడు గజాల ఎడం మాత్రం వుంది. నేను మెల్లకా డ్రైవింగ్‌సీటు దగ్గరకు వెళ్ళసాగాను. ప్రయాణీకులను తప్పించుకుంటూ డ్రైవర్ సీటు దగ్గరగా జరిగాను.

సిటీ బస్సు పూర్ల మార్కెట్ దగ్గర ఆగి తిరిగి విపరీతమైన లోడ్‌తో బయలుదేరింది. నేను పూర్ల మార్కెట్‌లో దిగలేదని నిర్ధారణ చేసుకుని బులెట్స్‌మీద వాళ్లు తిరిగి బయలుదేరారు.

సిటీ బస్సు బేరెక్స్‌ను సమీపిస్తోంది.

"డ్రైవర్‌గారూ! బస్సును ఆపండి" అన్నాను.

డ్రైవర్ తెల్లబోయి నాకేసి చూశాడు.

"బస్సులో ఎక్కడో బాంబు టిక్ టిక్ మంటోంది. ఏ క్షణాన అయినా పేలిపోవచ్చును. సెంటర్లో ఆపితే ప్రయాణీకులు నాలుగువైపులా చెల్లాచెదురైపోతారు" కంగారు మిళాయించి నమ్మకంగా అన్నాను.

డ్రైవర్ 'నిజమా!' అన్నట్టు చూశాడు. పోలీస్ బీట్ వద్ద బస్సు ఆగిపోయింది. నేను చిరాగ్గా గొంతెత్తి ''బస్సులో ఎవరో బాంబు పెట్టారు. ఎంత త్వరగా వీల యితే అంత త్వరగా దిగి దూరంగా పారిపోండి'' అన్నాను.

బస్సులో కలకలం రేగింది. రెండు గుమ్మాల్లోంచీ ప్రయాణీకులు ప్రవాహంలాగా రోడ్డుమీదకు పరుగెడు తున్నారు. బులెట్స్‌మీద వున్నవాళ్లు ఆశ్చర్యంలోంచి తేరు కునే లోపులో నేను బస్సుకు 70 గజాల దూరంలో మలుపు తిరుగుతూ ఊటీ లాడ్జింగ్‌కేసి పరుగులు పెడు తున్నాను. విలియమ్స్ ఊటీలో బసచేశాడు. పరుగెడుతోనే వాచీ చూసుకున్నాను. 4-50 అయింది.

ఊటీ లాడ్జి ఆవరణలో అడుగుపెట్టి చకచక మెట్లు ఎక్కి పై అంతస్తుకి వెళ్ళాను. ఆవరణలో బులెట్స్ ఆగిన చప్పుడయింది. క్రిందకి చూశాను. జేమ్స్ అను చరులు బులెట్స్ దిగుతున్నారు.

నేను చకచక వరండాలో నడిచి రూం నెంబర్ ఇరపై ముందు నిలబడి అటూ యిటూ చూచి తలుపుతట్టాను. ఎవరో తెరిచినట్టుగా తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి అడుగుపెట్టాను.

''విలియమ్స్!'' అన్నాను.

సమాధానం రాలేదు. అయిదే తలుపు తీసిందెవరు? అని ముందుకు నడిచాను.

విలియమ్స్ బెడ్‌మీద నిద్రపోతున్నాడు. అతడి వీపుమీద కత్తి పిడి ఎర్రగా రక్తం మధ్య మెరుస్తోంది. తెల్లటి బెడ్ నిండా రక్తం మడుగు కట్టింది. నేను దుఃఖం అణచు కుంటూ విలియమ్స్‌ని సమీపించి అతడిమీద చెయ్యివేశాను.

అతడి మీదకు ఒంగి అటూ యిటూ చూశాను.

ఫ్లాష్ వెలిగింది!

ఒకసారి కాదు రెండుసార్లు కాదు! పదిసార్లు!

కళ్లు మిరుమిట్లు గొలిపాయి. విలియమ్స్ బెడ్‌కి అటు యిటూ నలుగురు కెమెరాలతో నిలబడి వున్నారు. వారిలో యిద్దరు చటుక్కున తమ చేతుల్లో వున్న కెమేరాలు ప్రక్కవారికి యిచ్చి నామీదకు దూకి రెండు చంకల్లోకి చేతులు దూర్చి బలంగా పట్టుకున్నారు. కెమేరాలు పట్టుకున్నవాళ్లు అందరూ నామీద రక్తం చల్లారు. ఆ వెనకనే ఫోటోలు తీశారు.

తలుపులవద్ద అలికిడయింది. తలుపులు త్రోసుకుంటూ పోలీసులు బిలబిలలాడుతూ లోపలకు వచ్చారు! నాకు అయోమయమైపోయింది. అయోమయంలోంచి తేరుకునే లోపుగా నన్ను జీపు యెక్కించి తీసుకుపోయారు పోలీసులు.

2

నా దురదృష్టానికి తోడు క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ కుమార్ వారంరోజుల క్రితమే ట్రాన్స్‌ఫర్ అయిపోయాడు. నెలక్రితం కొత్తగా వచ్చిన డి.ఐ.జి.తో గానీ, రెండునెలలయి పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్. పి.తో గానీ, నాకు అంతగా పరిచయాలు ఏర్పడలేదు.

ఫ్లాష్‌కెమేరాలు సాధించిన ఘన విజయంతో నేను హంతకుడిగా అన్ని కోణాల్లోంచి నేను 'చంపిన' విలియమ్స్‌ను తేరిపార చూస్తున్నాను. నా బట్టలనిండా రక్తం అందుకు బలమైన నిదర్శనం.

విలియమ్స్ భారీమనిషి కావడంతో రక్తం విపరీతంగా చిమ్మిందట.

నిందితుడిని కోర్టులో హాజరు పరిచేముందు పోలీసులు

అతడితో చెరలాటలాడి వాడి ఒంట్లోవున్న కండరాలూ ఎముకలూ లెక్కపెట్టే ప్రయత్నంచేస్తారు. పుట్టుమచ్చలనూ సూర్యుడు తాకని భాగాలనూ సరేసరి! గాలించి వాటి ఆకారాలు మారుస్తారు.

ఊటీ లాడ్జినించి పోలీస్‌స్టేషన్‌కి చేరిన పదినిముషాలకు నామీద కూడా అచ్చగా అదే ప్రయత్నం జరిగింది. అవసరం లేకుండానే నేను విలియమ్స్‌ను చంపినట్టు ఒప్పుకుని స్టేట్‌మెంట్ యిచ్చాను. నన్ను హత్యానేరంలో ఇరికించాలని ప్రయత్నం చేసినవారిని వారి ప్రయత్నం సఫలమైనట్టు నమ్మించాలని నా తాపత్రయం. ఇందువలన వాళ్ళు నావిషయమై ఏమరుపాటుగా వుంటారు.

చటుక్కున జేబు తడుముకున్నాను.

ఊహించినట్టే నా చేతికి ఇండియా కింగ్స్ సిగరెట్ పాకెట్ తగలలేదు.

వాచీ చూసుకున్నాను. సాయంత్రం ఆరు గంటలయింది. నన్ను వెంబడించిన వ్యక్తి రాత్రి 12 గంటలకు టయిమ్ పెట్టాడు. ఆ టయిమ్ దేనికో తెలుసుకోవాలి. అలికిడినిబట్టి పోలీస్‌స్టేషన్లో సార్జెంటూ, ముగ్గురు కానిస్టేబుల్సూ, ఒక రైటరూ వున్నట్టు అర్థం చేసుకున్నాను. నేను ఇక్కడ కటకటాల్లో ఎంతసేపు ఇరుక్కునివుంటే అంతసేపూ దుండగులకు సదవకాశం లభించినట్టే.

ఎడంకాలు యెత్తి బూటులోంచి చిన్న పాకెట్ తీశాను. చిన్న మైకా కాగితం సంచి అది. జాగ్రత్తగా పేకెట్ విప్పి నాలుగంగుళాల పొడవున్న సన్నపాటి తీగలు బయటికి తీశాను. వాటిలో 'ఏసిడ్-ఎక్స్' నింపబడి రెండు చివరలూ మూయబడ్డాయి. నా ముందున్న చువ్వల్లో నాలుగింటిని యెంచుకుని రెండడుగుల మధ్య ప్రదేశం

వుండేలాగా నాలుగింటికీ రెండేసి తీగలు చొప్పున రింగు లాగా చుట్టి చివరవున్న జిగురుతడిపి అంటించాను.

కానిస్టేబులు నా సెల్‌వైపు రావడం గమనిస్తూనే నేను ఏమీ యెరగనట్టు నేలచూపులు చూశాను. తీగలు చువ్వల రంగులోవుండి రంగుభేదం తెలియకుండా చేశాయి.

కానిస్టేబులును అటువెళ్లపోనిచ్చి పేకెట్‌లోంచి అగ్గిపుల్లతీసి వెలిగించి క్రిందివరస తీగలను వేడిచేశాను. అవి చుర చుర కాలి ఆసిడ్ పొంగింది. క్షణంలో చువ్వలు తీగలు చుట్టినమేర కరగిపోయాయి. పైవరస తీగలను కూడా కరగించి చువ్వల ముక్కలను శబ్దంకాకుండా తీసి క్రిందపెట్టాను.

అటూ యిటూ చూచి చటుక్కున సెల్‌లోంచి బయటికి గెంతి వెనక గుమ్మంలోంచి స్టేషన్ బయటపడి గోడ గెంతి రోడ్డు యెక్కాను.

నా వెనకే పోలీసులు వెంటపడతారు. ఆ సంగతి నాకు తెలుసు.

రోడ్డుమీద ఆటో కనిపించింది. చటుక్కున దాంట్లో కూలబడి 'కాలేజీ డఫన్' అన్నాను. ఆటో శబ్దం చేసుకుంటూ పరుగెత్తింది. వెనక్కి చూశాను. ఇంకా ప్రమాదం ముంచుకు రావడంలేదు. ప్రయివేట్ డిటెక్టివులకు వున్నంత చురుకు పోలీసులకు వుండదు. ఈ మాట అన్నాననే ప్రస్తుతం వున్న ఎస్.ఐ.కి కోపం.

ఆటోకి అద్దె చెల్లించి ఇంటికేసి వురుకులు పరుగులు పెట్టాను.

ఇల్లు బార్లా తెరచివుంది. ఇంట్లో అడుగుపెట్టాను. డ్రాయింగ్ రూంలో నా పైళ్ళ రాక్ అంతా చెల్లచెదురుగా పైళ్లూ, కాగితాలూ పడివుంది. నేను కేసులు పరిశోధించి

నేరస్తులు శిక్ష అనుభవిస్తోన్న కేసులు అవి. ఫైళ్ళు లెక్క-పెట్టాను. ఏ ఫైలూ పోలేదు. దుండగులు గాలించింది ఏ ఫైలు కోసమో నాకు అర్థమయిపోయింది.

ఏడాదిక్రితం పెండింగ్‌లో పడిపోయిన దొంగనోట్ల కేసు తాలూకు ఫైలుకోసం వాళ్లు వెతికివుంటారు. పెండింగ్ ఫైల్స్ యెక్కడ వెడతానో సునీతకి కూడా చెప్పను.

నా గుండె దడ దడ లాడింది.

సునీతకి ఏ ప్రమాదమూ జరగలేదు కదా!

నేను ఆలోచనలు కట్టిబెట్టి లోపలి గదుల్లోకి పరుగెత్తాను. బెడ్‌మీద సునీతని కాళ్ళూ చేతులూ కట్టి పడేశారు.

నన్నుచూచి నీరసంగా నవ్వింది సునీత.

"ఈసారి విదేశీ శత్రువులను సంపాదించారు!" అన్నది సునీత.

నాకు తలలో బల్బు వెలిగింది. విశేషస్తులు నా యింటి మీద దాడిచేశారు.

విదేశస్తుడైన విలియమ్స్ హత్య చేయబడ్డాడు.

ఇంకా రెండువందల సిగరెట్ పాకెట్లు అయిపోతే రాత్రి 12 గంటలకు మరలా దేశంలోంచి ఎగిరి చక్కా-పోతుంది.

దగ్గరగా వెళ్లి సునీతని బుగ్గతట్టి, "ధైర్యంగా వుండు సునీ! కట్లు విప్పను. ఒక నిమిషంలో పోలీసులు వస్తారు. ఈ సీన్ చూడాలి వాళ్ళు. పదకొండు గంటలకి ఏరోడ్రోం దగ్గరికిరా. నేను వచ్చి వెళ్లినట్టు పోలీసులకు చెప్పక!" అని అవసరమైన వస్తువులు పాంటు జేబులో సర్దుకుని పెరటిగోడ గెంతి రోడ్డుమీదకు తొంగిచూశాను.

మా యింటిముందు పోలీసు జీపు ఆగుతోంది.

తృప్తిగా తలాడించుకుని సందుల్లోంచి వెలుగుమీద పడకుండా జాగ్రత్తపడుతూ ఆటో మాట్లాడుకుని పోర్ట్ ఏరియాలో దిగాను. ఆటోలో వుండగానే మధ్యాపిడి దువ్వుకున్నాను. పౌడర్‌తో తలవెంట్రుకలు తెలుపుచేశాను. దుబ్బు మీసాలు అతికించుకున్నాను. ఇంట్లోంచి తెచ్చిన పంచె పాంటు యెగ్గట్టి దానిమీద కట్టుకున్నాను. షర్టు తిరగవేసి తొడుక్కున్నాను.

జేమ్స్ షాప్‌కి కొంత దూరంలో ఆటోదిగి డబ్బు చెల్లించి మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ చుట్టూ చూచుకుంటూ వెళ్లసాగాను. జేమ్స్ షాప్ యెదుటివైపు పాడుపడిన లూప్‌లైన్ మీద గూడ్సుపెట్టెలు వున్నాయి. రోడ్డుదిగి రెండోవైపునుండి గూడ్సుపెట్టెలవైపు వెళ్ళాను. చీకట్లో యెవరికీ నన్ను గుర్తించే అవకాశంలేదు. అయినప్పటికీ నా జాగ్రత్తలో నేనున్నాను.

జేమ్స్ షాపు స్పష్టంగా కనిపించేలాగా చూచుకుని గూడ్సుపెట్టె క్రింద గొంతుక్కుచున్నాను. నిముషాలు భారంగా గడుస్తున్నాయి. జేమ్స్ సిగరెట్ కాల్చుకుంటూ కష్టమర్స్‌కి కావలసినవి ఇస్తున్నాడు. వాళ్లలో ఎంతమందికి ఇండియా కింగ్స్ పాకెట్స్ యిస్తున్నాడో తెలిసే అవకాశం లేదు నాకు.

నన్ను వెంటాడిన యిద్దరూ షాపు బయట నిలబడి ఏవో పాక్ చేస్తున్నారు.

వాచీ చూసుకున్నాను.

రాత్రి ఎనిమిదిన్నరయింది.

జేమ్స్ షాపుముందు టాక్సీ ఆగింది. డ్రైవర్ గాక వెనకసీట్లో ముగ్గురు కూర్చున్నట్టు కనిపెట్టాను. వెనక డోర్ తెరచుకుని ముగ్గురు దిగారు. షాపు వెలుతురు

ముగ్గురిమీదా స్పష్టంగా పడుతోంది. మధ్యనున్న వ్యక్తిని చూచి నాకు కళ్లు జిగేల్ మన్నాయి. అతడు విలియమ్స్! అటూ యిటూ వున్నవాళ్లు అతడిని చిన్న పిస్తోళ్లతో కవర్ చేస్తూ షాప్ వెనక్కి తీసుకువెళ్ళారు.

టాక్సీ వెళ్ళిపోయింది.

విలియమ్స్‌ను ఎరగావేసి నన్ను పట్టుకున్నారు.

ఆయితే పోలీసులు విలియమ్స్ శవాన్ని ఎలా వదులుకో గలిగారు? జేమ్స్ షాపు ముందు వ్యాన్ ఆగింది. వస్తువులు పాక్ చేసేవాళ్లు డ్రైవర్ సహాయంతో వస్తువులను వ్యాన్ లోకి లోడ్ చేశారు. పాకెట్లు చాల బరువుగా వున్నట్టు అర్ధమయింది నాకు. వాళ్లు మోయలేక మోస్తున్నారు.

జేమ్స్, ఆ వెనక ఇద్దరూ విలియమ్స్‌ను పిస్తోళ్ళతో కవర్ చేస్తూ వ్యాన్ ఎక్కారు. నన్ను బులెట్స్ మీద వెంటాడిన ఇద్దరూ ఎక్కాక డ్రైవర్ తన సీట్లో ఎక్కి కూర్చుండి వ్యాన్‌స్టార్ట్ చేశాడు.

నేను అప్పటికే ప్రాకుతూ రోడ్డుమీదకు వచ్చి వేన్ వెనక వున్న బంపర్ పట్టుకు కూర్చుండి నా బూట్లకి అడుగున వున్న స్క్రూలు విప్పాను. బూట్లకి అడుగున రెండేసి చక్రాలు వెలుపలికి పొడుచుకు వచ్చాయి. వ్యాన్ కదిలింది. వ్యాన్‌తోబాటు వేగంగా జారసాగాను.

వ్యాన్ బొగ్గుజెట్టీ రోడ్డు పట్టింది. మలుపులో ఆగింది. ప్రక్కకు జారి చూశాను. ఎవరో డ్రైవర్ సీట్లో వున్న వ్యక్తితో మాట్లాడుతున్నాడు. ఓర్ హాండ్లింగ్ ప్లాంట్ ఆఫీసులో వెలిగే లైట్ల వెలుతురులో అతడిని గుర్తు పట్టాను. సాయంత్రం నన్ను కాలేజి డవున్ రోడ్‌మీద వెంబడించిన ఆంగ్లోఇండియన్. అతడు ఇచ్చిన పేకెట్లు పుచ్చుకుని డ్రైవర్ వ్యాన్ స్టార్టు చేశాడు.



ఆంగ్లో ఇండియన్ ఇంకా అక్కడే వుంటే నేను అతడి దృష్టిలో పడక తప్పదు. ఏమయితే అవుతుందని బింపరు పట్టుకున్నాను.

వ్యాన్ మెల్లగా కదిలింది. వ్యాన్ రివర్స్ అయింది. అప్పుడు చూశాను. ఆంగ్లోఇండియన్ తల వొంచుకుని ఏమీ తెలియనివాడల్లే బొగ్గుజెట్టీకేసి వెళ్ళిపోతున్నాడు.

వ్యాన్ వెనక్కి తిరిగి కాన్వెంట్ జంక్షన్ కి వచ్చింది. టైము చూచుకున్నాను. రాత్రి పదయింది.

వ్యాన్ గోపాలపట్నం పోయే రోడ్డు పట్టింది.

ఈ రోడ్ లో రాత్రి ఎనిమిది గంటలకు మోటారు వాహనముల రద్దీతప్ప జనం రద్దీ అంత వుండదు. నన్ను వ్యాన్ వెనక చూచి తెల్లబోయేవారు అసలు వుండరని కాదు. చాల తక్కువ మంది దృష్టిలో మాత్రమే పడతాను. వ్యాన్ లో వున్నవాళ్ళకి మటుకు అనుమానం రాదు.

వ్యాన్ లో నాకు అనుకూలంగా కలిసివచ్చే విలియమ్స

వున్నాడు. ఆ విషయాన్ని మరచిపోటానికి లేదు.

అరికాళ్ళు అదిరిపోయి తిమ్మిరెక్కాయి. చేతులు పట్టు చిక్కడం లేదు. అయినా నరాలు కూడదీసుకున్నాను. ఓర్పుగా వ్యాన్ ఆగే సమయం కోసం ఎదురు చూడ సాగాను. కరాస దగ్గర మలుపు తిరిగి ఎయిరోడ్రోమ్ పోయే రోడ్‌లోకి తిరిగింది వ్యాన్.

మరో అయిదు నిమిషాల్లో వ్యాన్ ఆగింది.

3

ఎయిరోడ్రోమ్ పరిసరాలను గుర్తు పట్టాను.

విశాఖపట్నం ఎయిరోడ్రోమ్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. పగలు కలకత్తా నుండి హైదరాబాదూ, హైదరాబాదు నుండి కలకత్తా పోయే విమానాలు మొత్తం రెండు ఆగుతాయి. భారీవిమానాలు దిగే అవకాశాలు లేవు. అందువలన విమానాశ్రమంలో రాత్రిపూట చాల తక్కువ సిబ్బంది మాత్రమే కాచుకుని వుంటారు.

వ్యాన్ ఆగగానే గబగబ ప్రాకుతూ రోడ్డు దిగి పల్లం లోకి జారి ఫెన్సింగ్ ప్రక్కనే వున్న పొదల్లో దాక్కున్నాను.

వ్యాన్ వెనక డోర్ తెరుచుకున్నది. మొదట జేమ్స్ దిగాడు. అతడి చేతిలో రెండు గోళాలు తళతళ లాడాయి. అవి నాకు స్కాట్‌లాండ్‌లో పరిచయం. క్లోరోఫాం గాస్ వుంటుంది ఆ గోళాల్లో. నేలను తాకుతూనే పగిలి ఒక్క క్షణంలో గాలిలో గాస్ వ్యాపించి అయిదారు నిమషాల వరకూ అక్కడున్నవారిని స్పృహ తప్పిస్తూనే వుంటుంది. ఆ గాస్ పీల్చినవారికి మూడు నాలుగు గంటలవరకూ స్పృహ రాదు.

నేను వూపిరి బిగబట్టి చూడసాగాను. జేమ్స్ మొహానికి

మాస్క్ వేసుకున్నాడు. క్లోరోఫాం గాస్ చొరకుండా అతడు శ్రద్ధ తీసుకుంటున్నాడు. అతడి వెనకనే విలియమ్స్ తప్ప అందరూ దిగారు. విలియమ్స్‌ను లోపల కట్టిపడేసి వుంటారు. తమతోబాటు విలియమ్స్‌ను తీసుకువెళ్ళరు. ఇది నా వూహ మాత్రమే. లేదా విమానంలో వాళ్ళు పారిపోయేటప్పుడు విలియమ్స్‌ను కూడా తీసుకుపోయినా ఆశ్చర్యం లేదు.

జేమ్స్ వెనుక ఒక్కరొక్కరు దిగారు. అందరి మొహాలకూ ముసుగులున్నాయి. చటుక్కున నేను జేబురుమాలు తీసి ముక్కుకి అడ్డంగా కట్టుకున్నాను.

వ్యాన్‌ని వదలి జేమ్స్ ఏరోడ్రోం ప్రవేశద్వారం దగ్గరకు దారి తీశాడు. అతడి అనుచరులు వెనక నడవసాగారు.

రోడ్డు మలుపు తిరిగితే ప్రవేశ ద్వారం.

జేమ్స్ మలుపు తిరిగాడు.

"కౌన్ హై?"

గూర్ఖా గర్జన వింటూనే జేమ్స్ శక్తికొలదీ తన చేతిలో వున్న గ్యాస్ గోళాన్ని ఒకదాన్ని ప్రవేశద్వారం కేసి కొట్టాడు. గోళం పగిలింది. గాలిలో తీయ్యటి వాసన.

పీల్చకుండా వుండలేకపోతున్నాను. అతి కష్టంమీద వూపిరి బిగబెట్టాను.

గూర్ఖా దబ్బున నేలమీద పడిపోయాడు.

నేనూ, జేమ్స్, అతడి అనుచరులు తప్పించి విమానాశ్రయం పరిసరాల్లో, ఆఫీసులో, వెయిటింగ్ రూంలో ఎవరూ స్పృహతప్పిపోకుండా వుండటానికి వీలులేదు.

జేమ్స్, అతడి అనుచరులు పదినిమిషాలు వెయిట్ చేసి ప్రవేశ ద్వారంలో అడుగుపెట్టి నిశ్చింతగా రన్ వే మీదకు

వెళ్లారు. అనుచరుల్లో ఒకడు సిగ్నలింగ్ కాబిన్‌లో అడుగు పెట్టి గ్రీన్ సిగ్నల్ యిచ్చాడు.

టైం పదకొండు అయింది.

ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. ఎవరూ మాట్లాడుకోవడం లేదు. స్మశాన నిశ్శబ్దంలో ప్రేతాల్లాగా రన్‌వే మీద తచ్చాడుతున్నారు జేమ్స్, అతడి అనుచరులు.

నేను మెల్లగా బూట్లు విప్పి చక్రాలు లోపలకు సర్దుకుని బూట్లు తిరిగి కట్టుకుని మెల్లగా ప్రాకుతూ వేన్‌లో యెక్కాను. నేను వూహించినట్లే విలియమ్స్ కాళ్ళూ, చేతులూ కట్టి పడేసి వున్నాయి. మొహానికి మాస్క్ వుంది. నా అదృష్టానికి నేనే మెచ్చుకుంటూ మాస్క్ తీసి అతడి కాళ్ళూ చేతులకు వున్న కట్లు విప్పాను.

విలియమ్స్ నన్ను ఆప్యాయంగా తడిమి కౌగలించుకున్నాడు.

"బ్రదర్! వాళ్ళు స్కాట్‌లాండ్‌లో వున్న నా కుటుంబాన్ని చిత్రహింస చేస్తానని బెదిరించి నిన్ను హంతకునిగా చూపటానికి నన్ను ఎరవేశారు. ఏంచేయగలను?" అన్నాడు విలియమ్స్.

"ఆల్‌రైట్. మర్చిపో! నీ శవంకోసం పోలీసులు వెతకలేదా? నన్ను బంధించగానే శవాన్ని మార్చ్యురీకి తరలించాలి గదా?"

"క్లోరోఫాం షెల్ వేసి పోలీసులను స్పృహ తప్పించారు."

నేను తలాడించి, విలియమ్స్ చేతికి పిస్తోలు యిచ్చి, నేను ఒక పిస్తోలును సిద్ధంగా వుంచుకున్నాను. జేమ్స్ అనుచరులు బరువులు తీసుకువెళ్ళడంకోసం వస్తారు.

ఇద్దరమూ నిశ్శబ్దంగా కాచుకుని విండో స్క్రీన్‌లోంచి

రన్‌వేమీదకు చూడసాగాము. ఆకాశంలో శబ్దమయింది. రన్‌వేమీద వున్న డ్రైవర్ చకచకా అడుగులు వేసుకుంటూ వేన్ దగ్గరకు వచ్చాడు. డ్రైవింగ్ డోర్ తెరిచి సీట్లో కూర్చున్నాడు.

నేను ఆలస్యం చేయలేదు. పిస్తోలు మడమతో బలంగా మొత్తి అతనిని ప్రక్కకు యీడ్చి వ్యాన్‌ను డ్రైవ్ చేసు కుంటూ రన్‌వేమీదకు తీసుకు వెళ్ళాను.

కొన్ని నిముషాల్లో విమానం రన్‌వేమీద దిగి పరుగెత్తు కుంటూ వచ్చి రెండు గిరికీలుకొట్టి ఆగింది. జేమ్సు అను చరులు చకచకా గాంగ్‌వేను విమానం దగ్గరకు డ్రైవ్ చేశారు.

విమానంలో ఎంత సిబ్బంది వుందో తెలియదు.

జేమ్సు అనుచరులు ఒక్కొక్కరే వేన్ వెనక తలుపు కేసి రాసాగారు.

విలియమ్సు చటుక్కున డోర్ తెరచి యిద్దరిని బలంగా డోర్స్‌తో కొట్టి స్పృహ తప్పించాడు. సైలెన్సర్ అమ ర్చిన పిస్తోలు పొగలు కక్కింది. మిగిలిన యిద్దరూ కూలి పోయారు. విలియమ్సు గురితప్పకుండా ఆ ఇద్దరికీ మోకాలి ప్రాంతంలో తగిలిలేలాగా పిస్తోలు కాల్చాడు.

జేమ్సు పరుగెత్తుకు రాబోయాడు. నేను వ్యాన్‌ని వురి కించి అతనికి డాష్ ఇచ్చాను.అతడు ఎగిరి అంతదూరంలో పడ్డాడు.

అతడి తుంటి బలంగా దెబ్బతిన్నది. అయినా ముందు జాగ్రత్తకొద్దీ వైర్‌కోసం వేన్‌లో వెతికి తీసి అతని కాళ్లూ చేతులూ కట్టి పడెయ్యాలని ముందుకు నడిచాను.

నా ముందున్న గచ్చు పెచ్చులు గాల్లోకి లేచాయి.

విమానం డోర్ దగ్గర ఒకడు నిలబడి మెషీన్ గన్ తో నామీద కాల్పులు జరుపుతున్నాడు. నేను ప్రక్కకి దొర్లి పోయాను. మరుక్షణంలో అతడు గుమ్మంలోంచి క్రిందకు అరుచుకుంటూ పడిపోయాడు.

విలియమ్స్ గురి తప్పలేదు. నా ప్రాణాలు కాపాడాడు. నేను చటుక్కున లేచి గ్యాంగ్ వే ఎక్కి విమానంలో అడుగు పెట్టబోయి ఆగాను.

"డిటెక్టివ్ శిరీష్! హాండ్స్ అప్!" వెనకనించి వినిపించింది.

చేతులెత్తాను.

ఆ గొంతు నాకు తెలిసిందే! నన్ను రోడ్ మీద వెంబడించిన ఆంగ్లోయిండియన్ ది.

దూరంగా విలియమ్స్ మూలుగుతున్నాడు.

విమానం గుమ్మంలో చప్పుడయింది. ఇద్దరు మెషీన్ గన్స్ పట్టుకుని నిలబడ్డారు.

మరుక్షణంలో తుపాకీ నిప్పులు కక్కిన చప్పుడు గాల్లో భయంకరంగా వ్యాపించింది.

ఆ వెనకే ఆంగ్లోయిండియన్ ఆర్తనాదంతో వెనక్కి పడిపోయి గిలగిల కొట్టుకుంటున్నాడు.

గుమ్మంలో మెషీన్ గన్స్ పట్టుకు నిలబడ్డవాళ్లు కెవ్వున అరుస్తూ గాల్లోకి తేలిపోయి దబ్బున నేలమీద పడ్డారు.

తలతిప్పి చూశాను.

సునీత పోలీసులను తీసుకువచ్చింది.

వాళ్ళ చేతుల్లో తుపాకులే నిప్పులు కక్కాయి.

నేను గాంగ్ వే దిగాను. పోలీసులను సమీపించాను.

సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ నా చేతులు అందుకుని, "థాంక్యూ వెరీమచ్, డిటెక్టివ్ శిరీష్! దొంగనోట్లతో మన

దేశపు బంగారాన్ని కొల్లగొట్టుకుపోయే అంతర్జాతీయ ముఠా మీ సాయంవలన దొరికారు. పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేసి ఆటంకం కల్పించినందుకు సారీ!" అన్నాడు.

"వాళ్ల నన్ను బంధించబట్టే జేమ్స్ నా పట్ల ఏమరు పాటుగా వున్నాడు. దీంట్లో బాధపడవలసిందిలేదు. కష్టడీ లోంచి తప్పుకు పారిపోయిన నేరంమీద నాకు తగిన శిక్ష వేయండి" అన్నాను.

ఎస్. పి. నన్ను కౌగలించుకున్నాడు.

ఆయన కళ్ళు వర్షిస్తున్నాయి.

విలియమ్స్ కుంటుతూ వస్తున్నాడు.

సునీతకేసి చూశాను.

ఆమె కళ్లు నక్షత్రాల్లాగా మిలమిలలాడుతున్నాయి. □

పిచ్చితగ్గింది !!

"ఏమిటోయ్....మీనాన్న రాత్రివూట కేకలు, పెడ బొబ్బలతో ఇల్లంతా హోరెత్తించేస్తున్నాడటగా! ఈ వయసులో మీ నాన్నకు పిచ్చెక్కడం నాకు చాలా బాధగా వుందోయ్!"

"అబ్బే....ఇప్పుడు పిచ్చి తగ్గిపోయిందండీ!"

"అలాగా. అంత తొందరగా ఎలా తగ్గింది?"

"మా ఇంటి ప్రక్కనవుండే సంగీతం మాష్టారు నిన్న రాత్రే ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారుగా....!!"

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

ఇంటి దొంగ

అంధవరపు మల్లిబాబు

పాఠకుల పరిశోధన పోటీ-86

(బహుమతి రు. 50/-లు నగదు)

'రంగనాధరావు' అన్న బోర్డు చూడగానే ఆ ఇంటిముందు జీప్‌ని ఆపేడు యిన్‌స్పెక్టర్ జలంధర్.

"రంగనాధరావు మీరేనా?" హాల్లోకి ప్రవేశిస్తూ అడిగేడు.

అతను లేచి నిల్చుని "యస్. నేనే మీకు ఫోన్ చేసింది. కూర్చోండి" మర్యాదగా అని, మళ్ళీ సోఫాలో కూర్చున్నాడు రంగనాధరావు.

"ఏమిటి విషయం? అసలేం జరిగింది?" ప్రశ్నించేడు జలంధర్ నొసలు ముడివేస్తూ.

పోలీసులు, తదితర సిబ్బంది జలంధర్ అనుజ్ఞకోసం కాచుకుని వున్నారు అతని ప్రక్కనే నిల్చుని.

"రాత్రి మా యింట్లో దొంగతనం జరిగింది. ఐరన్ సేఫ్‌లోంచి పదివేలు మాయమయ్యేయి" చెప్పేడు రంగనాధరావు.

"ఐరన్ సేఫ్ ఎక్కడ?" అడిగేడు.

"రండి చూపిస్తాను" రంగనాధరావు దారితీసేడు. జలంధర్ అతని సిబ్బంది అనుసరించేరు. "యీ గదిలోనే. ఏర్‌కండిషన్ సౌండ్‌ప్రూఫ్ చేయించి రెండ్నెల్లు అయింది" అని గది తలుపు తెరిచి లోపల ప్రవేశించేడు రంగనాధరావు.

జలంధర్ బృందంకూడా లోనికి వెళ్ళింది. లోపల చల్లగా వుంది. ఆ గది చూడగానే మంచి స్థితిమంతుల యిల్లు అని తెలుస్తుంది.

గదిలో గోడలకు దేశనాయకుల ఫోటోలు తగిలించి వున్నాయి. గదిలో ఒక పక్కగా మంచం వుంది. దానిమీద యూ-ఫోమ్ బెడ్. ఆ గదిలోనే ఓ మూల గాడ్రేజ్ బీరువా వుంది. అది తలుపు తెరిచి వుంది. దానికి తాళం చెవుల గుత్తి వేలాడుతోంది. డబ్బుపోయిన ఐరన్ సేఫ్ అదేనని గ్రహించేడు జలంధర్.

వేలిముద్రల నిపుణుడికి సైగజేసేడు జలంధర్.

పరీక్షజేసి, బీరువా హేండిల్ మీద వేలిముద్రలున్నాయి గానీ, వాటిమీద మళ్ళీ ఎవరివో వేలిముద్రలు పడినందువల్ల మొదటి ముద్రలు అస్పష్టంగా వున్నాయని చెప్పేడు వేలి ము ద్రల నిపుణుడు.

"దొంగతనం జరిగినట్టు ఎలా తెలిసింది?"

"మామూలుగా ఉదయం డబ్బు అవసరమై బీరువా తెరిచేను. అప్పుడు తెలిసింది నోట్లకట్ట మాయమైందని. బహుశ దానిమీద పడిన వేలిముద్రలు నావే అయివుంటాయి" అన్నాడు రంగనాధరావు.

"తాళం చెవులు ఎక్కడుంచుతారు?"

"నా దగ్గరే. పడుకున్నప్పుడు తలగడక్రింద పెట్టుకుని నిద్రపోతాను."

"మీరు పడుకునే దెక్కడ?"

"యీ గదిలోనే, యూ-ఫోమ్ బెడ్ మీద నిద్రపోతాను."

"రాత్రి మీకు బీరువా తలుపు తెరిచిన శబ్దం వినిపించ లేదా?"

"సారీ! నేను తలుపులన్నీ వేసి మొద్దు నిద్రపోతుం టాను. ఒక పట్టాన తెలివిరాదు."

జలంధర్ బీరువా తలుపు తెరిచి చూసేడు. బీరువాలో ఇంకా కొన్ని నోట్లకట్టలు వున్నాయి. అందులోనే బట్టలు, నగలుకూడా వున్నాయి. క్షణం ఆలోచించేడు. జలంధర్ కి ఒక విషయం గుర్తుకొచ్చింది.

"ఉదయం యధాప్రకారంగా తాళం చెవులు కనిపిం చేయా?"

"కనిపించేయి. ఎప్పట్లా తలగడ క్రిందనే వున్నాయి."

"సందేహం లేదు. ఈ దొంగతనం పైనుంచి వచ్చిన మనుషులు చేసింది కాదు. యిది యింటిదొంగ పనే."



"ఇంటిదొంగా? ఎలా చెప్పగలరు? మా ఇంట్లో అటువంటి వాళ్ళెవరూ లేరే."

"ఆ నమ్మకమే మిమ్మల్ని ఏమీ ఆలోచించనివ్వలేదు. కాని యిది యింట్లోనివాళ్ళ పనేనని స్పష్టంగా కనిపిస్తుంది."

"అందుకు ఆధారాలేమిటి?"

"ఖచ్చితమైన ఆధారాలున్నాయి. పైనుండి వచ్చిన దొంగయితే బీరువా తలుపు తెరిచి, ఇంత డబ్బు ఇందులో వుండగా పదివేలు మాత్రమే తీసుకుపోడు."

"అతను డబ్బు తీస్తుండగా బయట ఏదన్నా అలికిడి వినిపించి, పదివేలతో సరిపెట్టుకున్నాడేమో."

జలంధర్ నవ్వేడు.

"ఒకవేళ అలా జరిగినా, తాళంచెవులు తిరిగి మీ తలగడ క్రింద పెట్టి కొరివితో తలగోక్కునే ప్రయత్నం చేయడు. సో, యిది యింటిదొంగ పనే."

తను అంత తెలివి తక్కువగా ఆలోచించినందుకు

మనసులో నొచ్చుకున్నాడు రంగనాథరావు.

"ఆ నోట్ల నంబర్లు గుర్తున్నాయా?"

"లేవుగానీ, నాకు నూరురూపాయల నోట్లుమీద అంకెలు వేసే అలవాటుంది. ఫరెగ్జాంపుల్" అని ఒక నోట్లకట్ట తీసి చూపించి "యిందులో వందనోట్లు వున్నాయి. మొదటినోటుమీద 'వంద' అంకె వుంటుంది. రెండోనోటు మీద '99' అంకె వుంటుంది. అలాగే ప్రతినోటుమీదా వుంటుంది."

"గుడ్, మీ యింట్లో ఎంతమంది వున్నారు?"

"నేను, నా భార్య, యిద్దరు పిల్లలు, యిద్దరు నౌకర్లు."

"మీ కెవరిమీదైనా అనుమానముందా?"

"స్వంత మనుషులను అనుమానించలేను. నా భార్యది అదో లోకం. దానికి డబ్బుతో పనివుండదు. దానికి నేను యిచ్చే డబ్బే యెక్కడే పారేస్తుంటుంది. పోతే, నౌకర్లు చాలా కాలంగా నా దగ్గర యెంతో విశ్వాసంగా పనిచేస్తున్నారు. పైగా యిదివరకు నా యింట్లో యిటువంటి దొంగతనం జరగలేదు."

"ఆల్‌రైట్! రాత్రిపూట మీ భార్య ఎక్కడ నిద్రిస్తారు?"

"వేరేగదిలో. దానికి ఆరోగ్యం సరిగాలేదు. రాత్రిపూట సరిగా నిద్రపట్టని కారణంగా నిద్రమాత్రలు మింగుతుంటుంది."

"సరే మీరు వెళ్ళి, ముందు మీ యిద్దరు నౌకర్లని, తర్వాత మీ అబ్బాయిలను, మీ భార్యను ఒక్కొక్కరిగా ఈ గదిలోనికి పంపించండి. యీ దొంగతనం ఎవరు చేసేరో తెలుసుకునే ప్రయత్నం చేస్తాను" అన్నాడు.

అలాగేనని చెప్పి వెళ్ళిపోయేడు రంగనాథరావు.

2

"నీ పేరు?"

"సోమయ్య."

"నువ్వేం పని చేస్తుంటావ్?"

"వంటపని చేస్తుంటాను సార్!"

"ఇనుప బీరువామీద నీ వేలిముద్రలున్నాయి. దీనికి నీ సమాధానం ఏమిటి?"

"నే నీ గదిలో అడుగుపెట్టడం యిదే మొదటిసారి సార్. మరి నా వేలిముద్రలెలా వుంటాయ్" ఎదురుప్రశ్న వేసేడు సోమయ్య.

"రాత్రి నువ్వెక్కడ పడుకున్నావ్?"

"మా యిద్దరికీ క్వార్టర్స్ యిచ్చేరు. అందులోనే పడుకుంటాం."

"రాత్రి క్వార్టర్స్‌లోనే పడుకున్నట్లు ఋజువు చేయగలవా?"

"హుస్సేన్, నేనూ కలసి రెండో ఆట సినిమాకి వెళ్ళి వచ్చి, యిద్దరం ఒకేచోట పడుకున్నాం. హుస్సేన్ నాకు సాక్ష్యం" అన్నాడు సోమయ్య.

"సరే, నువ్వెళ్ళి, హుస్సేన్‌ని పంపించు."

తర్వాత హుస్సేన్ వచ్చాడు.

"నీ పేరు?"

"హుస్సేన్"

"నువ్వేం పనిచేస్తుంటావ్?"

"ఇంటి నౌఖరీ అంతా చేస్తుంటాన్సార్"

"ఇనుప బీరువామీద నీ వేలిముద్రలున్నాయి. ఈ దొంగతనం నువ్వే చేసేవంటాను. దీనికి నువ్విచ్చే సమాధానం?"

"యినుప బీరువామీద నా వేలిముద్రలున్నంత మాత్రాన నేను దొంగతనం చేసేనంటారా సార్? ఉంటే వుండ వచ్చు. ప్రతిరోజూ వుదయం యీ యింట్లోని అన్ని గదు లను గుడ్డతో శుభ్రం చేస్తుంటాను. ఆ పరిస్థితుల్లో ఎక్క డన్నా నా వేలిముద్రలు వుండవచ్చు. కాని నేను దొంగను కాను సార్."

"నువ్వు రాత్రి రెండు గంటలకు లేచి ఎక్కడికో వెళ్ళేవని సోమయ్య చెప్పేడు. ఎక్కడికి వెళ్ళేవు?"

ఆ మాట వినగానే గతుక్కుమనలేదు హుస్సేన్.

"వెళ్ళినమాట నిజమేగాని, నేను వెళ్ళిన విషయం సోమయ్యకు తెలియదు. ఎందుకంటే, సినిమానుంచి వస్తూనే మంచంమీదపడి గుర్రుపెట్టి నిద్రపోయేడు. ఆ తర్వాత నేను లేచి 'పాస్'కి వెళ్ళిన విషయం వాడికెలా తెలుస్తుంది?"

"ఆల్ రైట్! నీకెవరిమీదైనా అనుమానముందా?"

"ఇంట్లోని మనిషే ఈ పని చేశాడంటున్నారు. ఈ యింటి ఉప్పు తిని బ్రతుకుతున్నవాడ్ని. మరి అలాం టప్పుడు ఎవర్ని 'దొంగ'ని చెప్పమంటారు? నా కెవరిమీదా అనుమానం లేదు" అన్నాడు హుస్సేన్.

"ఇక నువ్వెళ్లు" అన్నాడు జలంధర్.

హుస్సేన్ నిష్క్రమించేడు.

3

"నా పేరు శారదాంబ" అందామె.

ఆమె వేపు పరిశీలనగా చూసేడు జలంధర్.

దాదాపు నలభై యేళ్లుంటాయి. మనిషిలో ఆధ్యాత్మిక చింతన స్పష్టంగా కనిపిస్తోంది. నుదుట విభూతిరేఖలు న్నాయి. నైరాశ్యం, నిర్లిప్తత పెదాలమీద దొర్లుతున్నాయి.



"రంగనాధరావుగారి భార్య మీరేనా?"

అవునన్నట్లు తలాడించిందామె.

"జరిగిన దొంగతనం విషయంలో మీ అభిప్రాయం?"

"నా విషయాలు తప్పితే, మరొకరి విషయాలు అంతగా పట్టించుకోను నాయనా! అయినా మన పిచ్చిగాని పోవడానికి కాళ్లొచ్చిన డబ్బు మనం ఆగమంటే ఆగుతుందా? పోయిన డబ్బు మనది కాదనుకుంటే నిశ్చింతగా వుండదూ? అదేమిటో ఆయన కెప్పుడూ డబ్బు-డబ్బు!" ఆమె వేదాంతంలోకి దించింది మెల్లిగా.

"అయితే, ఆ డబ్బు విషయం మీకేమీ తెలీదంటారా?" అనడిగేడు.

"నాకు డబ్బుమీద వ్యామోహంలేదు. తీసి ఏంచేసుకోను? నగలు, నాణ్యాలూ చాలా వున్నాయి నా దగ్గర. ఈ వయసులో నాకు మోక్షంమీద తప్పితే మరోదానిమీద వ్యామోహంలేదు నాయనా."

"మీకెవరిమీదా అనుమానం కూడా లేదా?"

"నాకయితే మా పెద్దబ్బాయి మీద అనుమానముంది. పెద్దబ్బాయికి ఈ మధ్య చెడు అలవాట్లన్నీ వంటబట్టి పూర్తిగా చెడిపోయినట్లు వింటున్నాను. డబ్బుకి కట కట లాడుతున్నట్టు కూడా కనిపించేడు. వాడే తెగించి ఈపని చేసివుండవచ్చని నా అనుమానం."

"రాత్రి మీరెక్కడ నిద్రపోయేరు?"

"ప్రక్కగదిలో"

"బీరువా తెరిచిన శబ్దంగాని వినిపించిందా?"

"నిద్ర మాత్రలు మింగి నిద్రపోతాను. నా కలాంటి శబ్దాలేవీ వినిపించవు నాయనా. ఇక నేను వెళ్లిరానా? పూజకి వేళయింది."

తలూపేడు జలంధర్.

4

"నా పేరు వుదయశంకర్. రంగనాధరావుగారి పెద్ద బ్బాయిని. నన్ను పిలిచేరట?"

పాతికేళ్ళుంటాయి. మనిషి దృఢంగా వున్నాడు. వైట్ కలర్ బెల్ బాటమ్ పాంట్, బ్లూకలర్ బ్లేజర్ ధరించేడు.

"నిన్నరాత్రి మీరు యింట్లో వున్నారా?"

"లేను" ముక్తసరిగా జవాబిచ్చేడు.

"ఋజువుచేయగలరా?"

"అది అంత అవసరమా?"

"ఈ యింటి దొంగను పట్టుకోవాలంటే అవసరమే! చెప్పండి."

"ఓ అమ్మాయితో 'త్రీ ఏసెస్' లో రాత్రంతా గడిపేను. అక్కడికెళ్ళి ఎంక్వయిరీచేస్తే తెలుస్తుంది."

"బీరువాలోని డబ్బు దొంగిలించే అవకాశం, అవసరం మీకే ఎక్కువగా వున్నాయి. ఏమంటారు?"

"ఆధారాలున్నాయా" పెడసరంగా అన్నాడు.

"మీకు తాగుడు అలవాటుందా?"

"ఏం? తాగిన మత్తులో 'త్రీ ఏసెస్'లో నుంచి యింటికివచ్చి, ఈ దొంగతనంచేసి మళ్ళీ వెళ్ళిపోయే నంటారా? తాగుతాను. కాని ఒళ్ళు తెలియనంత కాదు."

"ఆల్ రైట్! యు కెన్ గో" అన్నాడు జలంధర్.

5

"నా పేరు రాజు" అన్నాడా కుర్రాడు.

"రంగనాధరావుగారి చిన్నబ్బాయివా?" అడిగేడు జలంధర్.

పదిహేనేళ్ళుంటాయి. చురుగ్గా వున్నాడు. హిప్పీజుట్టు, బొమ్మల బుష్కోటు. చేతిలో డిటెక్టివ్ పుస్తకముంది. చిన్నవయసులోనే ఫ్యాషన్లు వంటబట్టినట్టున్నాయ్.

"ఏంచదువుతున్నావ్?"

"ఇంటర్ జూనియర్"

"రాత్రి నువ్వెక్కడ పడుకున్నావ్?"

"ప్రక్క గదిలో"

"ఈ దొంగతనం ఎవరుచేసారో చెప్పగలవా?"

"చెప్పలేనుగాని, రాత్రి పన్నెండు గంటలవుతుండగా నాకు బీరువా తెరిచిన చప్పుడు వినిపించింది. నాన్నగారు బీరువా తెరిచారామో అనుకున్నాను. కాని దొంగని తెలిస్తే నేనే పట్టుకునేవాణ్ణి" హుషారుగా చెప్పేడు.

"అప్పుడు నువ్వేం చేస్తున్నావ్?"

"గదిలో కూర్చుని చదువుకుంటున్నాను. పరీక్షలు దగ్గరపడ్డాయి కదా."

"ఆల్ రైట్! నువ్వెళ్ళు" కుర్రాడు వెళ్ళిపోయేడు.

జలంధర్ ఆలోచించసాగేడు.

రంగనాధరావు వచ్చేడు.

"రంగనాధరావుగారూ! రాత్రి మీరు తలుపులన్నీ బిడాయించి పడుకున్నారా?"

"అవును. ఈ గది తలుపులు స్ప్రింగ్‌డోర్స్, తెరిచి పట్టుకుంటేగాని వుండవు. ఎవరేనా తలుపు తెరిచి లోపలకు వచ్చినా వెంటనే మూసుకుపోతుంది" అన్నాడు.

"రాత్రి మీరు బీరువా తెరిచేరా?"

"నిన్న వుదయాన బీరువా తెరిచి, మళ్ళీ యివేళ వుదయమే తెరిచేను" చెప్పేడు రంగనాధరావు.

* * *

[ఇదీ కథ. దీనిలో దొంగ ఎవరో పరిశోధించి మాకు వ్రాయండి. మీ జవాబులు ఒక పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి. 7-7-'79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు స్టాంపులు జతపరచాలి. మాకు వచ్చిన జవాబులలో అత్యుత్తమంగా పరిశోధించిన ఇద్దరు పాఠకులకు చెరొక రు. 25/- లు బహుమతి పంపగలము. ఫలితాలు సెప్టెంబరు '79 నెల సంచికలో చూడండి.

—ఎడిటర్.]

భలే పరిశోధన?

"ఏమిటోయ్ అప్పారావ్.... ఈమధ్య నీవు కథలు వ్రాయటం మానేసినట్టున్నావ్?"

"అరె—మీ కెలా తెలుసు?"

"ఆఁ....మీ పనిమనిషి బయట పారవేసే చెత్తలో బొత్తిగా కాగితపు వుండలు కనిపించకపోతేనూ!"

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

కొత్తవాళ్ళని పలకరించకు!

మల్లాది వెంకటకృష్ణమూర్తి



గదిలో నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్న అతన్ని చూసాను. తలుపు మరీ రోడ్డుమీదకే వుండటంవల్ల నడుస్తున్న నాకు అతను కనబడ్డాడు.

అతని మొహం బాగా పరిచయమైంది అనిపించింది

నాకు. కాని ఎక్కడ చూసానో గుర్తురాలేదు. పైగా మద్రాస్ నాకు కొత్త. మద్రాస్‌లోని లాయడ్స్ రోడ్‌లో కలకత్తానించి వచ్చిన నాకు తెల్సినవాళ్ళు వుండటం అసంభవం కూడా. అంతటితో అతని సంగతి మర్చిపోయాను.

మర్నాడు వుదయం మౌంట్ రోడ్‌లో థవుజండ్ లైట్స్ దగ్గర బస్‌కోసం నిలబడి వున్నాను. అప్పుడే వచ్చి నిలబడ్డ అతను మళ్ళీ నాకంట బడ్డాడు. నావంక చూసాడు గాని నన్ను గుర్తుపట్టలేదు.

అతన్ని ఇదివరకెప్పుడో చూసానన్న సంగతి నాకు మళ్ళీ రూఢి అయింది. కాని ఎక్కడ, ఎప్పుడు చూసానో గుర్తురావటంలేదు.

కలకత్తాలో చూసివుంటాను, గత పదేళ్ళుగా నేనుండేది అక్కడే కాబట్టి.

కలకత్తాలో ఎక్కడ?

నే ఎక్కే ట్రాము ఎక్కేవాళ్ళలోనా?

కాదు.

ఇంటి చుట్టుపక్కలా?

కాదు.

జ్ఞాపకం అన్నది గమ్మత్తయినది. మనుషులని రోజూ ఏదో ఓ చోటే బస్‌స్టాప్‌లోనో, పోస్టాఫీస్‌లోనో చూస్తే, వాళ్ళు ఇంకోచోట కనబడితే ఎక్కడ చూసామో గుర్తురాదు. అదేచోట కనబడితేనే గుర్తువస్తుంది.

కలకత్తాలో మాత్రం తప్పకుండా చూసాను.

దగ్గరకి వెళ్ళి పలకరించాను బెంగాలీలో.

నావంక తీక్షణంగా చూసాడు.

''మీది కలకత్తా కదా?'' అడిగాను.

జవాబు చెప్పలేదు.

''మిమ్మల్ని కలకత్తాలో యెక్కడో చూసాను. కాని యెక్కడ చూసానో గుర్తురావడంలేదు'' చెప్పాను.

ఆలోచిస్తున్నాను. పోస్టాఫీస్‌లో కాదు. నే వెచ్చాలు కొనే షాపులో కాదు. బేంక్‌లో....

ఆఁ. అవును.

''మీరు అక్కడ బేంక్‌లో పనిచేసేవారు కదా?''

అతని మొహంలో కొద్దిసేపు చికాకు చోటు చేసుకుని మాయమయింది వెంటనే.

''అవును'' చిన్నగా నవ్వాడు.

''నేను కలకత్తాలో ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాను. నా పేరు....''

పరిచయం చేసుకున్నాను బెంగాలీలో.

''నా పేరు శ్రీ వాత్సవ'' చెప్పాడు.

''బేంక్ పనిమీద వచ్చారా?'' అడిగాను.

''అవును. మీరు....''

''ఆఫీస్‌కేంప్.''

''ఎన్నిరోజులయింది వచ్చి?''

''వారం.''

''ఎప్పుడు వెళ్తున్నారు మళ్ళీ?''

''ఎల్లుండి. మీరు....?''

''ఇంకోవారం వుంటాను. కలకత్తాలో మిమ్మల్ని యెప్పుడూ చూసిన గుర్తులేదే?'' అడిగాడు.

''నిజానికి అక్కడ మనిద్దరికీ పరిచయంలేదు. మద్రాస్‌లో కాబట్టి మన వూరివాడని పలకరించాను మిమ్మల్ని.''

''ఇదే కలకత్తాలో అయితే పలకరించేవారు కాదా?'' నవ్వాడు.

''అసలక్కడ అంత తీరికెక్కడ?'' నవ్వాను.

''మరి యెలా తెలుసు నేను?''

''ఓసారి మీ బేంక్‌లో పనిచేసే నా స్నేహితుడికోసం వస్తే మీరున్నారు సేవింగ్స్ బేంక్ కౌంటర్‌లో. అప్పుడు చూసాను.''

''మీ స్నేహితుడి పేరు?''

''షా''

''ఓ. షా నాకు బాగా తెలుసు.''

''షా తమ్ముడు నా సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. షా ఇంటికి తరచు వెళ్తూంటాను.''

''మీకు జ్ఞాపకశక్తి బాగా వున్నట్లుందే?'' నవ్వాడు.

''మామూలుగా అయితే మిమ్మల్ని గుర్తుంచుకునే వాడినికాను. కాని నేను మిమ్మల్ని చూసిన రెండు రోజుల తర్వాత ఓ చిన్న సంఘటన జరిగింది బస్‌లో. దాంతో మీరు గుర్తుండిపోయారు యెందుకో'' చెప్పాను.

''ఏమిటా సంఘటన....'' అని ఆగి అన్నాడు.

''కాఫీ తాగుదామా? మీకేమయినా పనివుందా?''

''ఓ అరగంటదాకా ఫ్రీ నేను. రండి.''

ఎదురుగావున్న హోటల్‌కి వెళ్ళాము.

''ఎలా గుర్తున్నాను?'' అడిగాడు.

''ఆ రోజు మీరు బస్‌లో వస్తున్నారు. 13 వ నంబర్ బస్‌లో. కండక్టర్‌కి అయిదు రూపాయల నోటిస్తే మీకు టిక్కెట్ ఇచ్చాడు. చిల్లర ఇవ్వలేదు. మీరు దిగేటప్పుడు చిల్లర అడిగితే అయిదు ఇవ్వలేదన్నాడు. మీరు ఇచ్చానన్నారు. ఇస్తే టిక్కెట్ వెనకాల యెంత ఇవ్వాలో

పెన్సిల్‌తో రాసేవాడిని అన్నాడు కండక్టర్. మీరు నాలుగు స్టాపుల తర్వాత దిగిపోతున్నారు కాబట్టి ఇస్తాడనే వూహతో టిక్కెట్ వెనకాల చిల్లర రాయకపోయినా వూరు కున్నానన్నారు. చాలా గొడవపడ్డారు మీరు కండక్టర్‌తో. దాదాపు పదినిముషాలు బస్సు ఆగిపోయింది. మీరు అయిదు ఇవ్వగా చూసినవాళ్ళు ఆ సంగతి సాక్ష్యం చెప్పారు....''

చిరునవ్వుతో వింటూండిపోయాడు శ్రీవాత్సవ.

''ఆ రోజు నేను నిజంగా అయిదు ఇచ్చాను. కండక్టర్ నిజంగా మర్చిపోయాడో లేదా ఆ డబ్బు కొట్టేయాలని అలా ఇవ్వలేదని నాటకం ఆడాడో తెలియదు నాకు.''

''మీరు జి.ఎమ్.కి రిపోర్ట్ చేస్తానంటే చేసుకో పొమ్మన్నాడు. కాని చిల్లర ఇవ్వనేలేదు.''

''నిజానికి ఆ రోజు వాడిని చితక్కొట్టాలన్నంత కోపం వచ్చింది కాని చదువుకున్న వాళ్ళం చూస్తూ చూస్తూ అలాంటి పనులు చేయలేం కదా?''

''నిజమే.''

''నెలాఖరు రోజులు. ఆ అయిదుతప్ప నాదగ్గర డబ్బు లేదు. జీతం వచ్చేదాకా నడిచివెళ్ళి నడిచివచ్చాను బేంక్‌కి. పాత పేపర్‌లు ఇంట్లో లేవా అంటారేమో? అవి అమ్మే ఆ డబ్బు సంపాదించాను'' అన్నాడు నవ్వి.

నేనూ నవ్వాను.

కాఫీ తాగాం.

''ఈ వూళ్లో కాఫీ స్టీల్ గ్లాసుల్లో ఇస్తారు గాజు గ్లాసుల్లో కాకుండా. రేట్లు బాగా చవకకూడా'' అన్నాను.

''నిజమే.''

''మీకు చుట్టాలున్నారా ఈ వూళ్ళో?'' అడిగాను.

''లేరు.''

''రెండురోజులక్రితం లాయడ్స్ రోడ్‌లో ఓ ఇంట్లో చూసాను మిమ్మల్ని'' చెప్పాను.

''ఎక్కడుంది ఆ రోడ్?''

''సఫైర్ థియేటర్ పక్కనుండే పెట్రోల్ బంక్ యెదురుగా వుండే రోడ్ లాయడ్స్ రోడ్. అచ్చం మీలాంటి మనిషినే చూసాను.''

''నాకుడ్యూపా?'' నవ్వాడు.

బిల్ తెచ్చాడు బేరర్. నేనిస్తానంటే మర్యాదకి ఓసారి వద్దన్నాడు, కాని నేను ఇస్తూంటే వారించలేదు రెండోసారి.

బయటకి వచ్చాం హోటల్‌లోంచి.

''ఎటు మీరు?'' అడిగాడు.

''మాంబళమ్. బస్‌లో వెళ్తాను. మీరు?''

''ట్రిప్లికేన్. పదమూడో నంబర్ బస్ వెళుతుందనుకుంటాను'' అన్నాడు.

"అయితే కలకత్తాలో కలుద్దాం మళ్ళీ."

చెయ్యి చాపాను.

కరచాలనం చేసి "గుడ్‌బై" అన్నాడు.

నేను జాగ్రత్తగా రోడ్డు దాటసాగాను.

అకస్మాత్తుగా నా భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూసేంతలో....

క్షణాల్లో బలంగా నెట్టాయి నన్ను ఆ చేతులు రోడ్డు మధ్యకి. గట్టిగా కేక పెట్టాను. ఏదో బండి ఆగుతున్నట్లుగా కీచుమన్నాయి.

వంటినిండా హఠాత్తుగా బాధ. వంట్లోవి అణువణువూ ఆవిరయిపోతున్నట్లుగా బాధ, నీరసం.

స్పృహ తప్పుతున్న నాకు అనేక మంది గట్టిగా అరుస్తూ నా దగ్గరకి రావడం లీలగా గుర్తుంది.



మందంగా వినబడుతున్నాయి మాటలు.

ఆ భాష రాదు నాకు.

అరవంలో మాటాడుతున్నారు. ఒక మగ కంఠం, ఒక ఆడకంఠం.

మెల్లిగా కళ్లు తెరిచాను. గట్టిగా మూలిగాను. ఒళ్ళంతా రోడ్ రోలర్ క్రిందపెట్టి ఇస్త్రీ చేసినట్లుగా బాధ.

తెల్లటి యూనిఫాంలోవున్న నర్స్ నా దగ్గరికివచ్చింది.

"ఎలా వుంది ఇప్పుడు?" అడిగాను చిరునవ్వుతో.

"ఏమిటీ?"

బిత్తరపోయి చూసింది.

"ఏక్సిడెంట్ అయిందిగా! ఎలా వుంది మీకు?" అడిగాను మళ్ళీ.

నా వంక విచిత్రంగా చూసింది.

"ఖంగారుపడకు. రోడ్డుకింద పడింది నేను. దెబ్బలు

తగిలింది నాకు. తమాషా చేసానంతే- ఒళ్ళంతా మంట లుగా వుంది. ఏదయినా మత్తుమందు ఇచ్చి నిద్రపోయేలా చేయరాదా?" అడిగాను.

"డాక్టర్‌తో చెప్తాను" అన్నది.

"మీ ప్రాంతంవాళ్ళు చాలా అందంగా వుంటారు" అన్నాను.

అందంగా నవ్వింది.

"థాంక్స్. మీరు బెంగాలీయా?" అడిగింది.

"ఎలా తెలుసు?" అడిగాను.

"మీకు ఏక్సిడెంట్ అవగానే ఇక్కడికి తీసుకు వచ్చేరు. అప్పటికే చాలా రక్తం కారిపోయింది. అదృష్టవశాత్తూ మీది 'ఓ' గ్రూప్ రక్తం. మిగతా ఏ గ్రూప్ రక్తం ఎక్కించినా పనికి వస్తుంది 'ఓ' గ్రూప్‌రక్తం వున్న వాళ్ళకి. సమయానికి రక్తం సిద్ధంగా వుంది."

"బ్రతికించినందుకు థాంక్స్. కాని నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు మీరు."

"మీ జేబులో మీ ఫోటో, విజిటింగ్ కార్డు, ఇంటి ఎడ్రసు వున్నాయి. మద్రాస్‌లో మీరు బస చేస్తున్న హోటల్ గది తాళంచెవి కూడా వుంది అదే జేబులో"

"చిన్నసైజు డిటెక్టివ్ పని! అవునా?"

"నేను కాదు. డాక్టర్. ఆయన డిటెక్టివ్ పుస్తకాలు చదువుతాడు. డిటెక్టివ్ సినిమాలు చూస్తాడు."

"అయితే మీకు డాక్టర్‌గా తగడు."

"అన్నట్లు మీ మద్రాస్ ఆఫీస్ బ్రాంచి మేనేజరుకి ఫోన్‌చేసి చెప్పాము మీ సంగతి. ఆయన వచ్చి ఇంత దాక ఇక్కడే కూర్చున్నారు. మళ్ళీ వస్తానని యింటికి వెళ్ళారు. ఫోన్ చేయమన్నారు మీకు స్పృహ రాగానే."

''వద్దు. నాకింకా స్పృహ రాలేదు. సేల్స్ గురించి మాట్లాడతాడు. ఆయన భార్య కూడా ఆయన ఆఫీస్‌లో పని చేస్తే అర్ధరాత్రి పడక గదిలో కూడా ఆఫీస్ విషయాలే మాట్లాడుతాడు నిద్రపట్టేదాకా.''

పకపకా నవ్వింది నర్స్.

''అయినా రోడ్డుమీదనడుస్తూ అంత అజాగ్రత్త అయితే ఎలా?'' చనువుగా మందలించింది.

''అజాగ్రత్త అప్పుడప్పుడు మంచిది. మీలాంటి వాళ్ళ పరిచయ భాగ్యం కలుగకపోతే ఎలా?''

''నన్ను పరిచయం చేసుకోదలుచుకుంటే అక్కడ రోడ్డుకి అడ్డంగా నిలబడేకంటే ఇటు మేడమెట్లు ఎక్కి వస్తే సరిపోయేదిగా?'' అన్నది చేత్తో బయటికి చూపిస్తూ.

''ఈసారి మద్రాస్ వచ్చినప్పుడల్లా అదేపని చేస్తాను'' అన్నాను కిటికీలోంచి నర్స్ చూపించిన వైపు చూస్తూ.

చిత్రం!

నాకు ఏక్సిడెంట్ అయిన చోటునే పడుకునున్న మంచం మీద నుంచి కనిపిస్తోంది. ఆ చోటుని చూడటంలో చిత్రమైన అనుభూతి వుంది.

''ఎంతసేపయింది?'' అడిగాను.

''రెండు రోజులు.''

''రెండు రోజులే....?''

ఆశ్చర్యపోయాను.

''అవును ఓ రోజంతా కోమాలో వున్నారు. అసలు బ్రతుకుతారనుకోలేదు మీరు.''

''మీతోయేదో ఋణంతీర్చుకోవాలికాబట్టిబ్రతికానుకదా?''

సిగ్గుగా బయటకి చూసింది నా వైపు చూడలేక. నలభై ఏళ్ళయినా అందంగా సిగ్గుపడగలదనిపించింది నాకు.

"దాచుకోండి కొంత సిగ్గు" అన్నాను.

డాక్టర్ వచ్చాడు.

"హలో! ఎలా వుంది?"

పేరు పెట్టి పలకరించి అడిగాడు.

"చాలా బాధగా వుంది" చెప్పాను.

తలవైపు వున్న క్లిప్‌బోర్డు అందుకుని అందులోని కాగితం మీద రాసివున్న రీడింగ్ చదివాడు.

"థాంక్యూ డాక్టర్.... సమయానికి...."

"ఇట్సాల్ రైట్. నేను మీరు కారుకింద పడుతూండగా చూసాను ఇదే కిటికీలోంచి. నిముషాల్లో ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు. రక్తం, గ్లూకోజ్ ఎక్కించాం. మీ బ్రాంచ్ మేనేజర్ తర్వాత చెప్పారు బిల్ మీ ఆఫీస్ చెల్లిస్తుందని."

"ఒంట్లో అన్ని భాగాలు సరిగా వున్నాయా? లేక ఫ్రాక్చర్ అయాయా ఏమయినా."

నర్స్ వెళ్ళిపోయింది.

"కుడికాలు ఫ్రాక్చర్ అయింది. అయితే తప్పకుండా అతుక్కుంటుంది."

"నడకలో మార్పేమయినా వస్తుందా?"

"రాదు."

"నే లేచి తిరగడానికి ఎంతకాలం పడుతుంది?"

"నెల దాటుతుంది. ముప్ఫై రెండు కుట్లుపడ్డాయి మీ ఒంటిమీద అనేక చోట్ల."

"ఈ నొప్పి తగ్గడానికి ఎంతకాలం పడుతుంది?"

"పది రోజులు."

"నన్ను ఓ వ్యక్తి కారుకిందకి తోసినట్లు అనుమానంగా వుంది" చెప్పాను కొద్దిసేపాగి.



''మిమ్మల్ని తోసారా?'' అడిగాడు ఆశ్చర్యంగా.

''అవును. అనుమానం మాత్రమే.''

''మీ శత్రువా?''

''కాదు.''

''స్నేహితుడా?''

''కాదు.''

''మీ మరణం వల్ల అతనికి ప్రమోషన్, ఆస్తి, వాటా, ఇన్స్యూరెన్స్‌లాంటి వేమయినా వస్తాయా?''

''ఉహూ.''

''మరి కారణం?''

''తెలియదు.''

''అతని పేరు, ఎడ్రస్ తెలుసా?''

''తెలుసు.''

''పోలీస్ కంప్లెయింట్ ఇవ్వండి. ఇంకో గంటలో వస్తారు పోలీసులు.''

''అలాగే.''

డాక్టర్ వెళ్ళిపోగానే నర్స్ వచ్చింది మళ్ళీ. నామాటలు నచ్చినట్లున్నాయి ఆవిడకి.

''రెండు నెలలుండాలి. మీరు బెంగాలీ నేర్చుకుంటారా? నేను అరవం నేర్పనా?'' అడిగాను.

నవ్వింది బదులుగా.

గంటన్నర తర్వాత ట్రాఫిక్ ఎస్. ఐ. వచ్చాడు.

''ఎలా పడ్డారు కారు కింద? ఆ కారు డ్రయివ్ చేసే అతనికి ఓ సినిమా స్టూడియో వుంది. నష్టపరిహారం బాగానే ముడుతుంది'' చెప్పాడు.

''మంచిది. కాని నామీద హత్యాప్రయత్నం జరిగిందని అనుమానంగా వుంది'' చెప్పాను.

అదిరిపడ్డాడు.

''హత్యాప్రయత్నమా?'' అడిగాడు.

''అవును. జరగకూడదా?'' అడిగాను.

''ఎలా?''

శ్రీ వాత్సవని నేను గుర్తుపట్టి పలకరించిన విషయం హోటల్లో కాఫీ త్రాగిన తర్వాత బయటకి రావడం, నేను రోడ్డు దాటుతూండగా, యెవరో నా భుజం మీద చెయ్యి వేసి గట్టిగా రోడ్డు మధ్యకి తోయడం గురించి చెప్పాను.

''శ్రీవాత్సవ తప్ప చుట్టుప్రక్కల ఎవ్వరూ లేరు. అతను తప్ప మరింకెవరూ ఆ పని చేసివుండరు'' అన్నాను.

''మీ యిద్దరికీ విరోధం వుందా?'' అడిగాడు.

''లేదు. అతను నన్ను చంపే అవసరమే లేదసలు. అదే ఆశ్చర్యంగా వుంది. యెందుకు అలా తోసాడో?''

''మీ ఆలాపనేమో అది?''

''కాదు. నిజంగా నన్నెవరో తోసారు.''

శ్రీ వాత్సవ పనిచేసే బేంక్ పేరు, చిరునామా చెప్తే

రాసుకున్నాడు ఎస్. ఐ.

మద్రాసు బ్రాంచ్ మేనేజర్ వచ్చాడు పావుగంటతర్వాత.

నా ఆరోగ్యం గురించి అడిగి, నేను బ్రతకడం గొప్ప విచిత్రం అన్నాడు. అరగంటసేపు కూర్చుని వెళ్ళిపోయాడు. ఆ రాత్రి స్లీపింగ్ టేబ్లెట్ ఇచ్చారు నిద్రపోవడానికి.

నిద్రపోయేదాకా మాటిమాటికీ నాభుజంమీద యెవరో చేతినివేసి గట్టిగా తోస్తున్నట్లు అనిపించసాగింది.

* * *

మర్నాడు వుదయం నాకు ఆలస్యంగా మెలకువ వచ్చింది. నే లేచేసరికి కలకత్తా ఆఫీస్నుంచి మా ఆఫీస్ స్టాఫ్‌వారు నాకు జరిగిన ఏక్సిడెంటు గురించి సానుభూతి వ్యక్తపరుస్తూ, త్వరలో కోలుకోవాలని కాంక్షిస్తూ పంపిన టెలిగ్రాంని తీసుకు వచ్చాడు మద్రాస్ బ్రాంచ్ మేనేజర్.

డాక్టర్ నన్ను పరీక్షించి వెళ్ళాడు.

నా పక్క దగ్గర కూర్చుని ఇంగ్లీష్ నవల చదివేందుకు రోజుకి అయిదారు రూపాయలకి వప్పుకునే కుర్రాడినెవరినయినా కుదర్చమని కోరాను నర్స్‌ను. కాలం గడవటం యిబ్బందిగా వుంది. కాని లేవలేను. ఒళ్ళంతా సూదులు పొడిచినట్లుగా బాధ.

మధ్యాహ్నం వచ్చాడు ట్రాఫిక్ ఏస్.ఐ. విష్ చేసాడు.

"బ్రతికే వున్నాను. ఆ డ్రయివర్‌మీద కేసు బుక్‌చేయక్కర్లేదు" అన్నాను నవ్వి.

"మీకో అయిదువేల రూపాయలు లాభించింది" చెప్పాడు.

"అయితే ఓ రెండువేలు ముందర ఎడ్వాన్స్ ఇవ్వండి. వెయ్యి రూపాయల పుస్తకాలు కొనుక్కుంటాను" అని అన్నాను.

''శ్రీవాత్సవ గురించి మీరు చెప్పింది నిజమే.''

''నేను అబద్ధం చెప్తేగా అది అబద్ధం అవడానికి.''

''ఒప్పుకున్నాడు మీమీద హత్యా ప్రయత్నం చేసానని. ప్రస్తుతం మా కస్టడీలో వున్నాడు,''

''దేనికి నన్ను చంపాలనుకున్నది?'' ఆసక్తిగా అడిగాను.

''అతని గురించి మీరు యెవరికయినా చెప్తారనే భయంతో.''

''ఏమని? నాకు తన గురించి రహస్యాలేమీ చెప్పలేదే....?''

''మద్రాసులో లాయడ్స్ రోడ్‌లోని ఓ ఇంట్లో అతన్ని చూసారని కలకత్తా వెళ్లాక మీరు షాకి చెప్పచ్చుగా?''

''చెప్తే?''

''కలకత్తాలో అతను పని చేస్తున్న బేంక్‌లో నాలుగు లక్షలు దొంగతనం చేసాడు, అయిదారు చెక్కులు ఫోర్జరీనిచేసి. ఆ డబ్బుతో యెటో పారిపోయాడు. కలకత్తా పోలీసులు అతని కోసం వెదుకుతున్నారు. ఆ బేంక్‌వాళ్లు అతని ఆచూకీ తెల్పినవాళ్ళకి అయిదు వేలు బహుమతి కూడా ప్రకటించారు.''

''ఎప్పుడు జరిగిందిది?''

''మీకు ఎక్సిడెంట్ అవడానికి రెండు రోజుల ముందు. అతనికి వివాహం అయింది కాని భార్యతో పడటం లేదు. ఓ అయ్యంగారు అమ్మాయిని వివాహం చేసుకుని ఆమెతో ఇక్కడికి వచ్చాడు. కోయంబత్తూరు వెళ్ళి అక్కడ మారు పేరుతో ఏదయినా వ్యాపారం చేసుకునే ప్రయత్నాలు పూర్తి చేసుకుని వెళ్లబోతూండగా మీరు అతన్ని గుర్తు పట్టి పలకరించారు.

మీరు కలకత్తా వెళ్లాక అతను దోషి అని తెలుస్తుంది,

మీ ఆఫీసులో పని చేస్తున్న షా తమ్ముడి ద్వారా. అప్పుడు మీరు శ్రీవాత్సవ గురించి చెప్తారు. మద్రాస్ రాష్ట్ర పోలీసులు అతని కోసం వెదుకుతారు.

లాయడ్స్ రోడ్‌లో మీరు అతన్ని చూసిన ఇల్లు అతని మామగారిది. వాళ్ళకి తెలియదు శ్రీవాత్సవకి ఇదివరలో వివాహం అయిందనీ, ఫోర్జరీచేసి బేంక్‌లో డబ్బు కొట్టేసాడని. తెలుస్తే ఇబ్బంది. అందుకని అప్పటి కప్పుడు ఆలోచించుకుని మిమ్మల్ని కారు కిందకి నెట్టాడుట.''

గట్టిగా వూపిరి పీల్చి వదిలాను.

''మీరు ఈ స్టేట్‌మెంట్ మీద సంతకం పెట్టాలి, శ్రీవాత్సవ మిమ్మల్ని కారు కిందకి తోసినట్లుగా. అతన్ని కలకత్తా పంపిస్తున్నాం, ముందర అక్కడ న్యాయ విచారణకి.''

చదివి స్టేట్‌మెంట్ మీద సంతకం పెట్టాను వేళ్ళు ఆట్టే స్వాధీనంలో లేకపోయినా.

అతను వెళ్ళిపోయాడు అయిదు నిమిషాలాగి.

నర్స్ వచ్చింది అరగంట తర్వాత హడావిడిగా.

''ఏమిటి మీమీద హత్యా ప్రయత్నం జరిగిందా?'' అడిగింది ఆశ్చర్యంగా.

''నీతో మాట్లాడను'' అన్నాను నవ్వి.

''ఎందుకు?''

''కొత్తవాళ్ళని పలకరించను. మాట్లాడను. అలాచేస్తే హత్యాప్రయత్నం జరుగుతుందని తెలిసింది ఇప్పుడే.''

''నేను కొత్తదాన్నే అయినా మీమీద జరిగే ప్రయత్నం ఇంకోటుంది'' అని మనసులో అనుకుంటోంది అనుకున్నాను చిరునవ్వు నవ్వే నర్స్ కళ్ళని చూసి. నా పక్కన కూర్చుని ఆప్యాయంగా నా జుట్టు నిమరసాగింది. □

పైట కొంగున రక్తపు బొట్లు

ఎల్. రామ్‌గోపాల్

ఆదివారం. ఉదయం పదిగంటలయింది.

తన కన్సల్టింగ్ రూంలో కూర్చొని పాతకేసు తాలూకు పైల్సు తిరగేస్తున్నాడు డిటెక్టివ్ కిరీటి. 'ఎర్రరంగు' కేసు తర్వాత ఆరునెలలు విశ్రాంతి తీసుకోవడంతో ప్రస్తుతం కేసులేమీ లేకుండా పోయాయి. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కోలుకుంటున్నాడు.

తలుపు చప్పుడయింది.

"కమిన్!" అన్నాడు చూస్తున్న ఫైలుమూసి పక్కగా పెడుతూ.

పాతికేళ్ళుంటాయి అతనికి. ఎర్రగా, సన్నగా వున్నాడు. తెల్లటి టెరీన్ బట్టలు....చేతిలో పుస్తకాలు....విద్యార్థిలా వున్నాడు.

"నమస్కారం!" అన్నాడతను లోపలికి రాగానే.

కిరీటి ప్రతినమస్కారం చేసి, "కూర్చోండి!" అన్నాడు కుర్చీ చూపిస్తూ.

"నా పేరు చక్రవర్తి. బి. ఇ. ఫైనలియర్ చదువుతున్నాను" అన్నాడు కూర్చుంటూ.

కిరీటి తలవూపి సిగరెట్ వెల్గించాడు.

"నేను విద్యానగర్‌లో ఒక మేడమీద గదిలో వుంటు న్నాను. ఆ చుట్టుపక్కల ఇళ్లు పెద్దగా లేవు. నేనుంటున్న ఇల్లును ఆనుకొని శ్రీధరం, అతని భార్యా వుంటున్నారు. శ్రీధరం ఏదో కంపెనీలో క్లర్కుగా పని చేస్తున్నాడు" చెప్పటం ఆపి కిరీటి మొహంలోకి చూచాడు చక్రవర్తి.

"చెప్పండి"

చక్రవర్తి ఒక్క నిముషం మౌనంగా వుండి, "ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు" అన్నాడు నెమ్మదిగా.

"ఎలా చెప్పినా ఫర్వాలేదు. విపులంగా చెప్పండి" అన్నాడు కిరీటి.

చక్రవర్తి చిన్నగా నిట్టూర్చి చెప్పసాగాడు "శ్రీధరం భార్య 'పల్లవి' చాల అందగత్తె. పైగా 'ఆదర్శ' నైట్ క్లబ్‌లో సింగర్ కమ్ మిమిక్రీ ఆర్టిస్టుగా నెలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తుంది. వారానికి రెండు రోజులు క్లబ్‌లో ఆమె ప్రోగ్రాం వుంటుంది. ఆమె ప్రతిఒక్క ప్రోగ్రాంకు నేను తప్పనిసరిగా వెళుతుంటాను. ఒక సంద ర్భంలో మా యిద్దరికి పరిచయం అయింది. కాని అది అంతటితో ఆగిపోయింది. మీరేమైనా అనండి. ఆమె అంటే నాకు అభిమానం. ఆమె పాటలంటే ఇష్టం. అందుకే ఆమె కన్పించినప్పుడల్లా ఆమె ప్రతి కదలికా ఆప్యాయంగా చూస్తుంటాను."

చక్రవర్తి ఒక్క క్షణం ఆగి మళ్ళీ చెప్పసాగాడు.

"వాళ్ళ మేడమీద బెడ్‌రూం నా గది పక్కనే కావడం వల్ల తరచు వాళ్ళ మాటలు విన్పిస్తుండేవి. శ్రీధరంకు పెద్దగా జీతం రాదు. పైగా అంత బాగుండడు కూడా. కారణాలు ఏవి ఏమయినా తరచు వాళ్ళు పోట్లాడుకోవడం

నాకు విన్పిస్తుంది. అలాంటివి ప్రతిరోజు జరుగుతుంటాయి కనుక అంతగా పట్టించుకునేవాడిని కాదు. కాని, నిన్న ఒక విచిత్రం జరిగింది.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అనుకుంటాను. వరండాలో కూర్చుని చదువుకుంటున్నాను. ఉన్నట్లుండి ఎవరో మెట్లమీదనుంచి దొర్లిన శబ్దం అయి వెనక్కి తిరిగి చూశాను. పల్లవి మేడమీదనుంచి క్రిందకు దొర్లింది కాబోలు పెద్దగా అరుస్తూ పైకి వచ్చి లోపలికి వెళ్ళింది.

"ఏమిటి? ఏం జరిగింది?" ఆతృతగా అడిగాడు శ్రీధరం.

"ఏం జరిగిందా? నీకు తెలియదూ? నువ్వేకదూ నన్ను మెట్లమీదనుంచి క్రిందకు నెట్టింది? అదృష్టం బాగుండి బ్రతికిపోయాను. లేకపోతే నీ జీవానికి చచ్చి శవంలా మారేదానిని...." ఆవేశంగా అరుస్తుంది పల్లవి.

"పల్లవీ! ఏమిటా మాటలు? నేను నిన్ను క్రింద పడదోసానా? నేనసలు ఇక్కడ లేందే? బాత్‌రూంలో వున్నాను" చెబుతున్నాడతను.

"అంతా అబద్ధం! నన్ను క్రిందకు నెట్టి ఏమీ తెలియని వాడిలా బాత్‌రూం నుంచి వస్తున్నట్లు నాటకమాడుతున్నావ్! మీ ఎత్తేమిటో నాకు తెల్సు. నన్ను అడ్డు తొలగించుకుని, ఆ తర్వాత దాంతో కులకాలని కదూ మీ పన్నాగం! నేను చచ్చినాసరే మీ ఆటలు సాగనివ్వను. రేపే వెళ్ళి పోలీసు రిపోర్టిచ్చి వస్తాను...."

ఆమె మాటలు పూర్తికాకముందే కొట్టిన చప్పుడు విన్పించింది. ఆ తర్వాత చాలాసేపటివరకు పల్లవి తిడుతూ ఏడుస్తూనే వుంది.

ఆ మాటలు విన్నతర్వాత రాత్రంతా నాకు నిద్ర పట్ట

లేదు. మీకు చెప్పాగా, పల్లవి అంటే నాకు అభిమానం అని. ఆమెకు ఏదయినా ఆపద కలుగుతుందేమో అని, మీ దగ్గరకు వచ్చాను."

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" అడిగాడు కిరీటి.

"నాకేదో భయంగా వుంది. పల్లవి మాటల్నిబట్టి శ్రీధరానికి ఇంకో స్త్రీతో సంబంధం వున్నట్లు తెలుస్తుంది. ఆమెమీద వ్యామోహంతో పల్లవి అడ్డు తొలగించుకోవడానికి ఆమెను హత్య చెయ్యవచ్చు. అలా జరగడం నేను సహించలేను. ప్లీజ్! ఎలాగయినా ఆమెను కాపాడండి!" దీనంగా అడిగాడు చక్రవర్తి.

కిరీటి తల వూపి, "అలాగే! మీ ఇంటిపక్కనేగా శ్రీధరం ఇల్లు. మీ యింటి అడ్రసు ఇచ్చి వెళ్ళండి. నేను దర్యాప్తు చేస్తాను" అన్నాడు.

చక్రవర్తి అడ్రసు వ్రాసిచ్చి, "మీ దర్యాప్తులో సాధ్యమైనంతవరకు నాపేరు బయటకు రాకుండా చూడండి!" అన్నాడు.

తల వూపాడు కిరీటి.

2

టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకుని "హలో! డిటెక్టివ్ కిరీటి హియర్" అన్నాడు.

"కిరీటిగారా! నమస్కారం. నా పేరు పల్లవి. ఆదర్శ నైట్‌క్లబ్‌లో సింగర్‌ని. మీతో ఒక విషయం మాట్లాడాలి. మీరిప్పుడు తీరిగ్గా వుంటే వస్తాను" అంది అవతలి స్వరం.

కిరీటి ఉత్సాహంగా కుర్చీలో నిటారుగా కూర్చొని, "నేనిప్పుడు తీరికగానే వున్నాను. వెంటనే రండి" అన్నాడు.

"ఇప్పుడే బయలుదేరుతున్నాను. పదినిముషాలలో అక్కడుంటాను" పల్లవి రిసీవర్ పెట్టేసింది.

రిసీవర్ రెస్ట్‌చేసి పల్లవి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

పది నిముషాల తర్వాత తలుపుమీద చప్పుడయింది.

"కమిన్!" అన్నాడు.

ముప్పైఏళ్ళ స్త్రీ లోపలికి అడుగుపెట్టి, "నమస్కారం. నా పేరు పల్లవి!" అంది నెమ్మదిగా.

కిరీటి తల వూపి, "కూర్చోండి" అన్నాడు పరీక్షగా చూస్తూ.

తెల్లటి పాలరాతిలాంటి శరీరం. తెల్లటి చీర, జాకెట్టు ఆమెకు మరింత అందాన్నిచ్చాయి.

"మావారు నన్ను హత్య చెయ్యాలని చూస్తున్నారు! మీరే నన్ను రక్షించాలి" అంది ఉద్వేగంగా.

"వివరంగా చెప్పండి" అడిగాడు కిరీటి.

పల్లవి తన భర్తపేరు, ఉద్యోగం, తన ఉద్యోగం, గత రాత్రి జరిగిన సంఘటన అంతా వివరంగా చెప్పి "ఆయనకు ఇంకో స్త్రీతో సంబంధం వుంది. ఆ విషయం ఆయనే చెప్పారు. పైగా నన్ను విడాకులు ఇవ్వమని అడిగారు. నేను ఇవ్వనని ఖచ్చితంగా చెప్పాను. ఆ తర్వాతే, గతరాత్రి సంఘటన జరిగింది. దీన్నిబట్టి, ఆయనెలాగైనా నా అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారు. మీరెలాగైనా నన్ను రక్షించాలి" అంది.

"మీవారితో సంబంధం వున్న ఆమె పేరు మీకు తెలియదా?" అడిగాడు కిరీటి.

"తెలియదు! అసలు ఆమె ఎవ్వరోకూడా తెలియదు. తను ఇంకో పెళ్ళి చేసుకోదల్చుకున్నానని, విడాకులు ఇవ్వ

మని అడిగారు. అంతకుమించి నాకేం తెలియదు'' అంది.

"ఇప్పుడు మీవారు ఇంట్లోలేరా?'' అడిగాడు కిరీటి.

"లేరు. క్యాంప్‌కని ఉదయమే వెళ్లారు. రాత్రికి రావచ్చు. ఆ ఇంట్లో ఒంటరిగా వుండాలంటేనే భయం వేస్తుంది. ఏ అర్ధరాత్రి గొంతు పిసికి చంపుతారో అని భయంగా వుంది'' అంది భయపడుతూ.

"ఈ విషయంలో, మీరు పోలీసు రిపోర్టు ఇస్తే బాగుంటుంది. నాకంటె, వాళ్లు, మీకెక్కువ రక్షణ ఇవ్వగలరు?'' అన్నాడు కిరీటి.

"వద్దు. ఈ మధ్య పేపర్లో వార్తలు చదివింది మొదలు పోలీసుల సాయం అడగాలంటె భయంగా వుంది. అదీగాక, ఈ విషయం వారికి తెల్సిన మరుక్షణమే నన్ను చంపేస్తారు. ఇలాంటి విషయాల్లో, మీలాంటి డిటెక్టివ్‌లయితే నేర్పుగా ప్రవర్తించగలరు. అందుకే మీ సహాయంకోసం వచ్చాను'' అంది పల్లవి.

కిరీటి తల ఊపి, "ఆల్‌రైట్. మీవారు పనిచేస్తున్న ఆఫీసు అడ్రసు ఇచ్చి వెళ్ళండి! నేను దర్యాప్తు చేస్తాను''

పల్లవి అడ్రసు వ్రాసిచ్చి వెళ్ళిపోయింది.

3

పల్లవి వెళ్ళిపోయాక, ఆలోచిస్తూ కూర్చున్నాడు కిరీటి. కేసు స్వరూపం చాల లోప భూయిష్టంగా వున్నట్లనిపించింది.

సాయంత్రం అయింది.

టెలిఫోన్ డైరక్టరీ తిరగేసి, పల్లవి నెంబరు తెల్సుకొని, డయల్ చేసాడు.

"హల్లో! ఎవరు మాట్లాడేది?'' అవతలినుంచి పల్లవి స్వరం విన్పించింది.

"నేను కిరీటిని మాట్లాడుతున్నాను. మీవారింకా రాలేదా?" అడిగాడు.

"లేదు! బహుశా రాత్రికి రావచ్చు!" అంది పల్లవి.

"సరే! మీవారొచ్చాక, మీకేదయినా అవసరం అయితే నాకు టెలిఫోన్ చెయ్యండి!" అన్నాడు కిరీటి.

పల్లవి నవ్వి, "అలాగే! కాని అంత అవసరం వుంటుందనుకోను. నిన్న జరిగిన ఘర్షణకు ఇక రెండురోజులు నా జోలికి రాకపోవచ్చు. అయినా ఏదయినా అనుమానం వస్తే మీకు తప్పకుండా టెలిఫోన్ చేస్తాను" అంది.

కిరీటి ఊ కొట్టి టెలిఫోన్ పెట్టేశాడు.

మరుసటిరోజు ఉదయం పదిగంటలకల్లా "ఫైన్ ఆర్ట్ హాండీక్రాఫ్ట్స్" ముందు కారాపి క్రిందకు దిగాడు కిరీటి. అదే శ్రీధరం పనిచేస్తున్న ఆఫీసు.

విశాలమైన పెద్ద హాల్లో ఎవరో ఇద్దరు ముగ్గురు కుర్చీలో కూర్చొని పని చేసుకుంటున్నారు.

కిరీటి లోపలికి వెళ్ళి, ఒక మూలగా టైప్ చేస్తున్న యువతివైపుకు నడిచాడు.

"ఎవరు కావాలి?" టైప్ చెయ్యడం ఆపి అడిగిందా యువతి.

"శ్రీధరు కావాలి!" అన్నాడు.

ఆ యువతి చుట్టూ చూసి, "ఇంకా వచ్చినట్లు లేదు" అని, "అడుగో! ఆ వచ్చే అతనే శ్రీధరం!" అంది వీధి వైపు చూపిస్తూ.

కిరీటి అటువైపు చూచాడు.

సన్నగా పీలగా వున్నాడతను. మాసిపోయిన బట్టలు. కొద్దిగా పెరిగిన గడ్డం, గుంట కళ్ళు, నీరసంగా కన్పించాడు.

శ్రీధరాన్ని పలకరించాలని, మళ్ళీ ఆ ఆలోచన మాను కున్నాడు. శ్రీధరాన్ని పలకరించి ఏమని చెప్పాలి!

పల్లవి తన దగ్గరకు వచ్చిన విషయం అంతా చెబితే అతను మరికాస్త జాగ్రత్తపడొచ్చు. అందుకే ఆ ఆలోచన విరమించుకొని బయటకు వచ్చాడు. సాయంత్రం ఆఫీసు వదిలాక వస్తే శ్రీధరాన్ని వెంటాడి, అతను వివాహమాడ బోయే ఆ యువతి ఎవరో తెల్సుకోవచ్చు! అనుకున్నాడు.

సిగరెట్ వెల్గించి కారు స్టార్టుచేసాడు.

అంతలోపే శ్రీధరం మళ్ళీ బయటకు వస్తూ కన్పించాడు.

కిరీటి ఆశ్చర్యపోయాడు. శ్రీధరం అంతలోనే ఎందుకు వచ్చేస్తున్నాడు? తనను గుర్తించాడా? లేక సెలవుపెట్టి వచ్చేస్తున్నాడా? ఆలోచిస్తూ అతని వెనుకనే కారు నెమ్మ దిగా పోనివ్వసాగాడు.

శ్రీధరం నెమ్మదిగా పబ్లిక్ గార్డెన్స్‌లోకి వెళ్ళి, ఒక పెద్ద చెట్టుక్రింద, నీడలో కూర్చున్నాడు. అక్కడక్కడ ఒకరిద్దరు బిచ్చగాళ్ళు తప్పించి ఇంకెవ్వరూ లేరు. శ్రీధరం నేలమీద వాలుగా మోచేతిమీద పడుకొని, ఆలోచిస్తున్నాడు. అతని ముఖాన్నిబట్టి చాల తీవ్రంగా ఆలోచిస్తున్నాడని పించింది.

ఆ సమయంలో శ్రీధరం అక్కడికి ఎందుకు వచ్చాడో అర్థంకాలేదు కిరీటికి. ఒకవేళ తన ప్రియురాల్ని కలుసు కునేది ఇక్కడేనేమో! అదే నిజమైతే, ఆమె కొద్దిసేపట్లో రావాలి!

కిరీటి ఓపికగా కాచుకున్నాడు. నాల్గు గంటలయినా శ్రీధరం కదల్లేదు. అలాగే పడుకొని, సిగరెట్లు కాలుస్తూ ఆలోచిస్తుండిపోయాడు.

శ్రీధరం ప్రవర్తన అర్థం కాకపోయినా దాని వెనుక ఏదో అంతరార్థం వుంటుందనిపించింది కిరీటికి.

ఆరు గంటలకు శ్రీధరం బయలుదేరాడు. కొంతదూరం వెంటాడి, ఇక అతను ఇంటికే వెళతాడని నిశ్చయించుకొని, కారుని తన ఇంటివైపు తిప్పాడు.

4

రాత్రి పది గంటల ప్రాంతంలో టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకున్నాడు కిరీటి.

"కిరీటిగారూ! నేను పల్లవిని మాట్లాడుతున్నాను. ఆయన ఇప్పుడే వచ్చారు ఇంటికి. బాగా తాగినట్లున్నారు. నామీద చాల కోపంగా వున్నారు. నాకేదో భయంగా వుంది. మీరు వెంటనే బయలు...." మాటలు సగంలో ఆగిపోయాయి. "ఆ!" అన్న పల్లవి అరుపు విన్పించింది.

"ఎవరికే ఫోన్ చేస్తున్నావ్?" రిసీవర్ క్రిందపడింది కాబోలు, శ్రీధరం గొంతు చిన్నగా విన్పిస్తుంది.

కిరీటి ఇక వినలేదు. చకచక బైటకు వచ్చి కారు స్టార్టు చేసి ముందుకు దూకించాడు. పది నిముషాల్లో పల్లవి ఇంటి ముందు కారాపి క్రిందకు దిగాడు.

వీధి గేటు నెట్టుకొని లోపలికి నడిచాడు. ఇంటి తలుపులు వేసి వున్నాయి. లోపలనుంచి మాటలు బిగ్గరగా విన్పిస్తున్నాయి.

"ఎంత ధైర్యం నీకు? నామీద పోలీసు రిపోర్టు ఇస్తావా! నిన్నిప్పుడు ఎవరు రక్షిస్తారో చూస్తాను." శ్రీధరం గొంతు విన్పిస్తుంది.

"వద్దు! వద్దు! నన్ను చంపొద్దు...." అంతలోనే కెవ్వున కేక విన్పించింది.

"కిరీటి విసురుగా వెళ్ళి తలుపులు నెట్టాడు. తలుపులు

లోపలనుంచి వేసి వున్నాయి.

"పల్లవీ! పల్లవీ!" పెద్దగా పిలిచాడు.

చిన్న మూలుగుతోపాటు తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి అడుగుపెడుతూనే ఆశ్చర్యపోయాడు.

పల్లవి కడుపులో పిడివరకు దిగిన కత్తి. రక్తం ధారలుగా కారుతుంది క్రిందకు. పొట్ట చేత్తో పట్టుకొని క్రింద పడింది పల్లవి.

"ఆయనే....ఆయనే....ఇటు పారిపోయారు."

నీరసంగా అంది తలుపువైపు చూపిస్తూ. కిరీటి పరుగెత్తాడు అటువైపు అది పెరటివైపుదారి. పెరటి తలుపులు తీసివున్నాయి. శ్రీధరం పారిపోయాడు.

కిరీటి లోపలికి తిరిగివచ్చాడు. పల్లవి నేలమీద పడి గిలగిలా కొట్టుకుంటుంది.

కిరీటి టెలిఫోన్‌చేసి, అంబులెన్స్‌ను తీసుకురమ్మని, పోలీసు ఇన్‌స్పెక్టరుకు చెప్పాడు. ఈలోగా కత్తి పిడిమీద వేలిముద్రలు పోకుండా, రక్తస్రావం కాకుండా, ప్రథమ చికిత్స చేసాడు.

పదినిముషాల్లో పోలీసులతోపాటు అంబులెన్స్ కూడ వచ్చింది. వేలిముద్రల నిపుణుడు కత్తిమీద వేలిముద్రలు చూచాడు. లేవు. అందరూ కలిసి, అంబులెన్స్ వైపుకు మోసుకు వెళ్లారు పల్లవిని.

పల్లవి పమిటకొంగు చివర రక్తం బొట్లు బొట్లుగా కారుతుంది. పల్లవిని హాస్పిటల్‌కు పంపాక, జరిగిన విషయం అంతా ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు. తమ పనులన్నీ పూర్తయ్యాక, ఇన్‌స్పెక్టర్ తన బలగంతో శ్రీధరం కోసం బయలుదేరాడు.

అందరూ వెళ్లాక, లోపలికి నడిచాడు కిరీటి. చిన్న

గది. గదిలో ఒకమూల టేబిలు, కుర్చీ, ఉన్నాయి. టేబిలుమీద టేబిలు ల్యాంప్ పెన్‌స్టాండు. ఇతరత్రా వ్రాత పరికరాలు ఉన్నాయి. కుర్చీ దగ్గర సిగరెట్టు పీకలు గుట్టగా పడి ఉన్నాయి. గదిలో ఇంకోమూల పుస్తకాల ర్యాక్ ఉంది. అంతకుమించి ఆ గదిలో ఇంకేమీలేవు ఆ పక్క గది వంటగది.

నెమ్మదిగా మేడమీదకు వెళ్ళాడు. అది ఒక్కటే ఒక్క గది. అది బెడ్ రూంలా ఉంది. కిటికీలకు తెరలు కట్టి ఉన్నాయి. అక్కడనుంచి చక్రవర్తి ఉంటున్న మేడమీద బాల్కనీ స్పష్టంగా కన్పిస్తుంది. ఆ గదిలో కూడ అనుమానించ దగింది ఏమీ కన్పించలేదు. క్రిందకు దిగివచ్చాడు.

బయటవున్న సార్జెంటుకు తాళాలు వేసుకోమని చెప్పి, కారు హాస్పిటల్ వైపు నడిపాడు.

"సారీ. ఇప్పుడిప్పుడే ఏమీ చెప్పలేను. ఆపరేషన్ చెయ్యాలి!" అన్నాడు డాక్టరు.

కిరీటి తలవూపి, "ఆమెకు తెలివివస్తే నాకు ఫోన్ చెయ్యండి!" అన్నాడు బయటకు వస్తూ.

5

మరుసటిరోజు ఉదయాన్నే ఇన్‌స్పెక్టర్ ఫోన్‌చేసి చెప్పాడు శ్రీధరాన్ని అరెస్టు చేశానని.

కిరీటిని స్టేషన్‌కు వెళ్ళాడు.

"రాత్రి రెండుగంటల ప్రాంతంలో తన ఇంటిదగ్గరే తారట్లాడుతుండగా. సార్జంటు చూచి, ఫోన్‌చేసాడు. వెంటనే అరెస్టుచేసి తెచ్చాను!" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

కిరీటి తలవూపి, "ఏమంటున్నాడు!" అడిగాడు.

"తనే హత్య చెయ్యలేదంటున్నాడు. భార్య యిలా హాస్పిటల్లో ఉందని చెప్పినా, పెద్దగా చలించలేదు....

మౌనంగా ఉండిపోయాడు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేనొకసారి అతనితో మాట్లాడాలి!" అన్నాడు కిరీటి.

ఇన్‌స్పెక్టర్ తలవూపి, సార్జెంటును పిలిచి, కిరీటికి శ్రీధరం ఉన్న గది చూపించమని చెప్పాడు.

కిరీటిని చూడగానే ముఖం చిట్లించాడు శ్రీధరం.

కిరీటి తనను తాను పరిచయం చేసుకున్నాడు.

శ్రీధరం విరక్తిగా నవ్వి, "ఎవరైతేమాత్రం ఏం చేస్తారు? నేను చెప్పేదొకటే! నేనీ హత్య చెయ్యలేదు!" అన్నాడు.

"నాకు తెల్సు మీరీ హత్య చెయ్యలేదని. అసలు జరిగిందేమిటో చెప్పండి" అడిగాడు.

శ్రీధరం ఆశ్చర్యంగా చూచి, "మీ కెలా తెల్సు" అడిగాడు.

"అవన్నీ తరువాత చెబుతాను. ముందు మీ విషయం చెప్పండి!"

శ్రీధరం నిట్టూర్చి, "చెప్పడానికేముంది! నేను పల్లవిని ఎంతో ప్రేమించాను. నాది పెద్ద ఉద్యోగంకాదు. అందుకే కొద్ది రోజుల్లోనే నేనంటె పల్లవికి చులకన అయిపోయాను. తను నాకంటె ఎక్కువ సంపాదిస్తుందని నన్ను చాలా హీనంగా చూచేది. అయినా ఆమెమీద ప్రేమతో ఓర్చుకున్నాను. కాని ఇప్పుడా ప్రేమకూడా చచ్చిపోయింది" అన్నాడు నిరాశగా.

"ఏం జరిగింది?"

"ఏం జరిగిందో నాకు తెలియదు. ఆమెకు, పక్క మేడమీద ఉన్న చక్రవర్తికి సంబంధం ఏర్పడింది. ఒకటి రెండుసార్లు వాళ్ళిద్దరూ నవ్వుకోవడం చాటుగా గమనించాను. కాని ఇంతదూరం పోతుందని అనుకోలేదు.

వారంరోజుల క్రిందట పల్లవికి ఒక ఉత్తరం వచ్చింది. దాన్ని అనుకోకుండా చించేసాను. అది చక్రవర్తి వ్రాసిన ఉత్తరం. చాల అసభ్యంగా వ్రాసాడు. దాన్నిబట్టి వాళ్ళిద్దరికి చాలకాలంగా పరిచయం ఉందని, తనుగనుక విడాకులు తీసుకుంటే మళ్ళీ వివాహం చేసుకుంటానని వ్రాసాడు.

ఆ క్షణంనుంచి నాకు జీవితంమీద విరక్తి కల్గింది. అప్పటికి ఒకటి రెండుసార్లు, పల్లవి ప్రవర్తన తెల్సుకోవాలని, నేను వేరే వివాహం చేసుకోబోతున్నానని, విడాకులు కావాలని చెప్పాను. నన్ను నానా మాటలు అంది. ఆ తర్వాత ఆ విషయం ఎత్తలేదు. చక్రవర్తిని గురించి కూడ అడగలేదు. అతన్నిగురించి అడిగి, నన్ను నేను కించపరచుకోలేను. అందుకే మౌనంగా ఉండిపోయాను" అన్నాడు.

"ఒక్క విషయం! మీరు రాత్రంతా ఎక్కడున్నారు?" అడిగాడు కిరీటి.

"రాత్రి ఎనిమిది గంటలవరకు ఇంట్లోనే ఉన్నాను. ఆ తర్వాత నా భార్యతో చిన్న ఘర్షణపడి, వెళ్ళిపోయాను. ఎక్కడెక్కడో పిచ్చిగా తిరిగి, రెండు గంటలకు వచ్చాను. పోలీసులు అరెస్టుచేసారు" అన్నాడు శ్రీధరం.

కిరీటి నవ్వి బయటకువచ్చి, ఇనస్పెక్టర్‌తో మాట్లాడి, నేరుగా హాస్పిటల్‌కు వెళ్లాడు.

"ఆమె కెలావుంది?" అడిగాడు డాక్టర్‌ను.

"సారీ! చాల సీరియస్‌గావుంది. ఆపరేషన్ చేసినా ప్రయోజనం కన్పించటంలేదు. అప్పుడప్పుడు స్పృహ వచ్చి పోతుంది....ఇంకాసేపు చూచి, నేనే మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను!" చెప్పాడు డాక్టర్.

కిరీటి చక చక పల్లవి ఉన్న గదిలోకి వెళ్లాడు. గదిలో

ఉన్న నర్సును బైటకు వెళ్ళమని చెప్పి, పల్లవి తల దగ్గరగా కూర్చున్నాడు.

చాలసేపటి తర్వాత నెమ్మదిగా కళ్ళు తెరిచింది. కిరీటిని చూడగానే కళ్ళు పెద్దవిచేసి, "ఆయన దొరికాడా?" అడిగింది నీరసంగా.

కిరీటి తలవూపి, "రాత్రే పోలీసులు అరెస్టుచేసారు" అన్నాడు.

పల్లవి మాట్లాడలేదు. నిర్లిప్తంగా ఉండిపోయింది.

"కాని అతనికి శిక్షపడదు!" హఠాత్తుగా అన్నాడు. ఆశ్చర్యంగా చూచింది పల్లవి.

"అవును! అలా చూడండి" అన్నాడు ద్వారంవైపు చూపిస్తూ. పల్లవి అటువైపు చూసింది.

ద్వారం దగ్గర....శ్రీధరం నిశ్చలంగా, నిర్వేదంగా, విరాగిలా నిలబడి ఉన్నాడు. అతని మొహంలో దైన్యం ఎవ్వరినైనా ఇట్టే కరిగించేదిలా వుంది. అతని ప్రక్కనే ఇన్‌స్పెక్టర్.

"అలాగే చూస్తుండండి. అసలు విషయం చెబుతాను! చక్రవర్తి రాసిన ఒక ఉత్తరంవల్ల మీకు చక్రవర్తికి సంబంధం ఉందని అనుకొని, ఆ విషయం అడగలేక, తనకో పెళ్లి సృష్టించుకొని, మీరు విడాకులు కోరుకుంటారేమోనని, ఆ విషయం మీ దగ్గర ఎత్తాడు.

కాని మీరు మరోలా అర్థంచేసుకున్నారు. మీకు అన్యాయం చేస్తున్న అతనిపై కక్ష తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో, మీరే ఈ నాటకం ఆడారు. మీరు మిమిక్రీ ఆర్టిస్ట్ గనుక....మీరుగాక, మీవారుకూడ గదిలో ఉన్నట్లు అందర్నీ నమ్మించగలరు.

చివరకు మీరే నాకు ఫోన్ చేసి, మీవారు బెదిరిస్తున్నట్లే నటించి, నేను మీ ఇంటికి వచ్చేవరకు ఆగి, నా అడుగుల చప్పుడువిని, మీకై మీరే వేలిముద్రలు పడకుండా, పమిట కొంగు కత్తి పిడిమీద పట్టుకొని పొడుచుకున్నారు. ఆ నేరం మీవారిపై రుద్దాలనే ఉద్దేశ్యంతోనే, పెరటి తలుపులుతీసి ఉంచారు!

కానీ మీ పథకం పారలేదు. మీ పమిట కొంగుకు అంటిన రక్తం.... డ్రాయింగ్ రూంలో ఉన్న సిగరెట్ పీకలు మిమ్మల్ని పట్టించాయి. నిజానికి మీరు ఇద్దరూ తొందరపడ్డారు. ఒకరినొకరు విడచి ఉండలేని మీరు.... ఒకరినొకరు అర్థం చేసుకోకుండా అనవసరంగా బలై పోయారు. దీనంతకీ కారణం చక్రవర్తి మీకు వ్రాసిన ఆ ఉత్తరం. అర్థమైందా?...."

పల్లవి తల ఎత్తలేదు. కళ్లల్లోంచి నీళ్ళ ధారాపాతంగా కారుతున్నాయి. ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి.

శ్రీధరం విసురుగా వచ్చి మంచంమీద వాలిపోయాడు ....భార్య శవం మీద. □

ఏడ్వటానికి టైమేదీ ?

"పవన్! అలా క్రింద పడినంత మాత్రాన ఏడ్వకూడదురా. సైనికులకు తుపాకి గుళ్ళు తగిలితే ఏడుస్తారా?" అంది ఉష.

దానికి పవన్ ఏడుస్తూనే "సైనికులకు ఏడ్వటానికి టైమెక్కడుంటుంది? గుండు తగులగానే చస్తారు కదా!" అన్నాడు.

—చాగాపురం నాగేశ్వరరావు, మల్లకల్

కొత్త సీరియల్ ప్రారంభం!

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

హోటల్ మయూర్ మూడవ అంతస్తులోని రూం 124 కోలాహలంగా వుంది.

గదిలోంచి ఆవేశపూరితమైన అరుపులు, ఉద్వేగంతో కూడిన ధారాళమైన ప్రసంగాలు విన్పిస్తున్నాయి....

గదిలో సుమారు ఇరవైమంది విద్యార్థి నాయకులమధ్య కూచున్న, ప్రొఫెసర్ శంకర్ దయాళ్ శర్మ, సిగార్

కాలుస్తూ సాలోచనగా తలూపడం తప్ప ఏమీ చెయ్యలేని స్థితిలో వున్నాడు.

సుమారు గంటసేపటి నుంచి జరుగుతున్న సమావేశం ఒక కొలిక్కి రావడం లేదు. ఒకరి తర్వాత ఒకరు విరామం లేకుండా విద్యార్థులు తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చుతోంటే, మధ్యలో కల్గించుకోడానికి ప్రొఫెసర్‌కి అవకాశం చిక్కడం లేదు.

విద్యార్థులు తమ ప్రసంగాల్లో తమ సమస్యల్ని ఏకరువు పెడుతున్నారు తప్ప, ప్రొఫెసర్‌మీద ఆగ్రహం వెలిబుచ్చడం లేదు.

ప్రొఫెసర్ శర్మ విద్యార్థులతో చర్చలు జరపడంలో ఉద్దేశ్యం — విద్యార్థులు తలపెట్టబోయే ఉద్యమాన్ని మాన్పించడం.

దేశంలో సంభవిస్తున్న విషమ పరిణామాలు ప్రొఫెసర్ శర్మకి విపరీతమైన అశాంతిని, అసంతృప్తిని కల్గిస్తున్నాయి. రాజకీయాల్లో విద్యార్థుల జోక్యం అతనికి గర్హనీయంగా తోచింది. దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితులు అతనిలో ఆందోళనను రేకెత్తించాయి. ఇప్పటికి బీహారులో చెలరేగిన దహనకాండ చల్లారి రెండు నెలలు గడిచాయి.

నెలరోజుల ఆ దౌర్జన్యకాండలో ప్రాణనష్టం, ఆస్తినష్టం అపారంగా సంభవించాయి. గొడవున్‌లు, షాపులు, ఇళ్ళు దోచుకోబడ్డాయి. రైల్వేస్టేషన్‌లు, ఇళ్ళు, బస్సులు, పోలీస్‌స్టేషన్‌లు తగలబెట్టబడ్డాయి. ప్రభుత్వ భవనాలు కూలగొట్టబడ్డాయి. ఈ అలజడుల్లో కత్తులు, పిస్తోళ్ళు, నాటు బాంబులు విచ్చలవిడిగా ఉపయోగించబడ్డాయి....

అయితే, ఇప్పుడు — హైద్రాబాదులో విద్యార్థులు ఆందోళన ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు

ప్రొఫెసర్ శర్మకి సమాచారం అందింది. బీహార్ సంఘటనలు గనుక హైద్రాబాదులో జరిగితే దేశం ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం తప్పదని అతను ప్రభుత్వానికి హెచ్చరిక చేశాడు.

రానున్న ప్రమాదాన్ని తప్పించడానికి అతను స్వయంగా ఢిల్లీ నుంచి బయలుదేరి హైద్రాబాదుకి వచ్చాడు. ఇక్కడ విద్యార్థి నాయకులతో చర్చలు జరిపి, విద్యార్థిలోకంలో శాంతి సహృద్భావాలు నెలకొల్పాలని అతని ఆశ!

అతను బసచేసిన హోటల్ గదిలోనే విద్యార్థి నాయకుల్ని ఆహ్వానించి, చర్చలు ప్రారంభించాడు.

చర్చల్లో విద్యార్థులు ఆవేశంగా పాల్గొన్నారు:

విద్యార్థుల్లో అరాజకత్వం మేరమీరడానికి రాజకీయ నాయకత్వం బాధ్యత ఎంతో వుంది. ఒకనాడు విద్యార్థులు సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా అభ్యుదయ ఉద్యమాల్లో పాల్గొనేవారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు చక్కటి, ఆరోగ్యకరమైన రాజకీయ భావాలతో, సాహితీ, కళాసౌరభాలతో సంస్కృతీ కేంద్రాలుగా వుండేవి. జాతీయోద్యమంలో, అభ్యుదయ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటూ, భావి సమాజనేతలుగా, దేశాన్ని, ప్రగతి పథంలో నడిపించే అగ్రగాములుగా తయారయ్యేవాళ్ళు.

కాని, ఈ మంచి లక్షణాలు క్రమంగా తరిగిపోతూ, రాజకీయాల స్థానంలో ముఠారాజకీయాలు, కుల, మత, ప్రాంతీయ తత్వాలు, భాషా వైషమ్యాలు విద్యార్థుల్ని ఆవహిస్తున్నాయి. క్రమశిక్షణా రాహిత్యం, హింసా ప్రవృత్తి, అరాజకత్వం విద్యారంగంలో విలయతాండవం చేస్తున్నాయి.

వీటన్నిటికీ కారణమేమిటి?

గడచిన కొన్ని సంవత్సరాల్లో రాజకీయ వేత్తలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం విద్యార్థుల్లో మతారాజకీయాల్ని, కుల, ప్రాంతీయ దురభిమానాల్ని పని గట్టుకుని దెబ్బ గొట్టారు. హింసా, దౌర్జన్య కాండల్లోకి ఈ నాయకులే దించారు. విద్యార్థుల్లో హింసా, దౌర్జన్యాలకు దిగేవాళ్ళ సంఖ్య చాలా తక్కువగానే వుంటుంది. అత్యధిక సంఖ్యాకుల పైన ఈ అల్ప సంఖ్యాకుల ప్రభావం అంతగా వుండదు.

ఇక—విద్యార్థుల్లో అశాంతికీ, అసహనానికీ కొన్ని సబబయిన కారణాలున్నాయి: గడచిన మూడు దశాబ్దాల స్వరాజ్యంలో సాధించిన 'ప్రగతి' లో నిరుద్యోగుల సంఖ్య అద్భుత ప్రగతిని సాధించింది. అందువల్ల భవిష్యత్తుపట్ల విద్యార్థుల్లో భయాందోళనలున్నాయి. విద్యాసంస్థల్లో అసమర్థ పాలన, అక్రమ వ్యవహారాలు అగ్నికి ఆజ్యంలా వాటికి జత అవుతున్నాయి.

ఆ తర్వాత—విద్యార్థి దశ ముగిసి ఉద్యోగాన్వేషణలో బయలుదేరిన యువకులకి అడుగడుగునా నిరాశా నిస్పృహలే ఎదురవుతున్నాయి.

ఇలా సాగిన విద్యార్థుల ప్రసంగాలు ప్రొఫెసర్‌లో ఆలోచనల్ని రేకెత్తించాయి. చివరికి, విద్యార్థులు తమ ఉపన్యాసాలు ముగించి ప్రొఫెసర్ సమాధానం కోసం ఎదురు చూశారు.

ప్రొఫెసర్ భారంగా నిట్టూర్చి కళ్ళద్దాలు తుడుచుకున్నాడు. విద్యార్థుల్ని నవ్వుతూ చూసి సిగార్ వెలిగించాడు:

"అయితే మీ కోరికలు తీర్చుకోడానికి, ఆశయాలు నెరవేర్చుకోడానికీ హింస ఒక్కటే మార్గమా? ప్రజల ఆస్తికి నష్టం కలిగిస్తే మీ సమస్యలన్నీ పరిష్కరింపబడతాయా?"

"కాదు, ప్రొఫెసర్! మేం హింసాయుత ధోరణిని ఎప్పుడో విడనాడాం. హింస మాకు అన్నం పెట్టదు. మాలో ఎన్నో ఆశలు రేకెత్తించి, తమ స్వలాభంకోసం మాలో హింసా ప్రవృత్తిని రెచ్చగొట్టి—ఫలితంగా తమ ఆశయం సాధించుకుని, మమ్మల్ని మోసంచేసే రాజకీయ నాయకుల నుంచి మంచి గుణపాఠం నేర్చుకున్నాం. మా వ్యవహారాల్లో రాజకీయ పక్షాల జోక్యం లేనంతవరకు హింసకు తావులేదు. మా ఆందోళనలో ఎలాటి రాజకీయ పక్షం జోక్యం చేసుకోడానికి అనుమతించం — తిప్పి కొడతాం."

"వెరీగుడ్! మీరు ఈ నిర్ణయానికి కట్టుబడి వుంటే— మీ ఉద్యమం ప్రశాంతకరంగా సాగుతుందని భావించ వచ్చా?"

"మా ఉద్యమం ప్రశాంత వాతావరణంలో సాగుతుంది. దౌర్జన్యకాండకు దారితీయదు. ఎలాటి హింసాపూర్వకమైన సంఘటనలు జరుగవు. పికెటింగ్, ఘెరావ్, బాయ్‌కాట్.. ఇవే మా ఉద్యమంలోని ప్రధానాంశాలు. వీటినిమించి మేం ఎలాటి దురాక్రమణలకి పాల్పడమని హామీ ఇస్తున్నాం."

"అయితే మీ ఉద్యమానికి నా సహకారం వుంటుంది" అన్నాడు ప్రొఫెసర్.

విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. చప్పట్లు కొట్టి ప్రొఫెసర్ని అభినందించారు. సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకి సమావేశం ముగిసింది. ఇరువర్గాల వారికీ ఈ సమావేశంలో చేసుకున్న తీర్మానం సంతృప్తి గల్గించింది.

విద్యార్థులంతా నిష్క్రమించాక ప్రొఫెసర్ భారంగా నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాడు.

2

ఈవినింగ్ ఎడిషన్ దినపత్రిక టేబిల్‌మీద పడివుంది. దాన్ని ప్రొఫెసర్ ఇంకా చూడలేదు. పత్రిక చర్చ జరుగుతున్నప్పుడు వచ్చి వుంటుంది. అది అతను గమనించలేదు.

విద్యార్థులు నిష్క్రమించి అయిదు నిమిషాలైంది.

ప్రొఫెసర్ నెమ్మదిగా కళ్ళు తెరిచి తృప్తిగా నవ్వుకున్నాడు. ఆ తర్వాత టేబిల్‌మీద పత్రిక చూశాడు. దాన్ని అందుకుని కళ్ళద్దాలు సవరించుకుని మడత విప్పాడు.

అప్రయత్నంగా అతని దృష్టి పేజీ కిందిభాగంలో పడింది.

కళ్లు చిట్లించి తేరిపార చూశాడు.

అక్కడ ఒక పిన్ను గుచ్చివున్నట్లు కన్పిస్తోంది. దాన్ని పరీక్షగా చూశాడు. అది పేజీ వెనకవేపు నుంచి గుచ్చి వుంది. గాభరాగా పేజీ తిప్పాడు. కింది భాగంలో పిన్ చేసివున్న తెల్లకాయితం కన్పించింది.

ప్రొఫెసర్ ఆ కాయితంమీది అక్షరాల్ని కంగారుగా చదివాడు:

"ప్రొఫెసర్‌గారూ!

మీరు క్షేమంగా వుండదలుచుకున్నారా? అయితే వెంటనే తిరిగి ఢిల్లీ వెళ్ళిపొండి.

మీ మూఢ విశ్వాసాల ఉపన్యాసాలతో మా ఉద్యమానికి ఆటంకాలు కల్గిస్తున్నారు. మీ ఉపన్యాసాలు వినే అవసరం మాకు లేదు. ఈ రాత్రి ఎనిమిది గంటలకల్లా తిరిగి వెళ్ళకపోతే, సరిగ్గా పదకొండు గంటల రెండు నిమిషాలకి హత్య జరుగుతుంది.

అర్థమైందా? రెండక్షరాల పదం: హత్య!"

ఈ ఉత్తరం కింద సంతకం లేదు. అక్షరాలు ఆకర్షణీయంగా వున్నాయి. దస్తూరీనిబట్టి అది వ్రాసింది స్త్రీయో,

పురుషుడో తెలుసుకోడం కష్టం.

ఈ ఉత్తరం ఎవరు వ్రాశారు? తనకు శత్రువు లెవరున్నారు? విద్యార్థులు మాత్రంకాదు. వాళ్ళతో చర్చలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

పరస్పర అభిప్రాయాలు అంగీకరించబడ్డాయి. ఎలాటి వాగ్వివాదాలూ జరగలేదు. వాళ్లు తనమీద ఆగ్రహం వెలిబుచ్చలేదు. మరి ఈ ఉత్తరంలో తమ ఉద్యమానికి తాను ఆటంకం కల్గిస్తున్నట్టు వ్రాసివుంది. ఎంత నిరాధారమైన ఆరోపణ! కచ్చితంగా ఇది విద్యార్థులు వ్రాసిన ఉత్తరం కాదు.

ఎవరో తమాషాకోసం వ్రాశారు.

కానీ—ఈ ఉత్తరంలో హెచ్చరికకూడ వుంది!

ప్రొఫెసర్ ఆందోళనగా లేచి బజర్ నొక్కాడు. కొన్ని నిమిషాలయ్యాక బేరర్ వచ్చాడు—సాయంత్రం గదిలో పత్రిక వదిలింది అతనే.

"యస్ సర్?" బేరర్ అన్నాడు వినయంగా.

"ఈ పత్రిక నువ్వెక్కడనుంచి తెచ్చావు?" అడిగాడు ప్రొఫెసర్.

"కౌంటర్‌నుంచి. గదుల్లో సప్లై చెయ్యడానికి పత్రికలు కౌంటర్‌లో పెడతారు. ప్రతి పత్రికమీద గది నెంబర్ వుంటుంది—మీరు పత్రిక పైభాగం సరిగా చూడలేదనుకుంటాను."

నిజంగానే ప్రొఫెసర్ ఆ నెంబర్ చూడలేదు. పేపరందుకున్న మరుక్షణం అతని చూపు కింద పిన్నుమీద పడింది. పైభాగంలో అతని గది నెం 124 వ్రాసి వుంది.

"పేపర్లో ఈ ఉత్తరం ఎవరు పెట్టారు!"

"నాకు తెలియదు సార్. పేపర్లో ఆ ఉత్తరం నేను

చూడలేదు.''

''పత్రికలమీద రూం నెంబర్లు ఎవరు వ్రాస్తారు?''

''మిస్. జూలీ. ఆమె కౌంటర్ నెంబర్ ఫోర్‌కి ఇన్ ఛార్జ్. కౌంటర్ నెంబర్ ఫోర్ మొదటి అంతస్తులో వుంది.''

బేరర్ వెళ్ళిపోయాక ప్రొఫెసర్ గది బయటకు వచ్చి తాళం వేశాడు. ఆ తర్వాత మొదటి అంతస్తులోని కౌంటర్ నెంబర్ ఫోర్ చేరుకున్నాడు. మినీ స్కర్ట్‌లో వున్న మిస్ జూలీ తల అటు తిప్పి కూచొని వుంది. ఆమె విశాలమైన వీపుభాగం ప్రొఫెసర్‌కి కన్పిస్తోంది.

కొన్ని క్షణాలయ్యాక ఆమె ఇటు తిరిగి, చిరునవ్వు విసిరి, ''యస్ ప్లీజ్?'' అంది.

''మిస్ జూలీ, నేను ప్రొఫెసర్ వర్మని. రూం నెం 124 లో వుంటున్నాను. ఈ సాయంత్రం మీరు పంపిన పేపర్లో ఒక ఉత్తరం పిన్‌చేసి వుంది. ఆ ఉత్తరం యెవరు పెట్టారో మీరు చెప్పగలరా?'' అడిగాడు ప్రొఫెసర్.

''మీ పేపర్లో ఉత్తరం పిన్ చేసివుందా!'' ఆశ్చర్యంగా అంది జూలీ, ''ప్రొఫెసర్-నేను-నాకేమీ తెలీదు! పేపర్స్ రాగానే వాటిమీద నెంబర్స్‌వేసి ఆ ట్రేలో పెట్టేస్తాను. చాలా మందికస్టమర్స్ స్వయంగా వచ్చి తీసుకెళతారు. మీ పేపర్లో లెటర్ యెవరు పిన్ చేశారో చెప్పడం కష్టం.''

ప్రొఫెసర్ మౌనంగా అక్కడనుంచి వెనుదిరిగాడు. లిఫ్టులో పైకి వెళుతూ రిస్టువాచీ చూసుకున్నాడు: ఆరు గంటల ఇరవై నిముషాలు.

తిరిగి తన గది చేరుకుని ఆ వుత్తరం యెవరో తమాషా చెయ్యడానికి వ్రాసివుంటారని దాని విషయం మర్చిపోయాడు. ఈ పరాయిచోట తనకి శత్రువు లేవ

రున్నారు?

నవ్వుకుని టేబిల్ ముందు కూచొని భార్యకి ఉత్తరం వ్రాశాడు: తాను క్షేమంగా హైద్రాబాదు చేరుకున్నట్టు, ఇక్కడి పరిస్థితి సంతృప్తికరంగా వున్నట్టు, ఇంకా కొందరితో చర్చలు జరిపి త్వరలో తిరిగి వస్తున్నట్టు.

ఆ తర్వాత పత్రిక చదవ నారంభించాడు. చదవడం పూర్తయేసరికి సమయం చాలా గడిచిపోయింది: ఎనిమిది గంటల రెండు నిమిషాలు.

తేరుకుని బజర్ నొక్కాడు.

కొన్ని నిమిషాల్లో అదే బేరర్ వచ్చి. ''యస్ సర్?'' అన్నాడు.

''ఇరవై నిమిషాల తర్వాత నా భోజనం తీసుకరా!'' అన్నాడు ప్రొఫెసర్.

''అలాగే సర్.''

బేరర్ తిరిగి వెళ్ళిపోయాక ప్రొఫెసర్ తన బ్యాగు లోంచి విస్కీ బాటిల్, గ్లాసు తీశాడు. బాత్‌రూంనుంచి జగ్గులో నీళ్లు తెచ్చుకుని కూచున్నాడు. సిగార్ వెలిగించి, గ్లాసులో ఓ పెగ్గు విస్కీ వొలికించి నీళ్లు కలిపాడు. ప్రతి రాత్రీ భోజనానికి ముందు అతను రెండు పెగ్గుల విస్కీ సేవిస్తాడు.

ఇరవై నిమిషాల్లో రెండు పెగ్గులు సేవించి, బాటిల్ బ్యాగులో పెట్టి గ్లాసు కడిగాడు.

ఇంతలో బేరర్ భోజనంతో వచ్చాడు. ప్రొఫెసర్ అతనికి భార్యకి వ్రాసిన ఉత్తరం అందించి పోస్ట్ చెయ్యమని చెప్పాడు.

ఆ తర్వాత భోజనానికి కూర్చున్నాడు. భోజనం పూర్తి చేసి మళ్లీ బజర్ నొక్కాడు. బేరర్ వచ్చాడు. ప్రొఫెసర్

కాఫీ ఆర్డరిచ్చాడు. బేరర్ వెళ్లిపోయాక టైం చూసుకు న్నాడు. తొమ్మిది గంటల యాభై రెండు నిముషాలు.

గోడ గడియారం శబ్దం తప్ప అంతటా నిశ్శబ్దం.

ప్రొఫెసర్ తను ఇటీవల వ్రాసిన పుస్తకం తీసి చూడ సాగాడు:—

"Indian Students; Before and after independence"—చాలాసేపు ఆ పుస్తకంలో నిమగ్నమై పోయాడు.

కొంతసేపటికి అతనికి నిద్ర ముంచుకురాసాగింది. పుస్తకం మూసి ఉలికిపడ్డాడు. అతని దృష్టి గోడగడియారం మీద పడింది: పది గంటల నలభై ఆరు నిమిషాలు.

పదకొండు గంటల రెండు నిమిషాలు కావడానికి పద హారు నిమిషాలున్నాయి—

ప్రొఫెసర్ తలుపువేపు చూశాడు. లోపలినుంచి గడియ పెట్టి వుంది. కిటికీకూడా మూసి వుంది. ప్రొఫెసర్‌కి ధైర్య సాహసా లెక్కువ—అయినా అతని ముఖం చెమట పట్టింది. ఉత్తరంలో ఒక వాక్యం ఆయనకి మాటిమాటికీ జ్ఞాపకం వస్తోంది:

....సరిగ్గా పదకొండు గంటల రెండు నిమిషాలకి హత్య జరుగుతుంది.

స్వాభావికంగా అతని మస్తిష్కంలో ఒక ప్రశ్న మెదిలింది.

ఎవరి హత్య జరుగుతుంది? తనదేనా?

ప్రొఫెసర్ ఇప్పుడు విపరీతంగా వణకసాగాడు.

ప్రొఫెసర్ శర్మకి యాభై రెండేళ్లు. జీవితంలో కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి. 36 ఏళ్ళు వచ్చేవరకు అతను పెళ్ళి చేసుకోలేదు. ఆశించిన స్థాయికి చేరుకుని చేసుకోవాలని

తీర్మానించుకున్నాడు. పదహారేళ్ళ క్రితం ఇరవై ఎనిమిదేళ్ళ యువతితో పెళ్ళి జరిగింది. ఇప్పుడతనికి పధ్నాలుగేళ్ళ కుమారుడు, పదేళ్ళ కుమార్తె వున్నారు.

ప్రొఫెసర్ కళ్ళు మళ్ళీ గడియారంమీద పడ్డాయి. ఇప్పుడు కేవలం నాలుగు నిమిషాలే మిగిలి వున్నాయి. తన హత్య జరగడమేమిటి, తమాషా కాకపోతే?—నవ్వుకున్నాడతను.

నిర్లక్ష్యంగా తల యెగరేసి మళ్ళీ బజర్ నొక్కాడు. గబ గబ వెళ్ళి తలుపు తీశాడు. నిముషం గడిచాక బేరర్ వచ్చాడు.

"యస్ సర్?" ఈసారి విసుగ్గా అన్నాడు బేరర్.

ప్రొఫెసర్ గడియారాన్ని చూపిస్తూ అన్నాడు: "సరిగ్గా పదకొండు గంటల నాలుగు నిమిషాలకి కాఫీ తేవాలి, అర్థమైందా?"

బేరర్ తలవూపి వెళ్ళిపోయాడు.

ప్రొఫెసర్ గడియారం ముందు నిల్చుని పెద్ద ముల్లుని తదేకంగా చూడసాగాడు. ఇప్పుడు సమయం సరిగ్గా పదకొండు గంటలు.

చక చక సెకన్లు గడిచిపోతున్నాయి. ఒకటి....రెండు ....మూడు....అరవై—ఒక నిమిషం. ఒకటి....రెండు ....నలభై ....యాభై ....అరవై—రెండు నిమిషాలు.

పదకొండు గంటల రెండు నిమిషాలు....అంతే!

ప్రొఫెసర్ గుండె పట్టుకుని గట్టిగా మూల్గాడు. కళ్ళు తేలవేసి కింద పడిపోయాడు. కింద—కార్పెట్ మీద అతని గుండెలోంచి రక్తం ధారగా ప్రవహిస్తోంది....

ప్రొఫెసర్ చెప్పిన సమయానికి—సరిగ్గా పదకొండు గంటల నాలుగు నిమిషాలకి—బేరర్ వచ్చి గోడ గడియా

రాన్ని చూశాడు. ఆ తర్వాత నేలమీద బోర్లా పడివున్న ప్రొఫెసర్ని చూసి గావు కేకపెట్టి, ట్రే జార విడిచేసి బయటికి పరిగెత్తాడు.

హఠాత్తుగా మూడవ అంతస్తులో అలజడి చెలరేగింది.

3

క్రైం ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్ శవం దగ్గరినుంచి లేస్తూ అన్నాడు:

"ప్రాణం పోయింది. చావు సంభవించి పావుగంట గడిచింది. గుండెలో బుల్లెట్ గాయమైంది. బుల్లెట్ రంధ్రాన్నిబట్టి చూస్తే హంతకుడు సుమారు ఆరడుగుల దూరంనుంచి షూట్‌చేసి వుండవచ్చు. రివాల్వర్ శబ్దం యెవరూ వినివుండక పోవచ్చు. రివాల్వర్‌కి సైలెన్సర్ అమర్చివుంటే హతుడు కూడా వినలేడు!"

హోటల్ మేనేజర్ గాభరాగా చూశాడు. ఈ హత్య గురించి అతనికి చాలా భయంగా వుంది. ఎందుకంటే— సుప్రసిద్ధ ఆర్థికవేత్త ప్రొఫెసర్ శంకర్‌దయాళ్‌శర్మ హత్య దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వం సి.బి.ఐ.ని రంగంలోకి దించినా ఆశ్చర్యంలేదు.

అందువల్ల మేనేజర్ వెంటనే ఇద్దరు రాష్ట్ర మంత్రులకి ఫోన్‌చేసి ప్రొఫెసర్ మర్డర్‌గురించి చెప్పాడు. తమకు విశ్రాంతి భంగం కలిగినా వెంటనే బయలుదేరి హోటల్‌కి చేరుకున్నారు మంత్రులు.

"హంతకుడు యెక్కడనుంచి వచ్చాడు? కిటికీ లోపలి నుంచి మూసివుంది కదా?" అడిగాడు మేనేజర్.

కృష్ణన్ బేరర్‌వేపు తిరిగాడు, "నువ్వేం చూశావు? కాఫీ తీసుకవచ్చినప్పుడు తలుపు తెరిచివుందా?"

"అవును. కాఫీ ఆర్డరిచ్చినప్పుడు ప్రొఫెసర్ తెరిచాడు."

"కాఫీ యెప్పుడు తెమ్మన్నాడు ప్రొఫెసర్?"

"పదీయాభై తొమ్మిదికి నేనిక్కడికి వచ్చాను—అప్పుడాయన గడియారం చూపిస్తూ చెప్పాడు—పదకొండు గంటల నాలుగు నిమిషాలకి కాఫీ తెమ్మని."

"అప్పుడాయన ఆందోళనగా కన్పించాడా?"

"లేదు."

"హంతకుడు పదిగంటల యాభై తొమ్మిది నిమిషాల నుంచి పదకొండు గంటల నాలుగు నిమిషాల మధ్య గదిలో ప్రవేశించాడు. ఈ తలుపుగుండా వచ్చి షూట్ చేశాడు" లెక్కవేసి చెప్పాడు హోంమంత్రి.

"లేదండీ! హంతకుడు ఈ తలుపుగుండా వచ్చి, ఇదే తలుపుగుండా వెళ్ళే అవకాశంలేదు. కారిడార్ యెప్పుడూ రద్దీగా వుంటుంది. అంతేగాక కారిడార్ చివర్లో యెవరో ఒక బేరర్ కుర్చీలో కూచొని వుంటాడు" అన్నాడు బేరర్.

పోలీస్ స్టాఫ్ లోనికి వచ్చింది.

కృష్ణన్ శవాన్ని తదేకంగా చూడసాగాడు.

బేరర్ బుర్ర గోక్కుని మళ్ళీ అన్నాడు: "సర్, ఇందాక ప్రొఫెసర్ కంగారుగా కన్పించారా అని అడిగారు మీరు. కాఫీ ఆర్డరిచ్చినప్పుడు గానీ, భోజనం కోసం పిలిచినప్పుడు గానీ ఆయన గాభరాగా ఏమీలేదు. కానీ సాయంత్రం స్టూడెంట్స్ వెళ్ళిపోయాక ఆయన చాలా ఆందోళనగా కన్పించారు. నేను ఆయనకోసం సాయంత్రం పేపర్ తెచ్చాను. అందులో ఏదో కాయితం గుచ్చివున్నట్టు ఆయన చెప్పారు. నాకు తెలీదన్నాను—ఆయన మిస్

జూలీతో మాట్లాడినట్టున్నారు...."

"కాయితమా? ఏం కాయితం?" కృష్ణన్ అడిగాడు వెంటనే.

ఆ తర్వాత గదిలో గాలింపు ప్రారంభించాడు. ఆ కాయితం సులభంగానే దొరికింది—టేబిల్ మీద.

"ఈ కాయితం కేసుని పరిష్కరిస్తుంది!" నమ్మకంగా అన్నాడు విద్యామంత్రి.

కృష్ణన్ కాయితం చదివి అందరికీ విన్పించాడు.

అందరి ముఖాల్లోనూ రంగులు మారాయి.

బేరర్ బుర్రలో మళ్ళీ ఏదో మెరిసింది, "సర్—ఇందాక ప్రొఫెసర్ ఒక వుత్తరం పోస్టు చెయ్యమని ఇచ్చారు."

"అడ్రసు చూశావా? ఎక్కడికి?" కృష్ణన్ అడిగాడు.

"ఢిల్లీకి."

"నాకేమీ అర్థంగావడంలేదు!" ఆందోళనగా అన్నాడు హోంమంత్రి. "ప్రొఫెసర్‌కి శత్రువు లెవరున్నారు? విద్యార్థులు ఆయన్ని ప్రేమిస్తారు. ఈ హత్య యెవరేనా విద్యార్థి చేశాడంటే అది నమ్మ శక్యంగాని విషయం. కృష్ణన్—మీరు త్వరగా హంతకుణ్ని పట్టుకోండి!"

4

మర్నాడు వుదయం పత్రికలన్నీ ప్రొఫెసర్ హత్య వార్త ప్రచురించాయి, అతని సంక్షిప్త జీవిత చరిత్రతో సహా.

సుప్రసిద్ధ ఆర్థికవేత్త హత్య దేశానికి చాలా నష్టం కల్గిస్తుందని విచారం వెలిబుచ్చి, ఈ హత్య వెనక విద్యా

ర్థుల హస్తముందని పరోక్షంగా అభిప్రాయాలు వెల్లడించాయి.

ఈ వార్త జంట నగరాల్లో సంచలనం కల్గించింది. నెమ్మదిగా దేశమంతటా ప్రాకిపోయింది.

ప్రొఫెసర్ హంతకుడ్ని, సాధ్యమైనంత త్వరలో పట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

హైద్రాబాదులోని యూనివర్సిటీ, కాలేజీలు, స్కూళ్లు అన్నీ మూసివేయబడ్డాయి. సంతాప సభలు జరిగాయి. నగరంలోని 'విద్యార్థి సంఘర్షణ సమితి' కార్యాలయంలో విద్యార్థినాయకులు, విద్యార్థులు సమావేశమయ్యారు.

సమితి యాక్షన్ కమిటీ సెక్రటరీ శీతల్‌ప్రసాద్ ప్రసంగిస్తూ అన్నాడు:—

"ప్రొఫెసర్ దయాళ్ హత్య మన ఆందోళనమీద తప్పుడు అభిప్రాయం ఏర్పరచడానికి చేసిన కుట్ర. అకారణంగా మమ్మల్ని రెచ్చగొట్టడానికి వేసిన పన్నాగం. ఈ హత్యతో మనకి సంబంధంలేదు! ప్రొఫెసర్‌తో మనకి శత్రుత్వంలేదు! ఈ హత్యలో విద్యార్థుల హస్త ముందనడం నిరాధారమైన ఆరోపణ! తప్పుడు ఆధారాలు సృష్టించి మమ్మల్ని బ్లేమ్ చేస్తున్నారు! ఈ దుర్మార్గం వెనక ఏదో ముఠావుంది—ఆ ముఠాకి మనతో సంబంధం లేదు.

"మిత్రులారా! మనమీద వస్తోన్న ఈ ఆరోపణలకి మనం రెచ్చిపోవద్దు! సహనంవుంటే నిజం అదే బయట పడుతుంది. ప్రొఫెసర్‌తో మనకివున్న పవిత్రమైన బంధాన్ని నీచపరిచి, అవహేళన చేసిన దుష్టులు త్వరలో పట్టుబడతారు. దుష్టుల్ని పట్టుకోడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు—అంతవరకు మనం—"

"హంతకుడ్ని పట్టుకోడమంటూ జరగదు!" అరిచాడొక విద్యార్థి.

"ఎందుకు జరగదు?" అడిగాడు మరొక విద్యార్థి.

"ప్రతి ప్రముఖ వ్యక్తి హత్య చరిత్రలో మిస్టరీగా మిగిలిపోతుంది గనుక! ప్రొఫెసర్ హత్య కొన్ని రాజకీయ కారణాలవలన తప్పకుండా మరుగున పడిపోతుంది. పోలీసులు అవినీతిపరులని ప్రజల విశ్వాసం. ఏ రాజకీయ శక్తి అయినా వీళ్ళని కొనేయగలదు. అప్పుడేమీ చెయ్యరు వాళ్ళు—ఈ హత్యమీద తెర కప్పేస్తారు. పైగా విద్యార్థులమీద ఈ హత్య రుద్ది చేతులు దులుపుకుంటారు."

"కాదు. పోలీసులందరూ అవినీతిపరులు కాదు!" శీతల్‌ప్రసాద్ అన్నాడు ప్రశాంత స్వరంతో, "నీతిపరుడైన ఆఫీసర్ ఈ కేసులో పనిచేసే అవకాశాలెందుకు లేవు? కర్తవ్య నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అధికారు లెందురు లేరు ఈ దేశంలో?"

"నీతి! నీతి యెక్కడవుంది మైడియర్ ఫ్రెండ్స్?" అడిగాడొక విద్యార్థి.

"అణ్వాయుధాలు తయారుచేసే ఈ నాగరిక ప్రపంచంలో నైతిక విలువ లెక్కడ వున్నాయి! ఈ లోకంలో నీతిపరులెవరున్నారు? అంతెందుకు—మనలో యెందరున్నారో చేతులెత్తండి చూస్తాను?"

"ఉన్నారు! ఇద్దరున్నారు!" అర్చిందొక గొంతు.

"ఎవరు?"

"ఈ సిటీలో శాయశక్తులా సేవచేస్తున్న, ఇద్దరు డిటెక్టివ్‌లు: లాల్ అండ్ జాన్. వీళ్ళని ఏ శక్తీ లోబరచుకోలేదు! నేరస్తులతో వీరు రహస్య ఒప్పందాలు కుదుర్చుకోరు! క్లయంట్స్‌ని దగాచెయ్యరు. ఎలాటి

దుర్మార్గులైనా ధైర్యంగా యెదుర్కొనే గుండెలు వారి కున్నాయి. వారికాశక్తి వారి ఆదర్శమే ఇచ్చింది."

చప్పట్లు కొట్టారందరూ.

కొందరు ఈలలు కూడా వేశారు.

"ఆల్‌రైట్, ఫ్రెండ్స్!" శీతల్‌ప్రసాద్ అన్నాడు ఉత్సాహంగా. "ప్రొఫెసర్ దయాళ్ హత్యకేసు మనం పోలీసులకే వదలకూడదు. మనం ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలి. మనం నిర్దోషులమని నిరూపించుకోవాలి. మీరు కోరినట్టు ఈ కేసులో డిటెక్టివ్‌ల సహాయం కోరుదాం. అయితే అందుకు ఖర్చులన్నీ మనమే భరించాలి."

మరుక్షణం డబ్బుల వర్షం కురిసింది.

5

కృష్ణన్ ముందు ఆశ్చర్యంగా, ఆ తర్వాత అనుమానంగా చూసి, "హల్లో ఫ్రెండ్స్! ఎప్పుడొచ్చారు?" అన్నాడు.

"గుడ్మార్నింగ్ కృష్ణన్, ఇప్పుడే వచ్చాం" అన్నాడు లాల్.

కృష్ణన్ నవ్వి జాన్ భుజం తట్టి "ఏమిటి నీరసంగా వున్నారు?" అన్నాడు.

జాన్ మాట్లాడలేదు.

లాల్ అన్నాడు, "వారంరోజులైంది గర్ల్‌ఫ్రెండ్స్‌తో తిరిగి."

"నో పర్సనల్ మాటర్స్ పార్టనర్!" జాన్ కసిరాడు.

"నెవర్‌మైండ్ కూచోండి" అన్నాడు కృష్ణన్. "మిస్టర్ లాల్, నేనే మిమ్మల్ని పిలుద్దామనుకున్నాను. మీరే వచ్చేశారు. ప్రొఫెసర్ మర్డర్‌లో మీకు ఇంట్రెస్టు వుందా?"

లాల్ తలూపాడు.

"అయితే రంగంలో దిగండి. ఈ హత్య ఎవరుచేశారో స్పష్టంగా తెలిపోతున్నా కొన్ని అనుమానాలు నివృత్తి చేసుకుంటే తప్ప కచ్చితమైన నిర్ణయానికి రావడం కుదరదు."

"ఎవరు చేశారు హత్య?"

"స్టూడెంట్స్."

"వెల్, మేం స్టూడెంట్స్ తరఫున వచ్చాం" అన్నాడు లాల్. "ఇన్‌స్పెక్టర్, కపటత్వం నాకు నచ్చదు. ఈ హత్య పరిశోధించమని మమ్మల్ని పురిగొల్పింది మీరు అనుమానిస్తున్న విద్యార్థులు. మీరేమంటారు?"

కృష్ణన్ ముఖం కందిపోయింది. "ఓహ్... మీరు వాళ్ళని నమ్ముతున్నారా?"

"అనుమానించడానికి ఆధారాలు కన్పించడం లేదు" అన్నాడు లాల్.

"నా దగ్గర చాలా ఆధారాలున్నాయి. కానీ, ఒక్కటీ పనికిరాదు" విచారంగా అన్నాడు కృష్ణన్.

లాల్ నవ్వాడు. "పనికిరాని ఆధారాలతో అనుమానించడం ఆరోగ్యానికి చేటు. పరిస్థితులు విద్యార్థుల్ని అనుమానితుల్ని చేశాయి తప్ప, సరయిన ఆధారాలు దొరక్క మీరెవర్నీ యింతవరకు అరెస్టు చెయ్యలేకపోయారు. మా మీద మీకు విశ్వాసం వుంటే నిశ్చింతగా వుండండి. మేం న్యాయాన్ని మైక్రోస్కోపులో పెట్టి మరీ చూస్తాం.

"మా నిర్ణయాలు న్యాయానికి కట్టుబడి వుంటాయి. మేం మోసం చేస్తున్నట్టు మీకు తెలిస్తే లైసెన్స్‌లు లాక్కోండి. ఏమంటారు?"

కృష్ణన్ కాస్సేపు ఆలోచించి తలూపాడు. "సరే,

మిమ్మల్ని నమ్ముతాను. క్లయంట్స్ డబ్బు కాశపడి కేసుని తప్పుదోవన పట్టించరని నాకు తెలుసు. విష్ యూ గుడ్ లక్ ఫ్రెండ్స్, ఈ కేసును సక్సెస్ చెయ్యండి."

"వెరీ వెల్. హత్య ఎలా జరిగిందో పత్రికల్లో చదివాం. అయితే ఆధారాలు ఏం దొరికాయి?" లాల్ అడిగాడు.

కృష్ణన్ అన్నాడు "అంతు పట్టని అడుగు జాడలు, నైలాన్ తెరలో బుల్లెట్ రంధ్రం ఇవే ఆధారాలు. ఐతే శవం దుస్తుల్లో కొన్ని వస్తువులు దొరికాయి. తాళం చెవులు, కరెన్సీ కాయితాలు; చిల్లర నాణాలు, ఫౌంటెన్ పెన్ను. పబ్లిషర్స్ వ్రాసిన రెండు వుత్తరాలు, పర్సులో ఆయన భార్యాపిల్లల ఫోటో—అయితే మిస్టర్ లాల్, ఎడమకాలి బూటులో ఒక కార్డుముక్క దొరికింది."

తికమకగా అడిగాడు లాల్, "కార్డ్? విజిటింగ్ కార్డా? పోస్టు కార్డా?"

కృష్ణన్ అడ్డంగా తలూపాడు. "రెండూ కావు. మామూలు కార్డు. దానిమీద చేతివ్రాత వుంది. అదిలా వ్రాసి వుంది: 'నెం. 1—వాగ్దానం నిలబెట్టుకున్న మీ శ్యామ....' ఆ దస్తూరీ ప్రొఫెసర్‌ది కాదు. దాని అర్థ మేమిటో అర్థం కావడం లేదు.

కానీ ప్రొఫెసర్‌కి 'శ్యామల' అనే పేరుగల స్త్రీ ఎవరో ఆ కార్డు యిచ్చివుండాలని నా అనుమానం. అయితే ప్రొఫెసర్ దాన్ని అలా బూటులో ఎందుకు దాచినట్టు? ఒకవేళ ఆ స్త్రీకీ ఆయనకీ రహస్య సంబంధం వుందా? నెం 1 వాగ్దానం....అంటే దీని అర్థం ఏమిటి? ఏమిటా వాగ్దానం? శ్యామ అనేది కోడ్ పదమా?"

"ఆ కార్డు చూపించండి" జాన్ అన్నాడు.

కృష్ణన్ బ్యాగులోంచి ఒక చిన్న కార్డు తీసి అందిం

చ్చాడు.

జాన్ ఆ కార్డుని రెండు నిముషాలసేపు శ్రద్ధగా చూపి లాల్‌కి అందించి అన్నాడు: "ఇవి కోడ్ పదాలని మీరెలా అంటున్నారు? 'శ్యామ' అనేది స్త్రీ పేరని మీకెలా తెలుసు? 'శ్యామలరావు' అనే పురుషుడు ఎందుక్కా కూడదు? సరే, ఇన్‌స్పెక్టర్, కార్డు యెడమకాలి బూటులో దొరికిందన్నారు. అప్పుడా బూటు స్థితి ఎలా వుంది? దారాలు బిగించి వున్నాయా?"

"లేవు. దారాలు విప్పేసి వున్నాయి" అన్నాడు కృష్ణన్.

"కుడి కాలి బూటు?"

"దారాలు కట్టివున్నాయి."

లాల్ చిన్నగా ఈల వేశాడు. "కృష్ణన్, ప్రొఫెసర్‌కి అందిన ఉత్తరం చూపించండి."

కృష్ణన్ బ్యాగులోంచి ఉత్తరం తీసి ఇచ్చాడు.

లాల్ ఆ ఉత్తరం చదివి మరోసారి ఈలవేశాడు.

"ఏమిటి?" జాన్ అన్నాడు, వుత్తరం లాక్కుంటూ.

లాల్ అన్నాడు: "ఇన్‌స్పెక్టర్ హత్య చేసింది స్త్రీయా, పురుషుడా అన్నది మనకు తెలియదు. ఈ విషయం తేలేవరకు ప్రొఫెసర్ని చంపింది 'ఎక్స్' అని భావిద్దాం. ఈ ఉత్తరం ఎక్స్ వ్రాసింది. సరిగ్గా చెప్పిన సమయానికి హత్య జరుగుతుందని ఉత్తరంలో వుంది. అదే వాగ్దానం. ఇచ్చిన వాగ్దానం ప్రకారం హత్య చేయబడింది కాబట్టి 'వాగ్దానం నిలబెట్టుకున్న—మీ శ్యామ' అని కార్డు మీద స్పష్టం చెయ్యబడింది. ఈ కార్డు బుద్ధిపూర్వకంగా ప్రొఫెసర్ బూట్లో వదలబడింది. అది పోలీసులకి దొరకాలన్నది ఎక్స్ అభిమతం."

"ఆ అభిమతం ఉద్దేశం ఏమిటి?"

"ఈ కేసు మీరు సరిగా అర్థం చేసుకోలేదు. ప్రొఫెసర్ హత్య పథకం ప్రకారాం చాలా తెలివిగా చెయ్యబడింది. కార్డు పోలీసులకి దొరకాలన్న ఎక్స్ అభిమతానికి ఉద్దేశం ఏమిటో చెప్తాను. కార్డు మీద నెం. 1 వ్రాసి మొదటిహత్య అనుకున్నవిధంగా పూర్తి చేసినట్టు స్పష్టం చెయ్యబడింది. అంటే—ఆ తర్వాత ఇంకా కొన్ని హత్యలు జరుగుతాయని దాని అర్థం. ఈ హత్యలన్నీ పోలీసులకి తెలియజేస్తూ మరీ చెయ్యాలన్నది ఎక్స్ ముఖ్యోద్దేశం. ఇప్పుడర్థమైందనుకుంటాను."

"గాడ్! ఇంకా యెవరి హత్యలు జరుగుతాయి!" అన్నాడు కృష్ణన్.

జాన్ సూటిగా చూశాడు.

లాల్ బలహీనంగా నవ్వి, ఇబ్బందిగా ముఖంపెట్టాడు.

"ప్రొఫెసర్‌కి మరణించేముందు ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది. ఇలాటి వుత్తరాలే ఇంకెవరికేనా రావచ్చు. బహుశా ఈపాటికి వచ్చివుండవచ్చు. ఆ వుత్తరాలు అందుకున్న వ్యక్తులు ప్రొఫెసర్‌లాగే ధైర్య సాహసాలు గలవాళ్ళయితే వాళ్ళకి మరణం తథ్యం.

"అయితే ప్రాణభయం వున్నవాళ్ళు పోలీసుల దగ్గరికి వస్తారు. మనం వాళ్ళకోసం యెదురు చూడ్డం తప్ప ఏమీ చెయ్యలేం. దట్సాల్. ఇక, ఈ 'శ్యామ' అనేది స్త్రీ పేరో, పురుషుడి పేరో, లేక కోడ్ పదమో చెప్పడం కష్టం.... ఇప్పుడే ఏమీ చెప్పలేను. ఈ కార్డు నా దగ్గర వుంచుకుంటాను."

"మంచిది."

"థాంక్స్. ఒకసారి మేం హత్య జరిగిన హోటల్ గది చూడాలి."

కృష్ణన్ తలూపాడు "పదండి, వెళదాం."

6

హోటల్ మయూర్ రూం 124 సీలు తొలగించి ముగ్గురూ లోనికెళ్ళాడు.

గదిలో యెక్కడి వస్తువులక్కడ వున్నాయి. కార్పెట్ మీద రక్తం మరకల్ని ఇంకా శుభ్రం చెయ్యలేదు. కృష్ణన్ శవం పడివున్న స్థలం చూపించాడు. ఆ తర్వాత బుల్లెట్ ఎటునుంచి దూసుక వచ్చిందో చెప్పాడు.

ఆ గదిలో గదికీ బాత్‌రూంకీ మధ్య నైలాను తెర వుంది. దానిమీద రంగు రంగుల పెద్ద పువ్వులున్నాయి. ఆ పువ్వుల్లో ఒకదానిమీద అర్ధరూపాయి సైజు రంధ్రం కన్పించింది లాల్‌కి.

తెర తొలగించి లాల్ బాత్‌రూమ్‌లోకి నడిచాడు. కృష్ణన్ అతని వెంట వచ్చి అడుగు జాడలు చూపించాడు.

"ఈ అడుగు జాడలెలా ఏర్పడ్డాయి?" అడిగాడు లాల్.

"క్రింద డ్రైనేజిపంపు లీకయింది. నేలంతా బురద అయింది. హత్య చేసిన మనిషి తొక్కి వుండాలి" అన్నాడు కృష్ణన్.

బాత్‌రూంలో అడుగు జాడలు, అటు కిటికీకి రెండు గజాల దూరంలో, ఇటు తలుపుకి ఒక గజం దూరంలో- మధ్య వున్నాయి.

మరో రెండు అడుగుజాడలు బాత్‌రూంకీ, గదికీ మధ్య వున్న తెర దగ్గర వున్నాయి. అంటే కిటికీలోంచి 'ఎక్స్' బాత్‌రూంలో ప్రవేశించి, తర్వాత గదిలో తెర వెనుక విల

బడి వుండాలి.

అయితే బాత్‌రూంలో కిటికీ దగ్గర అడుగు జాడలు రెండు గజాలు యివతల యెందుకున్నాయి? ఈ విషయం డిటెక్టివ్‌లకు అర్థంగాలేదు. మిగతా అడుగుజాడలేమయ్యాయి?

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమటంటే, ఎక్స్ తిరిగి వెళ్ళిపోయినప్పటి జాడలు లేవు!

లాల్ బాత్‌రూం కిటికీ దగ్గరకి నడిచాడు. కిటికీ ఫ్రేము మీద రెండు అడుగుజాడలు కన్పించాయి. వాటిదిశ బయటి వేపుకి వుంది.

ఈసారి ఇంకా ఆశ్చర్యపడ్డాడు లాల్!

కిటికీ దగ్గర లేకుండా అడుగుజాడలు ఫ్రేము మీద యెలా పడ్డాయి?

మరుక్షణం అతని మెదడులో ఏదో మెదిలింది.

చటుక్కున కిటికీ రెక్క తెరిచి, తల బయటికి పెట్టి గోడకేసి చూశాడు. కిటికీ పక్కనుంచి డ్రైనేజి పైపు వుంది. ఆ పైపు గ్రౌండుఫ్లోర్‌నుంచి పై అంతస్థులవరకు వెళ్ళింది. ఆ పైపుద్వారా యెవరేనా సులభంగా పైకి రావచ్చు, కానీ పైపు సుమారు యెనిమిదడుగుల దూరాన వుంది. మరి దాని సహాయంతో కిటికీ ఎలా చేరుకోవీలవుతుంది?

ఈ రహస్యం ఛేధించడానికి యెంతోసేపు పట్టలేదు లాల్‌కి. ఉత్సాహంగా నవ్వుతూ చూసి, గదిలోకి నడిచాడు.

కృష్ణన్, జాన్‌లు ముఖాలు చూసుకొని అతని వెంట నడిచారు.

లాల్ గదిలో పచార్లుచేస్తూ ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు: "కృష్ణన్! 'ఎక్స్' యెలా ప్రవేశించి వుండాలని

మీ వ్యూహం?"

కృష్ణన్ భుజాలెగరేసి తేలిగ్గా నవ్వేశాడు.

"పైపు పట్టుకుని చరచరా పైకిప్రాకి, చెయ్యి జాపి కిటికీ అందుకుని లోనికి గంతేసి ప్రవేశించి వుండాలి."

"చెయ్యి జాపితే కిటికీ యెలా అందుతుంది?"

కృష్ణన్ ముఖం చిట్లించాడు. "అంటే?"

"అంటే....మనిషి చెయ్యి పొడవు మూడడుగులలోపు వుంటుంది. కిటికీకీ, పైపుకీ మధ్య సుమారు యెనిమిది అడుగుల దూరం వుంది. యెలా అందుతుంది!"

"అయితే యెలా అందింది?"

"ఇన్‌స్పెక్టర్ ప్రొఫెసర్ని చంపిన వ్యక్తి స్త్రీ అయినా కావాలి, లేదా తేలికయిన శరీరంగల పురుషుడయినా కావాలి. పరిస్థితినిబట్టి చూస్తే అది స్త్రీయే అని నాకు తోస్తోంది. చలాకీతనం, తెగువగల స్త్రీ. ఆటల్లో ఆరి తేరిన స్త్రీ. స్ప్రింగుల నుపయోగించి భవనాల నెక్కడం అభ్యసించిన స్త్రీ" అన్నాడు లాల్.

"వాట్!" అన్నాడు కృష్ణన్.

లాల్ నవ్వాడు, "దటీజ్ రైట్ ఇన్‌స్పెక్టర్. ఆమె స్ప్రింగుల నుపయోగించి భవనాల నెక్కడం నేర్చిన స్త్రీ. ఆమె ఈ పైపు ద్వారా కిటికీ వరకు చేరుకుంది. అక్కడ నుంచి కిటికీ అందుకోవడం అసాధ్యమని ఆమెకు తెలుసు. ముందే అన్ని ఏర్పాట్లూ చేసుకుని వచ్చింది. ఆమె బరువు లను యెత్తడానికి వుపయోగించే స్ప్రింగు తీసుకుని వచ్చింది. దాని చివర తాడు కట్టింది. పైపుద్వారా కిటికీ దగ్గిరికి చేరుకుంది. అక్కడనుంచి తాడుకి కట్టివున్న స్ప్రింగుని కిటికీ ఫ్రేం కేసి విసిరింది. స్ప్రింగ్ రెండవ వేపు హుక్ కిటికీ ఫ్రేము పై భాగంలో ఇరుక్కుంది.

వెంటనే ఆమె పైపు వదిలేసి స్ప్రింగ్‌ని పట్టుకుని వ్రేలాడపాగింది. కాస్సేపలా వూగాక, బలంకొద్దీ స్ప్రింగుని కిందికిలాగి పైకి యెగిరింది. అలా రెండు మూడుసార్లు పైకి యెగిరి కిటికీరెక్క హాండిల్ తిప్పేసింది. రెక్క తెరుచుకుంది. మరోసారి యెగిరి, ఆ విసురుకు కిటికీ లోంచి బాత్‌రూంలో రెండడుగుల దూరాన దూకి, తలుపు వేపుకి నడిచింది. అయితే స్ప్రింగ్ రెండవ చివర ఆమె చేతిలోనే వుంది. దాన్ని తలుపుకి కట్టేసి తెరవెనక వెళ్ళి నిలబడింది.

"ఆమె ప్రొఫెసర్ కంటబడ దలచలేదు. తను షూట్ చేశాక ఒకవేళ ప్రొఫెసర్ బ్రతికితే, తన ఆనవాలు చెప్ప వచ్చు. అందువల్ల తెర వెనుక నిలబడి షూట్ చేసింది.

"షూట్ చేశాక, తలుపుకి కట్టివున్న స్ప్రింగ్ రెండవ చివర పట్టుకుని, శక్తికొద్ది లాగి ఆ విసురుతో వెళ్ళి కిటికీలో పడింది. తర్వాత వచ్చిన పద్ధతిలోనే కిందికి దిగింది.

"ఇక ఈ అడుగుజాడలు పొరపాటున ఆమె బురద తొక్కడంవలన ఏర్పడినవి కావు. బుద్ధిపూర్వకంగా సృష్టించింది. పోలీసుల్ని తికమక పెట్టడానికి. అడుగు జాడలు బాత్‌రూం నుంచి వస్తూ వున్నాయిగాని, వెళ్తూ లేవు. అయితే కిటికీలో వెళ్తున్న దిశలో వున్నాయి— ఆమె రాకపోకలన్నీ మిస్టరీగా తోచాలని ఈ పని చేసింది."

"అంత తెలివిగల స్త్రీ యెవరు?" అడిగాడు జాన్.

"టెన్నిస్ ఛాంపియన్ కావచ్చు, కేబరే డాన్సర్ కావచ్చు, సినిమా ఫైటర్ కావచ్చు....సర్కస్ ఆర్టిస్టు కావచ్చు. చెప్పటం కష్టం."

"పురుషు డెందుకు కాకూడదు?"

"అడుగు జాడల్నిబట్టి చూస్తే అలా అన్పించటం లేదు."

7

ఏజెన్సీ ఆఫీసులో డిటెక్టివ్‌లు కేసు గురించి చర్చించుకుంటోండగా సరిగ్గా 11:15 కి టెలిఫోన్ రింగయింది.

లాల్ రిసీవర్ అందుకున్నాడు.

"హల్లో, లాల్ స్పీకింగ్."

"గుడ్‌మార్నింగ్ లాల్!" అంది అవతలి కంఠం.

"యస్?"

"నేను మీతోనే మాట్లాడాలని ఉదయంనుంచీ కాచుకున్నాను. మిస్టర్ లాల్, మీతో చాలా ముఖ్య విషయం మాట్లాడాలి. వింటారుకదూ?"

లాల్ ముఖం చిట్లించాడు, "మీరెవరు?"

జాన్ వ్రాయడం ఆపి లాల్‌కేసి చూశాడు.

"నా పేరు సుభాష్." అంది అవతలి కంఠం, "ఈ ఉదయం పత్రికల్లో ప్రొఫెసర్ హత్యగురించి చదివాను. మొన్న రాత్రి జరిగిందట। మీరు ఇన్వెస్టిగేట్ చేస్తున్నట్టు విన్నాను. హంతకుల్ని మీరు తప్పకుండా పట్టుకోవాలి."

కాస్సేపు నిశ్శబ్దం.

లాల్ మాట్లాడలేదు.

సుభాష్ గొంతు మళ్ళీ పలికింది, "మొన్న రాత్రి సంఘటన నాకు పదేపదే జ్ఞాపకం వస్తోంది! నేను.... నేను-చాలా మూర్ఖంగా ప్రవర్తించి ప్రాణాలమీదికి తెచ్చుకున్నాను! అకారణంగా నా ప్రాణాలకి అపాయం తెచ్చుకున్నాను."

"ఏమిటి మీరనేది? ఏం జరిగింది?"

"నేను గ్రాడ్యుయేట్‌ని — నిరుద్యోగిని—అయినా నాకు నిరాశా నిస్పృహలు లేవు. బ్రతుకుమీద తీపి వుంది. అయితే ప్రస్తుతం ప్రాణగండంలో వున్నాను. రెండు రోజుల నుంచి ఒక గదిలో ఖైదీగా గడుపుతున్నాను—"

"ఎక్కడ? ఏ గదిలో?"

"సుల్తాన్ బజార్‌లో....హోటల్ సెవెన్‌హిల్స్‌లో."

"త్వరగా ఏం జరిగిందో చెప్పండి!"

"మీకంతా త్వరత్వరగా చెప్పేస్తాను, లాల్." అంది అవతలి కంఠం."లేకపోతే మళ్ళీ వాళ్ళు ఇక్కడికి వచ్చేస్తారు-ఈలోపు మీరు వచ్చి రక్షించాలి....మొన్నరాత్రి నేను హోటల్ మయూర్‌లో ఒక విచిత్ర దృశ్యం చూశాను. హోటల్‌మీంచి వాటర్ పైపు పట్టుకుని జారుతూ ఒక స్త్రీ కన్పించింది. ఆమె చేతిలో ఏదో తెల్లగా మెరుస్తోంది. దానికి తాడు కట్టి వుంది. నాకెందుకో ఆమెని వెంబడించాలన్పించింది.

ఆమె కాచీగూడలో ఒక ఇంటికి వెళ్ళింది—టూరిస్ట్ హోటల్ పక్కరోడ్లో—ఆమె ఇంట్లోకెళ్లాక నేను వెనుదిరిగాను. కానీ నా వెనక ఎవరో ఇద్దర్నిచూపి అదిరిపడ్డాను. వాళ్లు నన్ను వెంబడిస్తున్నారని తెలుసుకుని పరిగెత్తాను.

వాళ్లు నన్ను తరమసాగారు. నేను ప్రాణాలు లెక్క చెయ్యకుండా నన్ను దాటివెళ్తున్న లారీని అందుకుని వేలాడుతూ ఎక్కేశాను. ఆ తర్వాత చూశాను—వాళ్ళు ఆటోలో వెంబడిస్తున్నారు. నన్ను చంపేస్తారని భయపడ్డాను.

లారీ సుల్తాన్ బజార్‌లో దిల్‌షాద్ థియేటర్ దగ్గరికి రాగానే కిందికి దూకేశాను. వాళ్ళు ఆటో దగ్గరికి వచ్చే

స్తోంది—నేను ఆలస్యం చెయ్యకుండా, ఆలోచించకుండా, ఎదురుగా హోటల్‌లో దూరాను—హోటల్ సెవెన్‌హిల్స్.

వాళ్ళు ఆటో దిగి ఫేర్ చెల్లించి హోటల్‌లోకి రాసాగారు. నేను వెంటనే రూం బుక్ చేసుకుని పైకెళ్ళిపోయాను. కాస్సేపయ్యాక కొద్దిగా తలుపు తెరిచి చూశాను—కింద హాల్లో వాళ్ళు టీ తాగుతూ కన్పించారు. వాళ్ళ కళ్ళు నా కోసం గాలిస్తున్నాయి. నేను గదిలోంచి బయటికి రాకుండా రాత్రంతా వుండిపోయాను. మర్నాడుకూడా వాళ్ళు అక్కడే కన్పించారు, అందర్నీ గమనిస్తూ....

"మిస్టర్ లాల్! నిన్నంతా ఈ గదిలో ఖైదీగా గడిపాను. వాళ్ళు ఏ క్షణాన వచ్చి చంపేస్తారోనని విపరీతంగా భయపడ్డాను. ఇప్పటివరకు గది కదల్లేదు. ఈ ఉదయం పేపర్లో చూశాను—ప్రొఫెసర్ హత్య జరిగిందట! హోటల్ మయూర్‌లో! నా అనుమానం నిజమయ్యింది. హత్యచేసింది నేను వెంబడించిన స్త్రీయే! నన్ను కాపలా కాస్తోంది ఆమె అనుచరులు! నేను ప్రత్యక్షసాక్షి గనుక నన్ను చంపక వదలరు!"

లాల్ ముఖంలో వేగంగా రంగులు మారాయి.

జాన్ గాభరాగా చూస్తున్నాడు.

"మిస్టర్ లాల్!" మళ్ళీ అర్చింది అవతలి కంఠం, "త్వరగా వచ్చి నన్ను రక్షించండి! వాళ్ళిప్పుడు ఇక్కడ లేరు-బయటకెళ్ళారు. మళ్ళీ వచ్చేస్తారు. మీరు త్వరగా-"

ఠక్కున లైను కట్ అయింది.

లాల్ అలాగే కూచుండిపోయాడు. ఆ తర్వాత తేరుకుని రిసీవర్ పెట్టేసి అదోలా నవ్వుకున్నాడు.

"ఏమిటి లాల్? ఎవరది?"

"పేరు సుభాష్. మనల్ని తక్షణం రమ్మంటున్నాడు."

అని లాల్ ఫోన్‌లో జరిగిన సంభాషణ గబగబ వివరించాడు.

జాన్ అంతా విని నోరు తెరిచాడు. "లాల్! ఇది శత్రువులు పన్నిన వల."

"అవును. ఆ వలలో మనం తలపెట్టబోతున్నాం. కమాన్!" లాల్ లేచి రికార్డ్ రూంలో దారితీశాడు.

రికార్డ్ రూంలో సేఫ్ తెరిచి రెండు పోలీస్ స్పెషల్ రివాల్వర్స్ తీశాడు. వాటిని లోడ్‌చేసి జాన్‌కి ఒకటి ఇచ్చి, "బి ఎలర్ట్! త్వరగా వెళ్ళాలి—కమాన్!" అన్నాడు.

ఇద్దరూ ఆఫీసుకి తాళంవేసి చకచక మెట్లు దిగి కిందికి వచ్చారు. కింద కార్లో లాల్ వెనకసీట్లో కూచొని, "డ్రైవ్ చేయ్!" అన్నాడు జాన్‌తో.

జాన్ డ్రైవింగ్ సీటులో కూచొని స్టార్ట్ చేశాక మళ్ళీ అన్నాడు లాల్: "వెనుదిరిగి చూడకు. దృష్టిని రోడ్డుమీద వుంచు. వేగంగా డ్రైవ్‌చెయ్. నేను రియర్‌వ్యూ మిర్రర్‌లో చూస్తూంటాను. ఎవరైనా వెంబడిస్తోంటే చెప్తాను. కారాపేయ్. అక్కడికక్కడే ఈ వ్యవహారం ఏమిటో తేల్చుకుందాం!"

జాన్ స్పీడుగా డ్రైవ్ చేస్తున్నాడు. అతని కళ్ళు ట్రాఫిక్‌ని జాగ్రత్తగా గమనిస్తున్నాయి....లాల్ కళ్ళు రియర్‌వ్యూ మిర్రర్‌మీద వున్నాయి. వెనక వస్తోన్న వాహనాల్లో కార్లులేవు, మోటార్ సైకిళ్లు లేవు, స్కూటర్లులేవు- ఒక డబుల్‌డెకర్ మాత్రం వుంది.

రవీంద్రభారతి దాటి సెక్రటరియేట్ రోడ్డుమీదికి వచ్చాక జాన్ స్పీడు ఇంకా పెంచేశాడు. స్పీడామీటర్ అరవై చూపిస్తోంది.

కారు విపరీతంగా కుదిపేస్తూ, ఎదురువచ్చే వాహనాల్ని తప్పించుకుంటూ దూసుకెళుతోంది వేగంగా—టాంక్

బండ్, తర్వాత లిబర్టీ, ఆ తర్వాత నారాయణగూడా, కాచీగూడా—చివరికి సుల్తాన్ బజార్.

లాల్ కళ్ళు రియర్ వ్యూ మిర్రర్ మీదే వున్నాయి: ఎవరూ వెంబడించడంలేదు. అతని చేతిలో రివాల్వర్ సిద్ధంగా వుంది.

సుల్తాన్‌బజార్‌లో దిల్‌షాద్ థియేటర్ యెదురుగా హోటల్ సెవెన్ హిల్స్ ముందు సడన్ బ్రేకువేశాడు జాన్. లాల్ ముందుకి తూలి సీటుకి గుద్దుకున్నాడు. జాన్ తటాలున కారుదిగి అటూ ఇటూ చూశాడు. అతని చెయ్యి ప్యాంట్ జేబులోవుంది రివాల్వర్‌ని తడుముతూ.

ఆ తర్వాత లాల్ దిగి హోటల్‌కేసి చూశాడు. రెండంతస్తుల బి క్లాస్ హోటల్. లోపల జనం కిట కిట లాడుతున్నారు. హోటల్ ముందు సైకిళ్ళూ, రిక్షాలూ వున్నాయి.

జాన్ సైగచేసి ముందుకి కదిలాడు. వెనక లాల్ అడుగువేశాడు. ఇద్దరూ లోనికెళ్ళారు. కౌంటర్‌లో కూచున్న మార్వాడీసేఠ్ ఆసక్తిగా చూశాడు. లాల్ లోపల అటూ ఇటూ చూశాడు. హాలునిండా కుర్చీలూ, టేబిళ్ళూ వున్నాయి. కుర్చీలమీద కిట కిట లాడుతూ జనం వున్నారు. టేబిళ్ళమీద నోరూరించే తినుబండారాలున్నాయి.

కౌంటర్ పక్కనుంచి పైకెళ్ళేందుకు మెట్లున్నాయి. డిటెక్టివ్‌లు లోనికి నడిచి ఒక టేబిల్‌ముందు కూచున్నారు. సర్వర్ వచ్చి వినయంగా అడిగాడు, ఏమి కావాలని. డిటెక్టివ్‌లు ఏమీ వద్దని తలలూపారు.

లాల్ కళ్ళు జనాన్ని గమనిస్తున్నాయి. రెండు నిమిషాలు గడిచినా యెలాటి సంఘటన జరగలేదు.

జాన్ అన్నాడు నెమ్మదిగా: "సుభాష్ ఇక్కడలేదు. ఉంటే మనల్ని చూసి వచ్చేవాడు."

"అవును." అన్నాడు లాల్.

"బహుశ గదిలోనే వుంటాడు. నేను వెళ్ళి చూసి వస్తాను."

"జాగ్రత్త. ఉంటే పిలుచుకురా" అన్నాడు లాల్.

జాన్ తలూపి లేచి కౌంటర్ దగ్గరికి నడిచాడు. ప్రొప్రయిటర్‌తో మాట్లాడి ఆ తర్వాత మెట్లెక్క సాగాడు.

లాల్ సిగరెట్ వెలిగించి ఆలోచనల్లో పడ్డాడు. హాలు మధ్యవున్న స్పీకర్లోంచి హిందీ గ్రాంఫోన్ రికార్డు విన్పిస్తోంది. ఇంతలో జాన్ మెట్లమీద దిగుతూ కన్పించాడు-ఒక యువకుడితో.

లాల్ వులికిపడి ఆ యువకుడిని చూశాడు.

ఆ యువకుడికి పాతికేళ్ళుంటాయి. పెద్ద పెద్ద పువ్వుల చొక్కా ధరించాడు. జుత్తు ముఖంమీద పడి కళ్లు కన్పించడంలేదు. నున్నగా గడ్డం గీసుకున్నాడు. వెనక వెంట్రుకలు భుజాల్ని తాకుతున్నాయి....పెదిమల మధ్య సిగరెట్ వుంది.

లాల్ నిటారుగా కూచున్నాడు.

జాన్ ఆ యువకుడితో వచ్చాడు. ఆ యువకుడు లాల్‌ని చూస్తూనే ముఖంలో నవ్వు తెచ్చుకున్నాడు.

"థాంక్యూ లాల్! మీరు వచ్చేశారు" అన్నాడు చెయ్యి జాపి.

అతని నోటిలోంచి సిగరెట్ పొగ గుప్పున బయటికి వచ్చింది. లాల్‌కి ఆ పొగలో వింత వాసన వేసింది. అయిష్టంగా షేకాండిచ్చాడు.

జాన్ దూరంగా జరిగి నిలబడి, చెయ్యి జేబులో పెట్టుకుని అందర్నీ గమనిస్తున్నాడు. వాళ్ళంతా ఛలోక్తులు

విసురుకుంటూ, తింటూ, తాగుతూ నిమగ్నమైవున్నారు. డిటెక్టివ్‌లని గమనించడంలేదు. సమయం మధ్యాహ్నం పన్నెండయింది.

"నువ్వేనా సుభాష్?" లాల్ అడిగాడు.

ఆ యువకుడు తలూపి కూచున్నాడు యెదురుగా.

"ఆ మనుష లెక్కడ వున్నారు? ఎలా వుంటారు?" మళ్ళీ అడిగాడు లాల్.

సుభాష్ జుత్తు వెనక్కి తోసుకుని, "నల్లగా వుంటారు. నిక్కర్లు ధరించారు" అన్నాడు.

లాల్ హాల్లో కలియజూశాడు: "ఇక్కడ వున్నారా?"

"ఇంకా రాలేదు."

"వెల్, మొన్నరాత్రి నువ్వు చూసింది నిజమేనా?"

మరోసారి గుప్పుమని పొగ వదిలాడు సుభాష్.

"అవును. ఆమె కాచీగూడలో ఒక ఇంట్లోకెళ్ళింది."

"ఆ యిల్లు చూపిస్తావా?"

తలూపాడు సుభాష్.

లాల్ సుభాష్‌ని పరీక్షగా చూపి అడిగాడు: "ఆమె యెలా వుంటుంది? వయసెంత! యెలాంటి రంగు? ఎలాటి బట్టలు ధరించింది? హోటల్ మయూర్ నుంచి ఆమె యెలా వెళ్ళింది? కాలినడకనా? కార్లోనా?"

సుభాష్ లాల్‌ని తీక్షణంగా చూశాడు. మరోసారి పొగ వదిలి "మీకంతా వివరించి చెప్తాను....కానీ నన్ను మీరు కాపాడాలి!" అన్నాడు.

జాన్ లాల్‌ని చూశాడు. లాల్ కుర్చీలో వెనక్కి జరిగి నిటారుగా కూర్చున్నాడు. అతని కుడిచెయ్యి నెమ్మదిగా జేబులోకి వెళుతోంది. సుభాష్ కూడా నిటారుగా కూచున్నాడు. అతని చెయ్యి కూడా జేబులోకి వెళుతోంది. ఇద్దరి

మధ్య టేబిల్ వుంది.

"ఆ స్త్రీ గురించి నేను చూసిందంతా చెప్పేస్తాను."

సరిగ్గా అదే సమయంలో జాన్‌కి పెద్దగా శబ్దం విన్పించింది. సుభాష్ మాటలు పూర్తికాలేదు. కుర్చీలోంచి తూలి కింద పడ్డాడు. అతని గుండెలోంచి రక్తం కారి నేలని తడిపేసింది. అతను అస్పష్టంగా ఏదో గొణిగి, కళ్లు మూసుకుని అచేతనంగా వుండిపోయాడు.

జాన్ చటుక్కున ముందుకు కదిలాడు. లాల్ తటాలున కుర్చీలోంచి లేచాడు. అతని కుడి చేతిలో రివాల్వర్ వుంది. రివాల్వర్ బ్యారెల్ పొగ కక్కుతోంది.

హోటల్లో హఠాత్తుగా అరుపులు ప్రారంభమయ్యాయి. బయటికి పరిగెత్తడానికి జనం ప్రయత్నించారు గానీ, లాల్ చేతిలో రివాల్వర్ చూసి ఎవరూ కదల్లేకపోయారు.

కౌంటర్‌లో కూచున్న ప్రొప్రయిటర్ రాయిలా వుండిపోయాడు. ట్రేలు మోస్తున్న సర్వర్లు రివాల్వర్ ప్రేలుడు విని, పదార్థాలు జారవిడిచేసి లోనికి పరిగెత్తారు.

హోటల్ బయట కల్లోలం ప్రారంభమైంది. జనం లోనికి జొరబడ్డారు. కానీ ఎవరూ శవం దగ్గరికి వచ్చే ప్రయత్నం చెయ్యలేదు.

జాన్ శవాన్ని చూసి స్థాణువైపోయాడు. లాల్ ఆ యువకుడ్ని రివాల్వర్‌తో ఎందుకు షూట్ చేశాడో అర్థం గాలేదు. అలా చేసే అవసరం ఎందుకు ఏర్పడింది?

జనంకూడ ఇలాగే గుసగుసలు ప్రారంభించారు. వాళ్ళ కళ్ళు లాల్‌ని క్రూరంగా, కసిగా చూస్తున్నాయి. లాల్ చేతిలో రివాల్వర్ లేకపోతే దాడిచేసి గాయపర్చేవారు.

జాన్ తల విదిలించి లాల్‌ని చూశాడు. అతనికేమీ తోచడం లేదు. సుభాష్ ఆ స్త్రీ గురించి వివరాలు చెప్పు

తుంటే లాల్ ఎందుకు చంపేశాడు?

లాల్ సుభాష్ శవం మీద వంగాడు. సుభాష్ చెయ్యి రివాల్వర్‌తోసహా బయటకి వచ్చింది. రివాల్వర్‌కి సైలెన్సర్ అమర్చి వుంది.

లాల్ ఆ రివాల్వర్ తీసుకుని అందర్నీ చూసి అన్నాడు "నన్ను చంపే ముందు ఇతన్ని చంపవలసి వచ్చింది."

జాన్‌తోసహా జనమంతా కలవరంగా చూశారు. ఇంతలో బయటినుంచి నల్గురు వస్తాదులు లోనికి జొరబడ్డారు.

నేలమీద శవాన్నీ, లాల్ చేతిలో రివాల్వర్‌నీ చూసి ముందుకు దూకి అర్చారు "హత్య చేశాడు! హంతకుడ్ని పట్టుకోండి."

జాన్ వాళ్ళని రివాల్వర్‌తో అడ్డుకున్నాడు.

"వెనక్కి—వెనక్కి తొలగండి."

ఇంతలో బయట విజిల్స్ విన్పించాయి. వస్తాదులు వెనక్కి దూకి హోటల్ పెరటిద్వారా బయటకి పరుగు తీశారు.

ఒక సబ్ఇన్‌స్పెక్టర్‌తో సహా నల్గురు కానిస్టేబుల్స్ లోనికి వచ్చారు.

ఇన్‌స్పెక్టర్ లాల్ దగ్గరికి వచ్చి శవాన్ని చూశాడు. జనం ఒక్కొక్కరే బయటికి జారుకోసాగారు.

"మిస్టర్ లాల్. ఎలా జరిగింది?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"నేను షూట్ చేశాను" అన్నాడు లాల్.

"గుడ్ గాడ్! వీడు సుభాష్! ఏదో ఒకనాడు వీడికీ గతి పడుతుందని నాకు తెలుసు."

"ఎక్స్‌క్యూజ్‌మీ. చనిపోయినవారిని నీచంగా సంబో

ధించకూడదు. సుభాష్ యెవరు?"

"సారీ! సుభాష్ కిరాయి రౌడీ" అన్నాడు ఇన్‌స్పెక్టర్. "అనేకసార్లు జైలుకెళ్ళాడు. ఈమధ్యే హాషీష్ స్మగ్లింగ్ చేసేవాళ్ళతో చేతులు కలిపాడు. మారిజువానా సిగరెట్స్ తాగుతాడు. చరస్ సేవిస్తాడు. చట్టవిరుద్ధ పనులు చాలా చేశాడు గానీ ఇంతవరకు హత్య చెయ్యలేదు."

హోటల్ పూర్తిగా ఖాళీ అయిపోయింది. గ్రాంఫోన్ రికార్డు ఆగిపోయింది.

లాల్ శవాన్ని చూస్తూ అన్నాడు: "వెల్, సుభాష్ మమ్మల్ని మోసంతో ఇక్కడికి రప్పించాడు చంపడానికి. ఇందాక ప్రవేశించిన వస్తాదులు ఇతని అనుచరులను కుంటాను. ఇన్‌స్పెక్టర్, మీరు రాకపోతే వస్తాదుల చేతిలో మేం నలిగిపోయేవాళ్ళం. మీరు శవాన్ని తీసుకెళ్ళి హెడ్‌క్వార్టర్సులో క్రైం ఇన్‌స్పెక్టర్ కృష్ణన్‌కి అప్పగించండి. మేం తర్వాత వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తామని చెప్పండి."

లాల్ సుభాష్ రివాల్వర్‌ని ఇన్‌స్పెక్టర్‌కి స్వాధీనం చేసి బయటికి దారి తీశాడు. అతని వెంట తల వంచుకుని జాన్ వెళ్ళాడు.

"విద్యార్థి సంఘర్షణ సమితి" కార్యాలయం ముందు డిటెక్టివ్‌లు కారు దిగడం చూసి శీతల్‌ప్రసాద్‌తో సహా కొందరు విద్యార్థులు పరుగెత్తి వచ్చి రిసీవ్ చేసుకున్నారు.

కార్యాలయంలో మెత్తటి పరుపుమీద డిటెక్టివ్‌లను కూచోబెట్టి చల్లటి పానీయాలు అందించారు. రేపటినుంచి ప్రారంభం అయ్యే ఉద్యమానికి విద్యార్థులు సన్నాహాలు చేస్తూ హడావుడిగా కన్పిస్తున్నారు.

లాల్ హోటల్లో జరిగిన సంఘటన ప్రస్తావించినప్పుడు

శీతల్‌ప్రసాద్ హతాశుడయ్యాడు. ఆ తర్వాత అతని సమయస్ఫూర్తికి అభినందించి, "మిస్టర్ లాల్! మీ కిప్పుడు శతృవు లేర్పడ్డారు" అన్నాడు.

"శత్రువులు లేకపోతే మా వృత్తిలో థ్రిల్ వుండదు" అన్నాడు లాల్.

"అయితే, సుభాష్ ఆ స్త్రీ గురించి చెప్పింది నిజమే నంటారా?"

"కాదు. అది కట్టుకథ....హత్య చేసింది స్త్రీయేగానీ అతను వర్ణించిన స్త్రీ మాత్రం కాదు. అతను ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడే నాకు అనేక సందేహాలు వచ్చాయి. రెండు రోజులు అతను హోటల్‌లో ఖైదీగా గడిపాడు గానీ పోలీసుల్ని పిలవలేదు. ఎందుకు పిలవలేదు?

"అతన్ని మొన్న రాత్రి ఎవరూ వెంబడించలేదు. అతను వర్ణించిన నిక్కర్లు ధరించిన మనుషులు యెవరూ లేరు. అది కల్పితం. ప్రొఫెసర్ని హత్య చేసిన స్త్రీ సుభాష్‌ని నియమించి వుంటుంది. ఈ కేసులో మేం జోక్యం చేసుకోవడం ఇష్టంలేక మమ్మల్ని చంపడానికి అతన్ని ఎన్నుకుంది.

"సుభాష్ ఫోన్‌లో చెప్పిన మాటలు ఆమె చెప్పిందే. సుభాష్ ఆ స్త్రీ చేతిలో ఏదో తెల్లగా మెరుస్తున్న వస్తువును చూసినట్టు చెప్పాడు కాబట్టి స్ప్రింగును ఆధారం చేసుకుని నేను చెప్పిన ఎక్స్‌ప్లనేషన్ సరైనదని ఇప్పుడు తెలుస్తోంది."

"అయితే సుభాష్ అలా పబ్లిగ్గా చంపుతాడని మీరెందు కనుకున్నారు?"

"జాన్ అతనితో మెట్లు దిగుతున్నప్పుడే చూశాన వాలకం. అతనేదో మత్తుపదార్థం సేవిస్తున్నట్టు తోచింది.

ఈ విషయం అతను దగ్గరకొచ్చాక రుజువైంది-అతని సిగరెట్ పొగలో, ఏదో మత్తు వాసన నాకు సోకింది. మామీద రివాల్వర్ ప్రయోగించేటప్పుడు ఎలాటి భయాందోళనలకి లోను కాకుండా అతను సిగరెట్‌లో మారిజువానా కలిపి తాగుతున్నాడు."

శీతల్‌ప్రసాద్ ఆందోళనగా చూశాడు. "మిస్టర్ లాల్! ఇక ముందు కూడా మీమీద హత్యా ప్రయత్నాలు జరగవచ్చు."

నవ్వాడు లాల్. "ఎవరికి తెలుసు? చావు చెప్పిరాదు."

8

మర్నాటినుంచి విద్యార్థుల ఆందోళన ప్రారంభమవుతుంది.

ఆందోళన ఉద్దేశ్యం: ధరలు తగ్గించడం. బ్లాక్ మార్కెట్‌ని రూపు మాపడం.

రేపుదయం విద్యార్థులు వి. స. స. కార్యాలయంనుంచి అసెంబ్లీ వరకు ఊరేగింపుగా బయలుదేరతారు. అసెంబ్లీ ముందు శాంతిపూర్వక నిరసన ప్రదర్శన చేస్తారు.

ఈ కార్యక్రమాన్ని ఎలాటి దుశ్చర్యలకి పాల్పడకుండా రూపొందించారు. ప్రజా, ప్రభుత్వ ఆస్తులకి ఎలాటి నష్టం సంభవించకుండా, నినాదాలకు మించి హద్దులు దాటకుండా ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు.

అయితే ప్రదర్శనలో భాగంగా ప్రభుత్వాధికారులు ఘెరావ్ చెయ్యబడతారు. రైళ్ళ రాకపోకలు నిలిపివేయబడతాయి. బస్సులు నిలిపివేయబడతాయి. వ్యాపార సంస్థ

లన్నీ మూసివేయబడతాయి.

శీతల్‌ప్రసాద్ తమ ప్రదర్శన విషయం డిటెక్టివ్‌లతో సంప్రతించాడు. డిటెక్టివ్‌లు ఈ కార్యక్రమంలో తీసుకో వలసిన జాగ్రత్తలు సూచించారు. ప్రదర్శనలో పరాయి వ్యక్తుల్ని చొరనీయకూడదు. ముఖ్యంగా గూండాలని జాగ్రత్తగా కనిపెడుతూ అప్రమత్తతతో మెలగాలి. ప్రద ర్శనలో ఉద్రిక్తవాతావరణం పుట్టకూడదు.

విద్యార్థులు డిటెక్టివ్‌ల సూచనలు అంగీకరించారు.

ఇటు ఆందోళనకు సన్నాహాలు జరుగుతోంటే అటు ప్రభుత్వాధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. నేటినుంచి ప్రతి బస్సులో ఇద్దరు సాయుధ పోలీసులు గార్డ్‌చెయ్యాలి. లోకల్ ట్రైన్స్‌లో కూడా ఈ ఏర్పాటు చెయ్యబడింది. డిస్ట్రిక్ట్, ఇతర దూర ప్రాంతాలకు వెళ్ళే రైళ్లు సిటీ దాటేవరకు గార్డ్‌చెయ్యబడ తాయి. జంట నగరాల్లో పోలీసులు గస్తీ తిరగడం నేడే ప్రారంభమైంది.

విద్యార్థులు ఈ ప్రదర్శన జరపడం ముందు పోలీసులు అనుమతించలేదు. కానీ డిటెక్టివ్‌లు కమీష్నర్‌తో చర్చలు జరిపి, ఒక ఒప్పందం కుదుర్చుకుని అనుమతి సంపా దించారు.

ప్రదర్శనను అనుమతించని పక్షంలో విద్యార్థులు అసం తృప్తి చెంది, ఏదేనా అఘాయిత్యానికి పాల్పడే అవకాశా లున్నాయని, అప్పుడు పరిస్థితులు విషమించి రక్తపాతం తప్పదనీ—అందువల్ల ఎలాటి దౌర్జన్యానికీ తావులేని విధంగా రూపొందించబడ్డ ప్రదర్శనను అనుమతించక తప్పదనీ, డిటెక్టివ్‌లు హెచ్చరిక చేశారు. ఈ ప్రదర్శనకు తాము పూర్తి బాధ్యత వహిస్తామనీ, విద్యార్థులు తమ

అదుపులో వున్నారనీ, తమ సూచనల మేరకు ప్రవర్తించ గలరనీ హామీ ఇచ్చారు.

రేపు ప్రదర్శన ప్రారంభమవుతుందనగా, ఈరోజు సాయంత్రం అయిదు గంటలకి నారాయణగూడ వై.యం.సి.ఎ. లో రెండు మహిళా కళాశాలల విద్యార్థినుల మధ్య వాలీ బాల్ టోర్నమెంట్స్ ప్రారంభమయ్యాయి.

వందలాది ప్రేక్షకులు—స్త్రీలు, పురుషులు, పిల్లలు—గ్రౌండ్స్‌లో చేరారు. వాళ్ళలో విద్యార్థులుకూడ వున్నారు.

ఇరు పక్షాల మధ్య ఫైనల్ మ్యాచ్ ప్రారంభమై అర గంటలో ముగిసింది ప్రశాంతంగా. న్యూసైన్స్ కాలేజీ విద్యార్థినులు గెలిచారు. కోఠి వుమెన్స్ కాలేజీ టీము ఓడిపోయింది. ఫోటోగ్రాఫర్ విజేతల్ని ఫోటో తీయడానికి ఏంగిల్ సిద్ధం చేసుకుంటున్నాడు.

ఇంతలో ఏం జరిగిందో ఎవరికీ తెలీదు—

ఓడిపోయిన జట్టు కెప్టెన్, గెలిచిన జట్టు కెప్టెన్ జడ పట్టుకుని గట్టిగా లాగి గిరగిర తిప్పింది. ఆవేశంగా ఆమె మీదికి లంఘించి రక్కివేస్తూ, "మీరు ఫౌల్‌తో గెలిచారు, రెఫరీ నీతో చేతులు కలిపింది!" అని అరవసాగింది.

హఠాత్తుగా రెఫరీమీదికి ఓడిపోయిన టీము విద్యార్థినులు విరుచుకుపడ్డారు. ఆమెని రక్కివేస్తూ, బట్టలు చింపివేస్తూ విచిత్రంగా అరవసాగారు.

ఇంతలో ప్రేక్షకులనుంచి ఓ వందమంది గ్రౌండ్స్‌లో పరిగెత్తారు. రెండుటీముల మధ్య హోరాహోరీగా సాగుతోన్న పోరాటంలో తలదూర్చాడు. కొందరు తమ చేతి కందిన యువతుల్ని దూరంగా లాక్కుని పారిపోసాగారు. కొందరు మూకుమ్మడిగా యువతులమీద దౌర్జన్యం ప్రారంభించారు.

గ్రౌండ్స్‌లో అశ్లీలత, పాశవికత వికృతంగా నాట్యం చెయ్యసాగాయి. ఈ దృశ్యం చూసి మిగిలిన ప్రేక్షకులు భయకంపితులై అక్కడనుంచి పరుగుతీశారు.

దుష్టుల బారినపడ్డ యువతులు ఆర్తనాదాలు చేస్తూ గింజుకోసాగారు. వాళ్ళ కోమలమైన శరీరాలు నలిపివెయ్యబడుతున్నాయి. పెదవులు చుంబించబడుతున్నాయి-దుష్టులు విచ్చలవిడిగా, ప్రవర్తిస్తున్నారు.

పోలీసులు వచ్చేటప్పటికి జరగవల్సిందంతా జరిగిపోయింది. గ్రౌండ్స్ అంతా చిరిగిపోయిన దుస్తులు చెల్లాచెదురుగా పెదజల్లబడ్డాయి. నలిగిన పువ్వులు, పగిలిన గాజుముక్కలు తెగిపోయిన చెప్పులు....వీటన్నిటితో గ్రౌండ్స్ భీభత్సంగా కన్పిస్తోంది.

గాయపడ్డ యువతుల్ని హాస్పిటల్‌కి తరలించారు.

ఈ సంఘటన గురించి వి.స.స. కార్యాలయానికి ఇంకా సమాచారం అందలేదు. చీకటిపడుతుండగా కార్యాలయం ముందు ఒక జీపు ఆగింది. జీపులోంచి దిగుతున్న కృష్ణన్, మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లని చూసి ఆశ్చర్యపోయారు డిటెక్టివ్‌లు.

ఇంతలో ఒక పోలీస్ వ్యాన్‌కూడ వచ్చి ఆగింది.

కృష్ణన్ గబగబ లోనికి వచ్చి డిటెక్టివ్‌లని కోపంతో చూశాడు.

డిటెక్టివ్‌లు ఏమీ అర్థంగాక ఒకర్నొకరు చూసుకున్నారు.

"మిస్టర్ లాల్," కర్కశంగా అన్నాడు కృష్ణన్, "మేం విద్యార్థుల్ని అరెస్ట్ చెయ్యడానికి వచ్చాం."

"ఎందుకు?"

"నారాయణగూడ వై.యం.సి.ఎ.లో జరిగిన సంఘట

చెప్తా వినండి!

1. రక్తం నీటి కంటే ఆరు రెట్లు చిక్కగా ఉంటుంది.

2. తలనొప్పిలో నలభై యేడు రకాలున్నాయి.

3. 'యాక్' అనే జంతువు పాలు గులాబీ రంగులో ఉంటాయి.

4. ఇంగ్లీషు పదం 'రన్' కి 832 అర్థాలున్నాయి.

5. మిడతకు ఐదు కళ్ళుంటాయి.

6. U. S. A. లోని ఒక పట్టణం పేరు ASKME.

7. జైపూర్ మహారాజు మాన్‌సింగ్‌కు 1500 మంది భార్యలు వుండేవారు.

8. గ్లాసు పాలలో కంటే ఒక టొమాటోలో ఎక్కువ విటమిన్లు ఉంటాయి.

9. మొత్తం జీవరాసుల్లో ఒక్క మొసలి మాత్రమే పై దవడ ఆడించగలదు.

10. 'లైక్‌టెన్ స్టయిన్' రాజ్యపు జనాభా 1400. వైశాల్యం 62 చ॥మై. నేడు ప్రపంచంలో అతి చిన్నరాజ్యం అదే.

—పి. ఎస్. రాజు, మద్రిపూడి.

నతో వీళ్ళకి సంబంధముంది. మిస్టర్ లాల్, మీరు కమీష్నర్‌కి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయారు. వెంటనే వచ్చి సంజాయిషీ చెప్పుకోండి. కమాన్, ఇన్‌స్పెక్టర్స్. వీళ్ళని వ్యాన్‌లో ఎక్కించండి!"

ఇన్‌స్పెక్టర్స్ ముందుకి కదిలారు. బయటినించి కొందరు కానిస్టేబిల్స్ లోనికి వచ్చారు. విద్యార్థులు స్థాణువులై పోయారు.

జాన్ ఛటుక్కున లేచి ఇన్‌స్పెక్టర్ దగ్గరికి వెళ్ళాడు.

"కృష్ణన్, నారాయణ గూడలో ఏం జరిగింది?"

"దౌర్జన్యం."

"ఎవరిమీద?"

"ఆడవారిమీద."

"ఎలా?"

"వాలీబాల్ ఆడుతున్నారు—ప్రేక్షకుల నుంచి కొందరు విద్యార్థులు గ్రౌండ్స్‌లో పరిగెత్తి అలజడి రేపారు."

"ఎవర్ని అరెస్ట్ చేశారు?"

"ఎవరినీ లేదు."

"ఎందుకు?"

"ఆ విద్యార్థులు తప్పించుకున్నారు."

"ప్రత్యక్ష సాక్షులున్నారా? వాళ్ళ కథనం ఏమిటి!"

"విద్యార్థులే చేశారంటున్నారు."

"దయచేసి ఆ సంఘటన వివరంగా చెప్తారా?"

అయిదు నిమిషాలసేపు వివరించాడు కృష్ణన్.

జాన్ అంతా విని భుజాలెగరేశాడు: "వెల్. కృష్ణన్. వింతగా వుంది. అసలు అలజడి ఓడిపోయిన టీముతో ప్రారంభమైంది. వాళ్ళు హఠాత్తుగా గెలిచిన టీముమీద దాడిచేశారు. ఎందుకు? తమని ఫౌల్‌తో ఓడించారనీ,

ఎరువుల దిబ్బ?

(పాఠకుల పరిశోధన పోటీ-84 ఫలితాలు)

హంతకుడు: లాడ్జింగ్ యజమాని

లాడ్జింగ్ యజమాని రామానాయుడిని చంపి జేబులు వెతికి నప్పుడు-ఒక కాగితం పొట్లంలో కనిపించిన నల్లని మాత్రలు 'సిలోన్ సెంట్ ఫ్లవర్' విత్తనములు. అవి తిరిగి రామా నాయుడి జేబులో ఉంచి శవాన్ని ఎరువుల దిబ్బలో పాతిపెట్టాడు.

నేల తడిగా ఉండటమువలనా, పైగా ఎరువులదిబ్బ అవడం మూలంగానూ శవం జేబులో ఉన్న విత్తనములు మొలకెత్తి దిబ్బపైకి వచ్చాయి.

ఇన్స్పెక్టర్ ఆ మొక్క-నుండివచ్చే సెంటు వాసన ద్వారానూ, తన దగ్గర ఉన్న 'సిలోన్ సెంట్ ఫ్లవర్' ఫోటో ద్వారానూ దిబ్బమీద మొలచిన మొక్క-ను పోల్చాడు. దాని ద్వారా రామా నాయుడి శవం ఎరువుల దిబ్బలో పాతిపెట్టబడినదని గ్రహిం చాడు. లాడ్జింగ్ యజమాని హంతకుడని నిరూపించాడు.

—ఈ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/-లు బహుమతి పంపు తున్నాము.

(1) శ్రీ ఎన్. రవిశంకర్, బి. ఇ.,
6/2, ఆంధ్రా యూనివర్శిటీ హాస్టల్స్,
వాల్తేరు—530 003.

(2) శ్రీమతి జి. సుజాత, బి. ఎస్. సి.,
W/O పున్నయ్యచౌదరి, బి.కాం., ఏ. సి. ఏ.,
6/13, బ్రాడీపేట,
గుంటూరు—2.

[సరియైన సమాధానాలు వ్రాసిన ఇతర పాఠకులు అసంఖ్యా కంగా వున్నందున వారి పేర్లు ఇక్కడ ప్రచురించలేక పోతున్నాము. —ఎడిటర్.]

రెఫరీ అవినీతికి పాల్పడిందనీ—కారణం సబబుగానే వుంది.

కానీ ఈ కారణంతో బహిరంగంగా—చుట్టూ ప్రేక్షకు లుండగా అంత నీచంగా తిట్టుకుంటూ, అసభ్యకరంగా ప్రవర్తించడం వింతగా వుంది. వాళ్ళెందుకలా పిచ్చిపిచ్చి కేకలు వేశారు? ఎందుకు బట్టలు చింపుకున్నారు? వాళ్ళు ఆడవాళ్ళు కారా?

ఇన్‌స్పెక్టర్—ఆడవాళ్ళు అలా బజారున పడి—అందునా చదువుకున్న అమ్మాయిలు—అసభ్యంగా ప్రవర్తించడం నేనెక్కడా చూడలేదు. వాళ్ళ ప్రవర్తనలో ఏదో మర్మం వుంది—"

"మిస్టర్ జాన్, మీ ఉపన్యాసం వినే అవసరం మాకు లేదు."

"త్వరపడి నిర్ణయం తీసుకోకండి — పర్యవసానం తీవ్రంగా వుంటుంది. ఈ సంఘటనలో విద్యార్థులకేమీ సంబంధం లేదు. ప్రత్యక్ష సాక్షుల కథనం సరైనది కాదు. వాళ్ళు చూసింది రౌడీ మూకని. విద్యార్థుల్ని కాదు!"

"మీకెలా తెలుసు?"

"మేం మధ్యాహ్నంనుంచీ ఇక్కడేవున్నాం. ఇక్కడ నుంచి ఎలాటి ఆదేశాలూ జారీ చెయ్యబడలేదు. ఇక్కడ నుంచి ఆదేశాలు జారీచెయ్యనిదే ఏ విద్యార్థీ ఎలాటి కార్యక్రమం చేపట్టే అవకాశాలు లేవు. ఇది సంఘర్షణ సమితియే కాదు, ఇక్కడ విద్యార్థులు సంఘటితంగా, ఐకమత్యంగా కూడ వున్నారు. ఆ ప్రేక్షకుల్లో విద్యార్థులు కూడా వుండవచ్చుగానీ వాళ్ళెలాటి నీచానికీ తలపడలేదు.

"కృష్ణన్. మీలాటి అనుభవంగల అధికారికి కొన్ని వాస్తవాలు వివరించవలసి వస్తున్నందుకు చింతిస్తున్నాను.

అపరాధ పరిశోధన పోటీ-130
[ఫలితాలు]

మే '79 నెల "అపరాధ పరిశోధన పోటీ—130"కి సరియైన సమాధానాలు:

1. బాలలు.
2. కోర్టుల్లో.
3. నిజం.
4. భుట్టో.
5. పేరుకోసం.

పై జవాబుల ప్రకారం ఐదుగురు పాఠకులు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఆగస్టు '79 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎన్. గణపతి, ట్రేడ్స్‌మెన్, సి.ఇ.డి/డి. ఓ.ఎస్., శ్రీహరికోట-524 124.

(2) శ్రీ యర్రా రాము, S/o యర్రా ఆదినారాయణరావు, ఉప్పలూరు, భీమవరం-తాలూకా, ప.గో. జిల్లా.

(3) శ్రీమతి బెహరా సూర్యకుమారి, C/o సి.రామనారాయణ రావు, చదువులవారి ఇల్లు, ఉడ్ పేట, అనకాపల్లి (విశాఖ జిల్లా).

(4) శ్రీమతి జి. ఉమాదేవి, W/o జి. పాండురంగారావు, ఆఫీస్ ఆఫ్ ద ఎ. ఇ. ఎన్. (Con.), సౌత్ ఈస్టరన్ రైల్వే, పోస్టు మానేంద్రగఢ్-497 442, జిల్లా-సర్ గుజా(మధ్యప్రదేశ్)

(5) శ్రీమతి యం. లలిత, C/o మాధురి ఉమామహేశ్వర రావు, మాధురి స్ట్రీట్, రాజమండ్రి-1.

రేపు ప్రదర్శన జరగబోతుంది. ప్రదర్శన కార్యక్రమాన్ని ఎలాటి దౌర్జన్యం జరక్కుండా రూపొందించుకున్నారు. శాంతియుత ప్రదర్శన జరుగుతుంది. ప్రదర్శనలోని అంశాలు నివేదిక రూపంలో మీకు సమర్పించారు. మేం కమీష్నర్‌తో చర్యలు జరిపి ఒప్పందం కుదుర్చుకున్నాం. విద్యార్థులు మా ఆజ్ఞలను పాలిస్తున్నారు. అలాటి విద్యార్థులు రేపు ప్రదర్శన జరుగుతుందనగా ఇవాళ దౌర్జన్యానికి తలపడతారా? ఇది ప్రదర్శన కెంత హానికరమో వూహించండి!"

కృష్ణన్ పెదవులు చప్పరించాడు.

"అంతేకాదు," మళ్ళీ అన్నాడు జాన్, "ప్రదర్శనలో విద్యార్థులతోపాటు విద్యార్థినులు కూడా పాల్గొంటారు. తోటి విద్యార్థినులపట్ల అంత అమానుషంగా ప్రవర్తించడం హైద్రాబాదు చరిత్రలో ఇంతవరకు జరగలేదు. హింస అన్నం పెట్టదని విద్యార్థులు ఎప్పుడో గుర్తించారు."

"అదీ సంగతి!" అన్నాడు లాల్ లేచి నిలబడి, "కృష్ణన్, మధ్యాహ్నం ఒక శవం పంపించాను, అందిందా?"

"అందింది. త్వరగా వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వండి!" కసిరాడు కృష్ణన్.

"వస్తాం. ఆ శవాన్నిబట్టి ఏం అర్థమైంది? తెరవెనుక ఏదో ముఠావుందని బోధపడింది కదా? ప్రొఫెసర్ హత్యతో స్టూడెంట్స్‌కి సంబంధంలేదని తేలిపోయింది కదా? ఇక, ఇప్పుడు నారాయణగూడ సంఘటనతో కూడ సంబంధం లేదని అర్థమైందనుకుంటాను?" అడిగాడు లాల్.

కృష్ణన్ అడ్డంగా తలూపాడు: "మేం అరెస్టు చెయ్యడానికి వచ్చాం"

డిటెక్టివ్ ఫటాపట్!

—న్యూటన్

"ఓ.కె! క్యారీ ఆన్! అందర్నీ అరెస్టుచేసి లోనికి తొయ్యండి! ఆ తర్వాత రక్తపాతం, దహనకాండ తిలకిస్తూ ఆనందించండి."

"బెదిరిస్తున్నారా?"

"కాదు. నిర్దోషులమీద నేరం మోపితే పర్యవసానం ఎలా వుంటుందో సూచిస్తున్నాను. ఈ రోజు మీరు వీళ్ళని అరెస్టు చేస్తారు. రేపుదయం విద్యార్థులంతా రెచ్చిపోయి దౌర్జన్యానికి పాల్పడతారు. దాన్ని ఆసరాగా చేసుకుని అవకాశవాదులు రంగంలోకి దూకుతారు. అప్పుడు మీరెన్ని తుపాకీగుళ్ళు ప్రయోగించినా ప్రయోజనం వుండదు-జరగవలసిన నష్టం జరిగిపోతుంది. ఆ నష్టాన్ని భగవంతుడు కూడా భర్తీ చెయ్యలేడు!"

లాల్ ఇంకా అన్నాడు, "అడుగువేసేముందు ఆలోచించండి. ఒక్క తప్పటడుగు వేశారంటే పరిస్థితి మీ చేతిలో వుండదు! కృష్ణన్, నా మాటలమీద విశ్వాసం వుంటే మీ నిర్ణయం మార్చుకోండి. జరుగుతున్న సంఘటనలకి విద్యార్థులతో సంబంధంలేదని నేను హామీ ఇస్తున్నాను."

కృష్ణన్ ఆందోళనగా చూశాడు. కొన్ని క్షణాలు మౌనంగా ఆలోచించాడు. ఆ తర్వాత లాల్‌కి షేకాండిచ్చి, తన బలగానికి సైగచేసి, వెనక్కి తిరిగి బయటికి దారితీశాడు.

ఉద్రిక్తత సడలింది. విద్యార్థులు తేలిగ్గా వూపిరి వదిలి, కృతజ్ఞతాపూర్వకంగా చూశారు.

శీతల్‌ప్రసాద్, లాల్ చెయ్యి పట్టుకుని, "ఈ క్షణాన మీరిక్కడ లేకపోతే చాలా ఘోరం జరిగివుండేది. రేపు మా ప్రదర్శన స్థానంలో దహనకాండ చెలరేగేది!"

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 10: చచ్చిపోయేముందు మనుమరాలి పెళ్ళి చూడాలని తల్లి పట్టుపట్టడంతో 12 ఏళ్ళ కూతురికి వివాహం చేయటానికి నిశ్చయించాడు రాజారావు. కాని అతనివద్ద డబ్బు లేదు. కూతురుపెళ్ళికి అప్పు తీసుకుంటున్నట్లు ప్రామిసరీనోటు వ్రాసి కృష్ణకాంత్ దగ్గర నాలుగువేలు తెచ్చి శుభకార్యం అయిందనిపించాడు.

ముసలమ్మ నిక్షేపంలా ఉంది కాని, చేసిన అప్పు దెయ్యమై అతనికి నిద్రాహారాలు లేకుండా చేసింది. ఎన్నిసార్లు అడిగినా అప్పు తీర్చకపోయేసరికి కృష్ణకాంత్, రాజారావు ఇంట్లో విలువైన వస్తువులను స్వాధీనపరచుకున్నాడు, పెద్దల సమక్షంలో.

ఇది అన్యాయమంటూ కోర్టు కెక్కాడు రాజారావు.

న్యాయనిర్ణేతగా మీ తీర్పు ఏమిటి?

నిబంధనలు: మీ తీర్పు ఒక పోస్టుకార్డుసైజు తెల్లకాగితంపై వ్రాసి, 7-7-'79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హో౦.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. మాకు వచ్చిన జవాబులలో అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు సెప్టెంబరు '79 నెల సంచికలో చూడండి.

మే '79 పోటీ ఫలితాలు

తీర్పు: నరసయ్య దావా చెల్లదు.

బాలాజీ రు. 1000/-లు ఇస్తానని నరసయ్యతో చెప్పలేదు. వెంకట్రావుతో చెప్పాడు. కనుక ఒప్పందం కుదిరింది వెంకట్రావుకూ, బాలాజీకి. ఒప్పందంలో భాగస్థుడుకాని నరసయ్యకు-ఒప్పందం అమలుజరపమని కోరే అధికారంలేదు. ఆ డబ్బు అతడు వెంకట్రావునుండీ, వెంకట్రావు బాలాజీనుండి రాబట్టుకోవాలి.

ఈనెల న్యాయ నిర్ణేత: శ్రీ జి. రాంలింగారెడ్డి, పోస్టు-వల్లాల, నల్లగొండ జిల్లా.

అన్నాడు.

"దటీట్ రైట్. డియర్ ఫ్రెండ్స్, ప్రొఫెసర్ హత్య, నారాయణగూడ సంఘటన, దుష్టులు మిమ్మల్ని రెచ్చగొట్ట డానికి వేసిన పన్నాగాలు. మిమ్మల్ని రెచ్చగొట్టి, తమ ఆశయాలు సాధించుకోడానికి వేస్తున్న ఎత్తులు. దుష్టుల చర్యలకి మీరేమాత్రం రెచ్చిపోకుండా సహనంతో ప్రవర్తిస్తే, సాధ్యమైనంత త్వరలో మేం వాళ్ళని పట్టు కుంటాం-మీరు మాతో సహకరించాలి" అన్నాడు లాల్

9

రాత్రి తొమ్మిది గంటలైంది.

ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్ ఒక ఎత్తైన, భారీ మనిషితో హోటల్ మయూర్‌లో ప్రవేశించాడు. ఆ మనిషి వయసు 50 పైన వుంటుంది. తలమీద చాలావరకు వెంట్రుకలు నెరిశాయి? అతను పొడవాటి నల్లకోటు ధరించాడు. ముఖం పూర్తిగా కన్పించకుండా టోపీ కిందికి లాగాడు. అతని పిల్లిగెడ్డం, కళ్ళద్దాలు, కదలిక.... వీటినిబట్టి చూస్తే అతను ప్రొఫెసర్‌లా వున్నాడు.

బాలకృష్ణన్ ఆ ప్రొఫెసర్‌తో రూం 124 చేరుకున్నాడు. రూము దగ్గరవున్న మఫ్టీ కానిస్టేబిల్ శాల్యూట్ చేసి వినయంగా చూశాడు. కృష్ణన్ గది తలుపు తెరవమని ఆదేశించాడు.

కానిస్టేబిల్ తలుపు తెరిచాక ఇద్దరూ లోనికెళ్లారు. కృష్ణన్ లైటు వెలిగించి గదిని కాంతివంతం చేసాడు. ఇప్పుడు గదిలో ప్రతీదీ చక్కగా, స్పష్టంగా కన్పిస్తు న్నాయి.

అపరాధ పరిశోధన పోటీ-132

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో **75** పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ **75** పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు **7-7-'79** తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు'79నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. దీనిని పూర్తిగా నిషేధించాలని కొందరు పట్టుపట్టు పట్టుతున్నారు——? (గోవధ, మద్యపానం.)

2. వీరిలో ఎక్కువగా దొంగలుంటారని చాలామంది అనుమానం——? (సన్యాసులు, సోమరులు.)

3. వీధి వీధిలో అంతటా నేడు ఇది కనిపిస్తుంది——? (మురికి, ముష్టెత్తటం.)

4. ఈ విధంగా తాము ఎన్నటికైనా సంపన్నులు కాగలమని కొందరి ఆశ——? (లాటరీ వలన, పొదుపు వలన.)

5. పత్రికలలోకెల్లా యీ పత్రిక నడపటము కత్తిమీద సాము లాంటిదే——? (దిన పత్రిక, రాజకీయ వార పత్రిక.)

కృష్ణన్, ప్రొఫెసర్‌ని టేబిల్‌మీద వున్న సూట్‌కేసు చూపించి దాని దగ్గరికి దారితీశాడు. ప్రొఫెసర్ అతన్ని వెంబడించాడు.

కృష్ణన్ అన్నాడు: "మీక్కావలసిన నోట్‌బుక్ ఈ సూట్‌కేసులోనే వుంది. సూట్‌కేసులోని వస్తువుల్ని పరిశీలించినప్పుడు అది కన్పించింది-నీలిరంగు కవరు తొడిగివున్న నోట్‌బుక్-కదూ?"

ప్రొఫెసర్ తలూపాడు.

"అవును. ఆ నోట్‌బుక్కే నాక్కావాలి. తీసి ఇవ్వండి."

కృష్ణన్ క్లిప్స్ తొలగించి సూట్‌కేసు తెరిచాడు. లోపల దుస్తులు, ఇతర వస్తువులూ వున్నాయి. వాటన్నిటినీ బయటికి తీస్తూ చూడసాగాడు....కాస్సేపటికి సూట్‌సేసు ఖాళీ అయిపోయింది గానీ నోట్‌బుక్ కన్పించలేదు.

ఇన్‌స్పెక్టర్ కంగారుగా సూట్‌కేసుని కిందా మీదా చేశాడు.

నోట్‌బుక్ లేదు.

ఆందోళనతో అతని నుదుటిమీద ముడతలేర్పడ్డాయి.

కళ్లు మిటకరించి ప్రొఫెసర్ని చూశాడు:

"నా కాశ్చర్యంగా వుంది ప్రొఫెసర్! నిన్న ఉదయం నోట్‌బుక్ సూట్‌కేసులో వుంది....ఇవాళ ఏమయింది? గదిలో కెవరొచ్చారు? గది బయట పహరా వుండగా లోనికెవరొస్తారు? ఓహ్-ఆగండి....ఈ ఉదయం మిస్టర్ లాల్-డిటెక్టివ్-తన పార్ట్‌నర్‌తో ఇక్కడి కొచ్చాడు. బహుశ వాళ్లు తీసికెళ్లి వుండవచ్చు-ఒక్క-క్షణం, ఫోన్ చేసి తెలుసుకుంటాను."

కృష్ణన్ గబ గబ ఫోన్‌వేపు కదిలాడు.

"రచయితలతో ముఖాముఖి"

అంధవరపు మల్లిబాబుగారికి,

'కాకతాళీయం' అనే పేరుతో "క్లూ" పత్రికలో ప్రచురించిన నవలే, అపనలో 'వెంటాడిన వ్యక్తులు' కథగా అచ్చు అయింది. ఒకే రచయిత, ఒకే ఇతివృత్తం, ఒకే నెలలో రెండు పత్రికలలో రావటం గురించి మీ సమాధానం ఏమిటి?

ఎన్. సత్యానంద్, బెల్లంపల్లి.

'కాకతాళీయం' నవలను 'క్లూ' పత్రికకు పంపిన మాట వాస్తవమే. దానితోపాటు మరికొన్ని రచనలనుకూడా పంపాను. కొన్ని రోజుల తర్వాత 'క్లూ' ఆగిపోయిందంటూ ఎడిటర్ శ్రీసాయిశ్రీగారు ఉత్తరం రాస్తూ, నా రచనలన్నీ త్రిప్పి పంపేరు, కాకతాళీయం నవల మినహా! ఆ నవల విషయమై ఉత్తరం రాసేను. ఇంతవరకు జవాబు లేదు. అదే నవలను కొద్ది మార్పులతో 'వెంటాడిన వ్యక్తులు' కథగా వ్రాసి అపనకు పంపాను. అది అపనలో ప్రచురణకు తీసుకున్నట్లు తెలియజేసి ప్రచురించారు. కొద్ది రోజుల తర్వాత నా నవల 'క్లూ'లో పడిందని ఎవరో చెబితే, మార్కెట్‌లోకి వెళ్ళి చూసేను. అంతవరకూ నాకు తెలియదు. ఇలా జరుగుటం నా దరదృష్టంగా భావిస్తున్నాను.

—అంధవరపు మల్లిబాబు.

'కాకతాతీయిం' నవలను ప్రచురించవద్దనీ, త్రిప్పి పంపమనీ శ్రీ మల్లిబాబుగారు వ్రాశారు. నేను ఊరిలో లేకపోవటంవల్ల, పొరపాటున అది "క్లూ"లో ప్రింట్ అయింది. ఇందులో రచయితది ఏ తప్పులేదు. ఇలా జరిగినందుకు చాలా విచారిస్తున్నాను.

—శ్రీసాయిశ్రీ, ఎడిటర్ 'క్లూ'.

అతని మాటలు విని ప్రొఫెసర్‌కి కోపం వచ్చింది.

"ఇన్‌స్పెక్టర్, మీరొక అమూల్యమైన వస్తువును పోగొట్టారు! మీరు పూర్తిగా మూర్ఖంగా ప్రవర్తించారు! ఓహ్! మీరిలా ప్రవర్తిస్తారని నేను వూహించానా? తప్పంతా నాదే. అనవసరంగా ఒకరోజు అదనంగా ఢిల్లీలో వుండిపోయాను! గాడ్, విధి ఎంత చిత్రమైనది! ఆ నోట్‌బుక్ కోసమే నేను ఢిల్లీ వెళ్లాను. కానీ, అదే రోజున ప్రొఫెసర్ బయలుదేరి ఇక్కడికొచ్చేశాడు!"

ప్రొఫెసర్ ఆవేశం తెచ్చుకుని మళ్లీ అన్నాడు:

"ఇన్‌స్పెక్టర్! మీ తెలివితక్కువతనం వలన కోహినూర్ వజ్రంకంటే అత్యంత విలువైన వస్తువును జారవిడుచుకున్నాను. బహుశ ఈపాటికది శత్రువులకి చిక్కివుంటుంది! ఓహ్! నేనెందు కనవసరంగా ఢిల్లీలో వుండిపోయాను!"

కృష్ణన్, ప్రొఫెసర్ మాటల్ని సహిస్తూ, ఫోన్‌లో నాలుగు నిమిషాలు లాల్‌తో మాట్లాడాడు. ఆ తర్వాత రిసీవర్ పెట్టేసి ప్రొఫెసర్ వేపు తిరిగాడు, "డిటెక్టివ్‌లు ఆ నోట్‌బుక్‌ను ఇక్కడనుంచి తీసికెళ్లలేదట" అన్నాడు.

"నాకు తెలుసు" అన్నాడు ప్రొఫెసర్, పళ్లునూరుతూ. "అనుభవంగల మీలాటి అధికారి అనుచితంగా ప్రవర్తించడం చాలా విచారకరం, ఇన్‌స్పెక్టర్! ప్రొఫెసర్ శవాన్ని ఇక్కడ్నుంచి తరలించినప్పుడే సూట్‌కేసు కూడా తొలగించవలసింది. ప్చ్! ఇప్పుడేమిటి చెయ్యడం?"

ప్రొఫెసర్ అసహనంగా చేతులు నలుపుకున్నాడు, "ఇన్‌స్పెక్టర్, ఆ నోట్‌బుక్‌ని మీరు తెరిచిచూశారా?"

కృష్ణన్ తలూపాడు.

"లోపలి విషయాలు చదివారా?" ప్రొఫెసర్ అడిగాడు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 7-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అవసరమయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 7/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. 20 కాపీలుకు పైన తీసుకుంటె 20% కమీషన్ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 80/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము. దీనివల్ల మీకు ఖర్చులు కూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ'లో చేరండి!

"ఎలా చదవాలి? ఆ నోట్ బుక్ అంతా విచిత్రమైన భాషలో వ్రాసివుంది" అన్నాడు కృష్ణన్.

"ఓహ్!" అర్చాడు ప్రొఫెసర్, "అదే నోట్ బుక్! దాని మూల్యం అమెరికా వార్షిక బడ్జెట్ తో సమానం! రండి, ఇకవెళదాం! మీ మూర్ఖత్వానికి నేనెన్నడూ క్షమించను! నా దృష్టిలో మీరు-మీరు___"

"ఆవేశపడకండి" ప్రశాంత స్వరంతో అన్నాడు కృష్ణన్, "ఆ నోట్ బుక్ అంత విలువైనదని నేను కలగన్నానా! ఇంతకీ ఆ నోట్ బుక్ లో ఏముంది?"

"ఎలా చెప్పాలి ఇన్ స్పెక్టర్!" చల్లబడుతూ అన్నాడు ప్రొఫెసర్, "ఆ నోట్ బుక్ విలువ మీకెలా తెలుస్తుంది? ప్రొఫెసర్ శర్మ దానిలో హింస, అరాచకత్వం, ఆందోళనలను సృష్టించే కొన్ని సంఘ వ్యతిరేక శక్తుల ఉనికిని గురించి తెలిపే సమాచారం భద్రపరిచాడు!"

కృష్ణన్ కి ఇంకా విపులంగా బోధపడలేదు ప్రొఫెసర్ ఏం చెప్పాడో పట్టించుకోదలచలేదు. రెండు రోజులనుంచీ అతను క్షణం తీరికలేకుండా ఆలోచిస్తున్నాడు. కొత్త సమస్యల్ని మనసులోకి జొరబడనీయకుండా గబ గబ బయటికి దారితీశాడు.

ప్రొఫెసర్ కసురుకుంటూ వెంట వెళ్లాడు.

బయట జీపు ఎక్కాక కృష్ణన్ ప్రొఫెసర్ ని ఖైరతాబాద్ లో ఒక ఇంటిముందు డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు.

10

మాయమైన నోట్ బుక్ కోసం ఇన్ స్పెక్టర్ ని హడలగొట్టిన ప్రొఫెసర్ పేరు మోగీంద్రనాధ్ శుక్లా. రిటైర్డ్ హిస్టరీ ప్రొఫెసర్. వయసు 50. భార్య గతించి ఇరవై ఏళ్ళయింది. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ధనవంతుల వంశ

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—7—'79 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాంపై వ్రాసి పంపాలి. హో౦.డె. సభ్యులు తమ నెంబర్లను స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు సెప్టెంబరు '79 నెల సంచికలో చూడండి. *

మే '79 పోటీ ఫలితాలు

(1) మే '79 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గుహ లోనికి వెళ్లాలి! గుట్టు తెలుసు కోవాలి!!

పంపినవారు: శ్రీ యం. శంకరరెడ్డి, ప్రొ: శ్రీ కృష్ణా సైకిల్ షాప్, మెయిన్‌రోడ్, బెల్లంపల్లి-504 251.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

వనితకు ఆరాటం! వలపుల పోరాటం!!

పంపినవారు: శ్రీమతి ఏ. వీ. సుబ్బలక్ష్మి, 6-6-37, కవాడిగూడ, సికింద్రాబాదు.

పై విజేతలు ఇరువురికి రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

మైనా ఉద్యోగం చెయ్యడానికి కారణం చరిత్రపట్ల వున్న ఆసక్తి.

రిటైరైన తర్వాత ఇంట్లోనే పెద్ద లైబ్రరీ ఏర్పాటు చేసుకుని, పరిశోధనలు చేస్తూ వాటిని పుస్తక రూపంలో వెలువరించసాగాడు.

ప్రస్తుతం అతను బంగళాలో వంటమనిషి రంభ, ఆమె భర్త పింగ్‌ళతో వుంటున్నాడు. వాళ్ళేగాక అతనిదగ్గర సెక్రటరీగా అనూరాధ పనిచేస్తోంది. ఆమె ముప్పైఏళ్ళ విధవ. ఉదయం పది గంటలకి వచ్చి రాత్రి ఎనిమిది గంటల వరకు వుంటుంది.

ఆ రాత్రి ప్రొఫెసర్ శుక్లా జీపు దిగి, ఇన్‌స్పెక్టర్‌కి గుడ్‌నైట్ చెప్పి, గేటు తెరుచుకుని లోని కడుగులేస్తోంటే ఎంతో నిరాశ అలుముకుంది. అత్యంత విలువైన నోట్ బుక్ శత్రువుల హస్తగతమైంది!

ఆందోళనగా అతను పెద్ద పెద్ద అంగలేస్తూ మెట్లెక్కు తోంటే, వరండాలో అనూరాధ కన్పించింది-చిరునవ్వు నవ్వుతూ. ఆమె చేతిలో ప్రొఫెసర్‌కి ఒక నీలిరంగు కవరు కన్పించింది.

ప్రొఫెసర్ ఆమెని చేరుకుని పరీక్షగా చూశాడు. ఆమె అలాగే నవ్వుతూ ఆ కవరు అతని చేతిలో పెట్టింది. ప్రొఫెసర్ ముఖం చిట్లించి కవరుమీది అక్షరాల్ని చదివాడు-స్త్రీ హస్తాక్షరాలు. ఆ దస్తూరీతో అతనికి పరిచయం లేదు. కవరుమీద 'పర్సనల్' అని వ్రాసివుంది.

ప్రొఫెసర్ అనూరాధని చూశాడు ప్రశ్నార్థకంగా.

"ఈ ఉత్తరం ఎవరో అమ్మాయి-ఆమె ఎవరో నాకు తెలీదు-లేడీ సైకిల్‌మీద వచ్చి ఇచ్చి వెళ్ళింది" అందామె.

ప్రొఫెసర్ మాట్లాడకుండా కవరుతో స్టడీ రూంలోకి

పాఠకుల అభిప్రాయాలు :

సప్లిమెంట్‌లో 'ముష్టిదాని పాట' నవలకు అద్భుత రూప కల్పన గావించిన రచయిత కెంపోరావుగారికి నా అభినందనలు. 'అందరూ ఖూనీకోర్లే' మినీ సీరియల్ ముగింపు వింతగా ముగిసింది. —యం. ఏ. సలీమ్ త్తర్, మంచిర్యాల.

కథలలో మోదుకూరి జతీంద్రశర్మగారి 'చదరంగపు ఆటగాడు,' అజీజ్‌గారి 'ఇంద్రజాలికుడు' చాలా బాగున్నాయి. పాఠకుల ప్రశ్నలకు మీ సమాధానాల శీర్షిక తీసివేయడం చాలా పెద్ద లోటు.

—కె. ఎస్. ఎస్. శర్మ, జమూల్ సిమెంట్ వర్క్స్.

సుజనశ్రీగారి 'అందరూ ఖూనీకోర్లే' సీరియల్ మంచి ఉత్సాహంగా, సస్పెన్స్‌తో సాగింది. వసుంధరగారి 'అడుగు ముందుకువేస్తే చస్తావ్' సీరియల్ మమ్మల్ని కథ వెంట అలా అలా పరుగులెత్తిస్తున్నది. మొత్తంమీద అపనలోని కథలన్నీ హైలైట్. —నీలకంటి రామకృష్ణ, సంగారెడ్డి.

ఈ నెల కథలన్నీ వెరైటీగా ఉన్నాయి. సికిందర్‌గారి 'పరువు ఖరీదు' మొదటిభాగం ఉత్సాహంగా నడిచింది. రెండో భాగం 'మాయమైన వంటగత్తె' కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాము. కార్టూన్లు, జోక్స్ పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తున్నాయి. కార్టూన్ల సంఖ్య మరికొంచెం పెంచండి.

—నండూరి శైలజ, మద్రాసు.

నా కథ 'చదరంగపు ఆటగాడు'లో రెండుతప్పులు దొర్లేయి. 134వ పేజీ తొమ్మిదవ లైనులో...."ఒక్కో చదరంగపు పావు రెండు తులాల బంగారంతో" అని ఉండాలి. తులం అని ప్రింటైంది. అలాగే 147వ పేజీ నాల్గవలైనులో...."ఆ అరపై నాలుగు తులాల బంగారు పావులను" అని ఉండాలి. తులాలు అన్న మాట పడలేదు. పాఠకులు దయచేసి పై సవరణ చూసుకొన ప్రార్థన. —మోదుకూరి జతీంద్రశర్మ.

దారితీశాడు.

టేబిల్ లాంప్ వెల్గించి, రివాల్వింగ్ ఛైర్‌లో కూచొని కవరు చించాడు.

కవరులోంచి ఒక మడత పెట్టివున్న తెల్లకాయితం బయటపడింది.

మాయమైన నోట్‌బుక్ గురించి ఆందోళన ఇంకా తగ్గలేదు. అందువల్ల పరధ్యానంగా కాయితం మడత విప్పిచూశాడు. ఆ తర్వాత నెమ్మదిగా చదవడం ప్రారంభించాడు....

చదువుతోంటే అతని నుదుటిమీద ముడతలేర్పడ సాగాయి. కనుపాపలు వేగంగా కదలసాగాయి. కను రెప్పలు వేగంగా కొట్టుకోసాగాయి.

ఇంతలో బయటినుంచి అరుపు విన్పించింది:

"ప్రొఫెసర్, నేను వెళ్తున్నాను.

అది సెక్రటరీ అనూరాధ గొంతు.

ప్రొఫెసర్ తేరుకుని సమాధాన మిచ్చాడు, "ఓహ్, చాలా రాత్రయింది! మిసెస్ రాధ, మీరిక వెళ్ళండి.... గుడ్‌నైట్."

"గుడ్‌నైట్!"

ధడాలున తలుపు మూసుకున్న శబ్దం.

ఉన్నట్టుండి ప్రొఫెసర్‌కి సన్నగా వణుకు ప్రారంభమైంది. ఇందాక తను చదివిందేమిటి?

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda Hyderabad-500 029,
and Printed at Kranti Press,
Madras-600 001.